

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత
వెలుగు
12.01.2019
www.v6velugu.com
శనివారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 327 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



సీజే బదిలీ

కోల్‌కతా హైకోర్టు సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్

కొలీజియం సిఫార్సు

మన హైకోర్టు సీజేగా పని చేసింది పది రోజులే

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ భాస్కరన్ నాయర్ రాధాకృష్ణన్ బదిలీ కానున్నారు. ఆయన్ను కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మన హైకోర్టు సీజేగా జనవరి 1వ తేదీనే ఆయన బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే. పది రోజులకే ఆయన్ను బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది. దీనిపై రాష్ట్రపతి ఆమోదముద్ర వేశాక ఆ మేరకు కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. మన హైకోర్టుకు కొత్త సీజే వస్తారా, ప్రస్తుత న్యాయమూర్తుల్లో ఎవరైనా సీనియర్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి అవుతారా అన్నది వేచిచూడాల్సి ఉంది.

మిగతా 2లో

వీసా రూల్స్ మార్చేస్తా

హెచ్1బీపై మెత్తబడ్డ ట్రంప్

స్కిల్ ఉన్నోళ్లు నిశ్చింతగా ఉండండి.. సిటిజన్‌షిప్ వచ్చేలా చేస్తా

వీసా రూల్స్‌ను సరళీకరిస్తా.. ట్విటర్ వేదికగా భరోసా

భారత ఐటీ నిపుణులకు ఊరట.. మంచి పరిణామమని హర్షం



వాషింగ్టన్:

బై అమెరికన్.. హైర్ అమెరికన్..
ఇక్కడి జాబ్‌లు ఇక్కడోళ్లకే..
ఇతర దేశాల వాళ్లను తీసుకుంటే పన్నులేస్తా..

...అంటూ ఇన్నాళ్లూ అటు కంపెనీలను, ఇటు డాలర్ కలలతో అమెరికాలో అడుగుపెట్టినవారికి కంటిమీద కునుకు లేకుండా చేసిన ప్రెసిడెంట్ ట్రంప్ కాస్త మెత్తబడినట్టు కనిపిస్తున్నది. ఇకపై రూల్స్, ట్యాక్స్, ఆర్డర్లు అంటూ హెచ్1బీ వీసాదారులను వేధించబోనని సంకేతాలిచ్చారు. ఆ వీసాలను మరింత ఈజీ చేస్తామని చెప్పారు. నైపుణ్యం ఉన్నవాళ్లంతా అమెరికాలోనే ఉండొచ్చని, వారికి పౌరసత్వం కూడా ఇస్తామని చెప్పారు. శుక్రవారం ట్విటర్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ''హెచ్1బీ వీసాదారులు నిశ్చింతగా ఉండొచ్చు. వీసా నిబంధనలను త్వరలోనే మారుస్తాం. మరింత సరళీకృతం చేస్తాం. పౌరసత్వం కచ్చితంగా ఇచ్చేలా బాట వేస్తాం'' అని ట్వీట్ చేశారు. ఇది భారత ఐటీ నిపుణులకు పెద్ద ఊరటనిచ్చే వార్త. ఈ నిపుణుల్లో మన రాష్ట్రానికి చెందినవారు కూడా వేల సంఖ్యలో ఉన్న విషయం తెలిసిందే. ట్రంప్ భరోసా ఇవ్వడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ ఏళ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్న వారు కూడా ఇది మంచి పరిణామం అంటున్నారు. వీసా నిబంధనలు మారుస్తామన్న ట్రంప్.. ఆ మార్పులేంటన్నది మాత్రం వెల్లడించలేదు.

ఆ రెండేళ్లు దూకుడే దూకుడు

'మన జాబ్‌లు మనకే..' అన్న నినాదంతో అమెరికన్లను తనవైపు తిప్పుకొని అధ్యక్ష పగ్గాలు చేపట్టిన ట్రంప్ మొదటి రెండేళ్లు దూకుడుగా వ్యవహరించారు. హెచ్1బీ వీసాను కఠినతరం చేస్తూ అనేక రూల్స్ తెచ్చారు. ఆ వీసాపై అమెరికాలో పనిచేస్తున్నవారిని టార్గెట్ చేశారు. వారి వీసాలు పొడిగించేందుకు నానా కొర్రీలు పెట్టారు. ఏదో ఒక విధంగా ఐటీ నిపుణులను అమెరికా నుంచి బయటకు పంపాలని చూశారు. దీంతో భారత ఐటీ ఉద్యోగులు, కంపెనీలతోపాటు అమెరికా సంస్థలు కూడా గగ్గోలు పెట్టాయి. ఇటీవలే కొన్ని కంపెనీల ప్రతినిధులు వెళ్లి ట్రంప్‌ను కలిశారు. టాలెంట్ ఉన్నవారు ఉన్నవారు దేశం వీడితే అది అమెరికాకే నష్టమని చెప్పారు. వారితో జరిగే బిజినెస్ కూడా దారుణంగా దెబ్బతింటుందని వివరించారు. దీంతో ఆయన తన మనసును మార్చుకున్నట్టు కనిపిస్తోంది. టాలెంట్ ఉన్నవారు నిశ్చింతగా

మిగతా 2లో



జనరల్

ట్రైబల్ వర్సిటీకి గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రసర్కారుకు కేంద్ర ప్రభుత్వం సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి క్లాసులు.

04



దేశం - విదేశం

యూపీలో 'పొత్తు' పొడుపు

ఎస్పీ, బీఎస్పీ పోటీ చేసే సీట్లపై నేడు రానున్న క్లారిటీ.. ఒంటరిగానే ఎన్నికల బరిలోకి కాంగ్రెస్.

05




ప్లే

వన్డే వార్

ఆసీస్‌తో వన్డే సమరానికి కోహ్లీసేన రెడీ.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో శనివారం సిడ్నీలో తొలి వన్డే.

11



బిజినెస్

చిన్న జీతాల వారికీ లోన్లు

రూ.8 వేల నెల జీతం ఉన్న వారికి కూడా లోన్లు అందిస్తున్న ఫ్లెక్స్ సాలరీ యాప్.

10



బేస్‌ప్యాక్ మీ ఇష్టం

రూ.130 ప్యాక్‌లోనే మీక్కావాల్సిన 100 చానెళ్లను తీసుకోవచ్చు

వినియోగదారుడి ఇష్టానికే ఓకే చెప్పిన ట్రాయ్

కేబుల్, డీటీహెచ్ ఆపరేటర్లకు కొత్త నిబంధనలు

02



పల్లెలు బాగుపడాలె

ఫిబ్రవరి నుంచి మే వరకు పంచాయతీ పాలకులకు శిక్షణ

వారిని పల్లె ప్రగతి కోసం ఉద్యమకారులుగా తీర్చిదిద్దండి

అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం

కేంద్రంలో కొత్త సర్కార్ వచ్చాకే రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్

03

"పల్లెల అభివృద్ధితోనే సంపూర్ణ వికాసం సాధ్యం. సమగ్ర గ్రామ వికాసమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత బాగా పెరగాలి. ఇందుకోసం సర్పంచులకు, ఉప సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలి.

– ముఖ్యమంత్రి కేసీఆర్

పాండ్యా, రాహుల్‌పై వేటు

మహిళలపై వ్యాఖ్యల నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయం

మాట అదుపు తప్పితే రిజల్టేమిటో టీమిండియా క్రికెటర్లు పాండ్యా ,రాహుల్‌కు తెలిసొచ్చింది. ఓ టీవీషోలో ఆడవాళ్లను చులకన చేసి మాట్లాడిన ఆ ఇద్దరు క్రికెటర్లకు బీసీసీఐ దిమ్మతిరిగే షాకిచ్చింది. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడే వన్డే టీమ్ నుంచి ఇద్దరిపై వేటు వేసిన బీసీసీఐ అర్జెంటుగా ఇండియా వచ్చేయాలని ఆదేశించింది. అసలేం జరిగిందో తేల్చేందుకు ఓ కమిటీని కూడా వేసింది. 15 రోజుల్లో కమిటీ నివేదిక ఇచ్చాక ఈ ఇద్దరి సంగతి తేలుస్తామని, అప్పటి దాకా టీమ్‌కు దూరంగా ఉండాలని ఆదేశించింది.



11

"నన్ను తొలగించే విషయంలో సహజ న్యాయాన్ని పట్టించుకోలేదు. సెలక్షన్ కమిటీ కసరత్తు అంతా నన్ను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించడమే లక్ష్యంగా సాగింది. నాపై ఆరోపణలు, ఫిర్యాదు చేసిన వ్యక్తిని ఇప్పుడు సీబీఐ విచారణ జరుపుతోంది. ఆ నిజాన్ని కూడా కమిటీ పట్టించుకోలేదు

- రాజీనామా లేఖలో అలోక్ వర్మ



అలోక్ వర్మ గుడ్ బై

ఫైర్ సర్వీస్ డీజీగా చేరకుండానే ఉద్యోగానికి రాజీనామా

హైపవర్ కమిటీ తన వాదనలు వినలేదని ఆవేదన

నాలుగు రోజులుగా ఏం జరిగిందంటే..

జనవరి 8:
- అలోక్ వర్మ విషయంలో కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- ఆయనను సీబీఐ డైరెక్టర్‌గా కొనసాగిస్తూ ఆదేశం
- వారంలోగా హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకోవాలని సూచన

జనవరి 9:
- సీబీఐ డైరెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న అలోక్ వర్మ
- ఆస్తానా కేసు దర్యాప్తు అధికారుల బదిలీ నిర్ణయాలు రద్దు చేసిన వర్మ
- అలోక్ వర్మను పదవిలో కొనసాగించాలా వద్దా అన్నదానిపై సెలెక్ట్ కమిటీ సమావేశం, నిర్ణయం తీసుకోకుండానే వాయిదా

జనవరి 10:
- సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్ వర్మను తప్పిస్తూ సెలెక్ట్ కమిటీ నిర్ణయం
- వ్యతిరేకించిన ఖర్గే, 2:1 తో ఆమోదం
- ఫైర్ సర్వీసెస్ డీజీగా అలోక్ వర్మ బదిలీ
- తాత్కాలిక డైరెక్టర్ గా నాగేశ్వర్ రావుకు మళ్లీ బాధ్యతలు

జనవరి 11:
- ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు అలోక్ వర్మ ప్రకటన
- సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎం.నాగేశ్వర్ రావు
- అలోక్ వర్మ చేసిన బదిలీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు
- ఢిల్లీ హైకోర్టులో రాకేశ్ ఆస్తానాకు ఎదురుదెబ్బ
- ఎఫ్ఐఆర్ కొట్టేయాలన్న పిటిషన్ ను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు
- ఆస్తానాపై కేసు విచారణ 10 వారాల్లో పూర్తి చేయాలని సీబీఐకి ఆదేశం.

05



టెన్త్ మ్యాథ్స్..

నచ్చిన పేపర్ రాయొచ్చు

స్టూడెంట్స్‌కే ఎంపిక చేసుకునే చాన్స్

ఒకటో పేపర్ మ్యాథ్స్ స్టాండర్డ్, రెండో పేపర్ మ్యాథ్స్ బేసిక్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న సీబీఎస్ఈ

04



శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ గుర్తు కమలాన్ని చూపిస్తున్న ప్రధాని మోడీ

రామ మందిర నిర్మాణానికి

కట్టుబడి ఉన్నాం

రాఫెల్‌పై రాహుల్ అవాస్తవ ప్రచారం

లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే విజయం: అమిత్ షా

ఢిల్లీలో జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

హాజరైన ప్రధాని మోడీ, అద్వానీ, రాజ్‌నాథ్

రామ మందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉంది. రామ జన్మభూమిలోనే రామాలయాన్ని నిర్మించాలని కోరుకుంటున్నాం. కానీ అయోధ్యలో రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్న అయోధ్య కేసు విచారణను వేగవంతం చేయడానికి మేము ప్రయత్నిస్తున్నాం.

– బీజేపీ చీఫ్ అమిత్ షా

03

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
79.00	79.00	79.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
79.00	79.00	79.00

చిన్నారి శివసాయికి ఫిబ్రవరిలో ఆపరేషన్

హైదరాబాద్, వెలుగు: పోలియోతో రెండు కాళ్లు వంకరపోయి నడవలేకపోతున్న రామగుండానికి చెందిన చిన్నారి శివసాయికి ఫిబ్రవరిలో ఆపరేషన్ చేస్తామని సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుడు గురవారెడ్డి చెప్పారు. ఇటీవల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన శివసాయి సాయం చేయాలని కోరాడు. శివసాయికి వైద్యం అందించే బాధ్యతను తీసుకున్న కేటీఆర్ డాక్టర్లతో మాట్లాడారు. గ్రేటర్ టీఆర్ఎస్ నాయకుడు కట్టెల శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం శివసాయిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యులు వచ్చేనెల మొదటి వారంలో ఆపరేషన్ చేస్తామని చెప్పారు.

వాళ్లలో బతికే ఉన్నాడు

టెకీ ఇమ్మాన్యుయేల్ అవయవ దానం ఏడుగురికి కొత్త జీవితం

హైదరాబాద్, వెలుగు: చిన్న యాక్సిడెంట్ వల్ల బ్రెయిన్ డెడ్ అయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఏడుగురికి కొత్త జీవితం ఇచ్చాడు. భర్త నిర్జీవంగా పడి ఉన్నా బాధను దిగమింగుతూ అతని అవయవ దానమిచ్చేందుకు అంగీకరించింది భార్య. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న సిరిసిల్ల ఇమ్మాన్యుయేల్ (33).. జనవరి 3న రాత్రి 11 గంటలకు ఆఫీసు నుంచి టూ వీలర్‌పై ఇంటికొస్తుండగా నాగారం వద్ద బండికి కుక్క అడ్డొచ్చింది. బైక్ అదుపుతప్పి అతను కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 9న ఆయన బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు చెప్పారు. అతని అవయవాలను దానం చేయాలని ఇమ్మాన్యుయేల్ భార్య, కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ సిబ్బంది కౌన్సిలింగ్ ఇవ్వడంతో అంగీకరించారు. దీంతో ఇమ్మాన్యుయేల్ శరీరం నుంచి లివర్, కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు, కళ్లను సేకరించి అవసరమైన ఏడుగురికి అమర్చారు.

మన హంపి నంబర్ 2

చూడాల్సిన ప్రాంతాల్లో రెండో స్థానం

న్యూయార్క్: ప్రపంచంలో తప్పక చూడాల్సిన ప్రాంతాలపై న్యూయార్క్ టైమ్స్ రూపొందించిన జాబితాలో కర్ణాటకలోని హంపి రెండో స్థానంలో నిలిచింది. '2019లో చూడాల్సిన 52 పర్యాటక ప్రాంతాలు' పేరుతో ఈమధ్యే విడుదలైన ఈ జాబితాలో యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ ప్యూర్టరికో (అమెరికాకు చెందిన కరీబియన్ దీవుల్లో ఉంది) తొలి స్థానం సాధించింది. హంపికి చేరుకోడానికి ఇటీవలే హైదరాబాద్, బెంగళూరు నుంచి బళ్లారికి విమాన సేవలను ప్రారంభించారని ఎన్‌టీ పేర్కొంది. అక్కడి నుంచి హంపికి 25 మైళ్ల దూరమంది.



స్వరాష్ట్రంలో సింగరేణి వృద్ధి బాట

- ఐదేళ్లలో భారీగా లాభాలు
- ఉమ్మడి ఏపీతో పోలిస్తే 314 శాతం పెరుగుదల
- 122% పెరిగిన బొగ్గు రవాణా

హైదరాబాద్, వెలుగు:

తెలంగాణ రాష్ట్రం వచ్చాక సింగరేణి ప్రగతి పథంలో దూసుకెళుతోంది. 129 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఐదేళ్లలో గణనీయ వృద్ధి సాధించింది. దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలకు తలమానికంగా నిలుస్తోంది. 2009-14 మధ్య కాలంలో 90 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేస్తే.. రాష్ట్రం వచ్చాక 2014-19 మధ్యకాలంలో 200 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి 122 శాతం వృద్ధిని నమోదు చేసింది. తద్వారా కోల్ ఇండియాకు సవాల్ విసిరింది. ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపులోనూ భారీ వృద్ధిని సాధించింది. 2009-14 మధ్య 7 కోట్ల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించిన సంస్థ.. 2014 నుంచి ఇప్పటిదాకా 25 కోట్ల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించుకుంది. 257 శాతం వృద్ధిని నమోదు చేసింది. అమ్మకాల్లో 132 శాతం, నికర లాభాల్లో 314 శాతం వృద్ధిని సాధించింది.

యంత్ర వినియోగం భారీగా పెంచి..

సింగరేణి యాజమాన్యం యంత్ర వినియోగాన్ని బాగా పెంచింది. రూ.350 కోట్లతో కొత్త యంత్రాలను కొనుగోలు చేసింది. ఏరియా జనరల్ మేనేజర్ నెలనెలా సమీక్షిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటుండటంతో వృద్ధిలో ముందడుగేసింది. రాష్ట్ర విద్యుత్ సంస్థలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాల విద్యుత్తు సంస్థలకు బొగ్గు సరఫరాను విస్తరించింది. సింగరేణి నాణ్యమైన బొగ్గును అందిస్తుండటంతో కోల్ ఇండియాను కాదని ఇక్కడి నుంచే సంస్థలు బొగ్గు కొంటుండటంతో వ్యాపారం పెరిగింది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్తు అవసరాలు, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న డిమాండ్‌తో సింగరేణి తన 48 గనులతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ మరో 7 బ్లాకులను నిర్వహించాలని యోచిస్తోంది. ఇప్పటికే ఒడిశాలో 50 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్న నైనీ బ్లాకును చేపట్టింది. న్యూ పాత్రపురా బ్లాకునూ నిర్వహణకూ సన్నాహాలు చేస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మరో 6 కొత్త బ్లాకుల కోసం ప్రతిపాదనలు సింగరేణి సిద్ధం చేసింది.

ఉమ్మడి ఏపీలో, తెలంగాణ వచ్చాక సింగరేణి ఫలితాలు

అంశం	2009-14	2014-19	వృద్ధి
బొగ్గు రవాణా	90 లక్షల టన్నులు	200 లక్షల టన్నులు	122 శాతం
ఓబీ తొలగింపు	7 కోట్ల క్యూబిక్ మీటర్లు	25 కోట్ల క్యూబిక్ మీటర్లు	257 శాతం
అమ్మకాలు	రూ.5,600 కోట్లు	రూ.13,000 కోట్లు	132 శాతం
నికర లాభాలు	రూ.290 కోట్లు	రూ.1,200 కోట్లు	314 శాతం

వీసా రూల్స్ మార్చేస్తా: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడే ఉండొచ్చని, ప్రతిభ ఆధారిత (మెరిట్ బేస్డ్) ఇమిగ్రేషన్ విధానం తెస్తామని ఇటీవలే ప్రకటించిన ఆయన.. శుక్రవారం మరోసారి అదే మాటను చెప్పారు. ''హెచ్ 1బీ కోసం వచ్చిన దరఖాస్తుల్లో మంచి స్కిల్ ఉన్నవారిని తప్పకుండా ఎంపిక చేయాలి. వారికి ఎట్టి పరిస్థితుల్లో నో చెప్పొద్దు'' అని హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి నీల్సన్ ఉన్నతాధికారులకు సూచించారు. అదే సమయంలో వీసాల్లో మోసం, దుర్వినియోగంపై దృష్టి సారిస్తామని, నాన్-ఇమిగ్రెంట్ వీసాల్లో సంస్కరణలు తెస్తామని ఆమె చెప్పారు. అమెరికా పౌరసత్వ, ఇమిగ్రేషన్ సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) గత నవంబర్‌లోనే హెచ్ 1బీలో మార్పులు చేసింది. నైపుణ్యం ఉన్నవారు, అత్యధిక వేతనాలు అందుకుంటున్న వారికి మరింత భరోసా కల్పించింది.

సోషల్ మీడియాలో మనోళ్ల సంబురం

ట్రంప్ భరోసాపై భారత ఐటీ నిపుణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ''ట్రంప్ సార్.. మీ మాటలతో మాకిప్పుడు ఓ భరోసా వస్తున్నది. గ్రీన్‌కార్డును సులభతరం చేస్తే 10 లక్షల మంది మీకు ధన్యవాదాలు చెబుతారు'' అని జ్యోత్స్న శర్మ ట్వీట్ చేశారు. ''నేను ఇక్కడ 12 ఏళ్లుగా ఉంటున్నా. జే1 వీసాపై వచ్చా. తర్వాత హెచ్ 1బీ వీసా వచ్చింది. గ్రీన్‌కార్డు వీసా నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంది. నాలాగే ఎంతో మంది ఉన్నారు. మేమేమీ నేరస్థులం కాదు. రూల్స్ పాటిస్తాం. మాకు హెల్ప్ చేయండి'' అని రోనాల్డ్ హెరెరా అనే మరో టెకీ ట్వీట్ చేశారు.

బేస్‌ప్యాక్ మీ ఇష్టం


రూ.130 ప్యాక్‌లోనే మీక్కావాల్సిన 100 చానళ్లు

వినియోగదారుడి ఇష్టానికే ఓకే చెప్పిన ట్రాయ్

కేబుల్, డీటీహెచ్ ఆపరేటర్లకు కొత్త నిబంధనలు

ముంబై:

టీవీ చానళ్లు ఇక మీ ఇష్టం. మీరు చూడాలనుకున్న చానళ్లను మీ ఇష్ట ప్రకారం చూసేయొచ్చు. మొన్నటి దాకా బేస్ ప్యాక్ కాకుండా.. వేరే చానళ్లను మాత్రమే ఎంపిక చేసుకునే అవకాశం కల్పించిన టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్).. ఇప్పుడు ఆ బేస్ ప్యాక్‌లోనే నచ్చిన చానళ్లను ఎంపిక చేసుకునే అవకాశమిచ్చింది. ఇప్పటికే కొత్త ప్యాకేజీకి మారే అవకాశాన్ని జనవరి 31 వరకు పొడిగించిన ట్రాయ్.. శుక్రవారం చానళ్ల ఎంపికపైనా కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. చానళ్ల ఎంపికలో వినియోగదారుడికి పూర్తి స్వేచ్ఛనిచ్చింది. అంటే, బేస్ ప్యాక్ ఖరీదు రూ.130 కదా. ఆ 130 రూపాయల పరిధిలోనే ఫ్రీ చానళ్లు, పే చానళ్లు, బొకే చానళ్లు (గంపగుత్తగా వచ్చే చానళ్లు) లేదా అన్నీ కలిపి 100 స్టాండర్డ్ డెఫినేషన్ (ఎస్‌డీ) చానళ్లను తీసుకునేందుకు అవకాశం ఇస్తోంది. కొందరు బ్రాడ్‌కాస్టర్లు కొన్ని కొన్ని చానళ్లను కలగలిపి బొకే చానళ్ల రూపంలో ప్రకటనలిస్తున్నారని పేర్కొన్న ట్రాయ్ ఈ కొత్త నిబంధనలు విధిస్తూ ప్రకటనను జారీ చేసింది. వినియోగదారులు ఒక్కొక్క చానల్‌నూ బేస్ ప్యాక్‌లో ఎంపిక చేసుకోవచ్చని చెప్పింది. అంటే.. ఒక నెట్‌వర్క్ తనకు సంబంధించిన ఐదు లేదా అంతకన్నా ఎక్కువ చానళ్లను కలిపి బొకే రూపంలో ఇచ్చిందనుకుందాం. ట్రాయ్ కొత్త నిబంధనల ప్రకారం.. ఆ బొకేని తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆ బొకేలోని ఒక్కొక్క చానల్‌నూ తీసుకోవచ్చు. వినియోగదారులు జనవరి 31లోపు చానళ్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 1 నుంచి ఎంపిక చేసుకున్న కొత్త ప్యాక్ అమల్లోకి వస్తుంది. అంతేకాదు, బేస్‌ప్యాక్‌లో హెచ్‌డీ చానళ్లు కావాలంటే మాత్రం.. ఒక్కో చానల్‌ను రెండు కింద లెక్కిస్తారు. అంటే ఒక హెచ్‌డీ చానల్ రెండు ఎస్‌డీ చానళ్లతో సమానమన్న మాట. ఆ లెక్కన బేస్‌ప్యాక్‌లో 50 హెచ్‌డీ చానళ్లను ఎంపిక చేసుకోవచ్చు.



100 కన్నా ఎక్కువ కావాలంటే..

బేస్‌ప్యాక్‌లో 100 చానళ్ల కన్నా ఎక్కువ కావాలనుకుంటే.. మరో రూ.20 అదనంగా చెల్లించి ఇంకో 25 చానళ్లను తీసుకునే అవకాశం కల్పించింది ట్రాయ్. అంటే 150 రూపాయలకు బేస్‌ప్యాక్‌లో 125 చానళ్లను పొందొచ్చు. డీటీహెచ్ ఎలక్ట్రానిక్ ప్రోగ్రామ్ గైడ్ (ఈపీజీ) లేదా టీవీ మెనూల్లో ఒక్కో చానల్ ధరను (ఎంఆర్‌పీ) చూసుకునే వీలునూ వినియోగదారులకు కల్పించింది. కేబుల్, డీటీహెచ్ ప్రొవైడర్లు తమతమ కన్జ్యూమర్ ఇన్ఫర్మేషన్ చానల్‌ను రన్ చేయాలని, అందులో ఈ ధరల వివరాలను వెల్లడించాలని ట్రాయ్ ఆదేశించింది. బొకేలతో పాటు ఒక్కో చానల్ రేటునూ పొందుపరచాలని పేర్కొంది. జనవరి 31లోపు సబ్‌స్క్రైబర్లు కొత్త చానళ్లను ఎంపిక చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే డిష్ టీవీ తన వెబ్‌సైట్లో కొత్త రేట్లను పెట్టేసింది. అవసరమైతే ఈపీజీలో కనిపించే ఎంఆర్‌పీపై డిస్కౌంట్ ఇచ్చే డీటీహెచ్, కేబుల్ ఆపరేటర్లకు అవకాశమిచ్చింది. ఒక్క చానల్‌కు గరిష్ఠంగా రూ.19 ధరను ట్రాయ్ నిర్దేశించింది.

సీజే జస్టిస్ రాధాకృష్ణన్ బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు డిసెంబర్ 31 వరకూ జస్టిస్ రాధాకృష్ణనే సీజేగా వ్యవహరించారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి హైకోర్టులు విడిపోయాక అదే రోజున గవర్నర్ నరసింహన్ ఆయనతో రాష్ట్ర హైకోర్టు సీజేగా ప్రమాణం చేయించారు. 4 వ తేదీ దాకా సీజేతో పాటు న్యాయమూర్తులంతా విధులు నిర్వహించారు. జనవరి 7వ తేదీ నుంచి 18 వరకు హైకోర్టుకు సంక్రాంతి సెలవులున్నాయి.ఆ తర్వాత శని,ఆదివారాలు కూడా సెలవులే. దాంతో జస్టిస్ రాధాకృష్ణన్ స్వరాష్ట్రం కేరళ వెళ్లారు. ఆయన బదిలీ వార్త శుక్రవారం న్యాయవర్గాలకు తెలిసింది. తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన మర్నాడు జనవరి 2న సీజే అధ్యక్షతన న్యాయమూర్తులంతా (ఫుల్‌కోర్టు) సమావేశమయ్యారు. 'రాష్ట్ర హైకోర్టు 1.87 లక్షల పెండింగ్ కేసులతో ప్రారంభమైంది. సత్వర న్యాయం అందిస్తూనే పెండింగ్ కేసుల్ని బాగా తగ్గించాలి. ఇందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి పనిచేయాలి' అని ఈ సందర్భంగా మాట్లాడుతూ జస్టిస్ రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పెండింగ్ కేసులకు మోక్షం లభిస్తుందని భావిస్తున్న తరుణంలో ఆయన బదిలీ అవుతుండటంపై న్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



వేగంగా పూర్తి చేస్తారని పేరు

ప్రజాహిత వ్యాజ్యాల విచారణ వేగవంతంగా పూర్తి చేస్తారని జస్టిస్ రాధాకృష్ణన్‌కు పేరుంది. ఆయన 1959 ఏప్రిల్ 29న కేరళలో కొల్లంలో జన్మించారు. పాఠశాల విద్య అనంతరం కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1983లో తిరువనంతపురంలో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సివిల్, రాజ్యాంగపరమైన కేసుల్లో పట్టు సాధించారు. 2004 అక్టోబర్‌లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా, 2015న అదే హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో పదోన్నతిపై ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సీజేగా వెళ్లారు. 2018 జూలై 7న ఉమ్మడి హైకోర్టు సీజేగా వచ్చారు. హైకోర్టుల విభజన తర్వాత మన రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు.

పెట్టుబడుల్లో టాప్‌గేర్

రాష్ట్రానికి బడా కంపెనీల బారులు



- 'టీఎస్ ఐపాస్'తో మంచి ఫలితాలు
- దుబాయ్ పెట్టుబడుల సదస్సులో ఆకర్షిస్తున్న తెలంగాణ స్టాల్
- ఐదేళ్లలో 1.42 లక్షల కోట్ల పెట్టుబడులు
- 8,863 పరిశ్రమల ఏర్పాటు

హైదరాబాద్, వెలుగు:

పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ దూసుకుపోతోంది. నూతన పారిశ్రామిక విధానం 'టీఎస్ ఐపాస్' రాష్ట్రానికి కలిసొచ్చింది. మొదటి నుంచీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో రూ.1,42,848.71 కోట్ల పెట్టుబడులతో 8,863 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిల్లో అంతర్జాతీయ, జాతీయ సంస్థలున్నాయి. కొత్త పరిశ్రమలతో సుమారు 9 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి దొరుకుతోంది.

ప్రత్యేక ఆకర్షణ 'తెలంగాణ స్టేట్ స్టాల్'

ఈనెల 6 నుంచి దుబాయ్‌లో పెట్టుబడుల సదస్సు జరుగుతోంది. 13వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేకంగా నిలిచింది. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు ఔత్సాహిక పెట్టుబడిదారులకు, అంతర్జాతీయ కంపెనీలకు టీఎస్ ఐపాస్ గురించి వివరిస్తున్నారు. అనేక పెద్ద కంపెనీలను తెలంగాణ పారిశ్రామిక విధానం ఆకర్షిస్తోందని వారంటున్నారు.

15 రోజుల్లోనే 57 రకాల అనుమతులు

రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాదిలోనే ప్రభుత్వం టీఎస్ ఐపాస్‌కు రూపకల్పన చేసింది. ఆనాటి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రదీప్‌చంద్ర ఇందులో కీలకభూమిక పోషించారు. 2015 జూన్‌లో తొలిసారి రాష్ట్రంలో 17 పరిశ్రమల స్థాపనకు సీఎం కేసీఆర్ అనుమతి పత్రాలు అందజేశారు. పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే సమకూర్చడంతోపాటు అన్ని అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో జారీ చేసింది. పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ చొరవతో హైదరాబాద్ కేంద్రంగా అనేక మల్టీ నేషనల్ కంపెనీల యూనిట్లు ఏర్పాటయ్యాయి. కేవలం 15 రోజుల్లోనే 57 రకాల అనుమతులు ఇవ్వడం టీఎస్ ఐపాస్ ప్రత్యేకత. ఇందుకు సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో 'స్పెషల్ ఛేజింగ్ సెల్' ఏర్పాటైంది.

ఇవీ రాయితీలు

భారీ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం, మధ్యతరహాకు 70, చిన్నతరహా పరిశ్రమలకు 100 శాతం వ్యాట్, విద్యుత్ రాయితీలిస్తోంది. పావలా వడ్డీ రుణాలనూ అందిస్తోంది. 'టీ ఐడియా' ద్వారా 10,195 యూనిట్లకు రూ.1,658 కోట్లు, ఎస్‌పీపీ ద్వారా 8,994 యూనిట్లుకు రూ.542 కోట్లు, టీఎస్పీ ద్వారా 7,976 యూనిట్లకు రూ.363 కోట్ల ప్రోత్సాహకాలిచ్చింది.

టాప్-5 కంపెనీల రాక

- కొరియాకు చెందిన ఐకియా రూ.600 కోట్లతో ఫర్నీచర్, టెక్స్‌టైల్స్ యూనిట్ నెలకొల్పింది.
- కోకకోలా కంపెనీ వెయ్యి కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకొచ్చింది.
- చైనాకు చెందిన డాంగ్ ఫాంగ్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ వెయ్యి మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది.
- రూ.900 కోట్లతో ప్రొక్టర్ అండ్ గాంబుల్ కంపెనీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది
- రూ.400 కోట్లతో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ యూనిట్ పెడుతోంది.
- గజ్వేల్ నియోజకవర్గం ముప్పిరెడ్డిపల్లిలో రూ.500 కోట్లతో ఇన్నుమస్ ప్రాజెక్టు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

తరలి వస్తున్న దేశీయ కంపెనీలు

- విప్రో రూ.220 కోట్లతో 40 ఎకరాల్లో మహేశ్వరం వద్ద కాస్మొటిక్స్ యూనిట్ ఏర్పాటు చేస్తోంది.
- జాతీయ డ్రగ్స్ కంట్రోల్ అకాడమీ, జాతీయ ఫార్మా కోపియా కమిషన్ రెండో కార్యాలయాన్ని ముచ్చింతల్‌లో ఏర్పాటు చేయనుంది.
- బయోటెక్నాలజీ, బయో ఫార్మా రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, తయారీ రంగాల్లో ప్రవేశించే పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.60 కోట్లతో జీనోమ్ వ్యాలీలో బీహబ్‌ను ఏర్పాటు చేస్తోంది.

ఆర్టీసీ బస్సు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- 20 మందికి స్వల్ప గాయాలు

వికారాబాద్ జిల్లా, వెలుగు: పల్లెవెలుగు బస్సు బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి వద్ద ఈ ఘటన శుక్రవారం జరిగింది. వికారాబాద్ డిపో బస్సు 70 మందితో శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ వైపు వస్తోంది. పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. వికారాబాద్ నుంచి మైతాప్‌ఖాన్‌గూడ వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. స్పీడుగా వస్తున్న బస్సు గుంతల్లో పడి ముందు చక్రాలకున్న రాడ్ విరిగి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ధారూరు మండలం ధారూరు రైల్వేస్టేషన్‌కు చెందిన కిషన్, శంకర్‌పల్లికి చెందిన శ్యామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జేసీ అరుణకుమారి, ఆర్డీవో విశ్వనాథం బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రోడ్డుపై గుంతలున్న విషయం డ్రైవర్‌కు తెలుసని, అయినా స్పీడ్‌గా నడపడంతోనే బస్సు బోల్తా కొట్టిందని ప్రయాణికులు చెప్పారు.





శుక్రవారం రావిర్యాల వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, అంబులెన్సు

అంబులెన్సును ఢీకొట్టిన కారు

నలుగురి మృతి.. రావిర్యాల వద్ద ఔటర్‌పై ఘోర ప్రమాదం

ఇబ్రహీంపట్నం, వెలుగు: ఆరోగ్యం బాగాలేక ఆపరేషన్ కోసం వెళుతున్న ఆ వ్యక్తిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. అతడిని తీసుకెళుతున్న అంబులెన్సును ఓ కారు డివైడర్ పైనుంచి దూసుకొచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడితో పాటు అతడి భార్య, ఆమె సోదరుడు, అంబులెన్స్ డ్రైవర్ మొత్తం నలుగురు చనిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని రావిర్యాల ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే ముగ్గురు చనిపోగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కర్ణాటకలోని బళ్లారి జిల్లా గంగావతికి చెందిన బొల్లి రెడ్డి వెంకటేశ్వరరావు (60)కు ఆరోగ్యం బాలేదు. ఆపరేషన్ కోసం భార్య సుబ్బలక్ష్మి (55), ఆమె సోదరుడు రామారావు, కొడుకు హేమచందర్ (38), అల్లుడు శ్రీనివాస్ (40) అతడిని ఏలూరు తీసుకెళ్లారు. తమ వల్ల కాదని వైద్యులు చేతులెత్తేయడంతో అంబులెన్సులో కర్ణాటకకు తిరుగు పయనమయ్యారు. అంబులెన్స్ రావిర్యాల ఔటర్‌రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 13 వద్దకు చేరుకోగానే.. హైదరాబాద్ నుంచి బొంగులూరువైపు వెళుతున్న టాటా హెక్సా కారు డివైడర్ దాటొచ్చి అంబులెన్సును ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ డ్రైవర్ శివ (35), రోగి వెంకటేశ్వరరావు, అతడి భార్య సుబ్బలక్ష్మి ప్రమాద స్థలంలోనే చనిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామారావు మృతిచెందాడు. కారు డ్రైవర్ మనోజ్ (34)కూ తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హేమచందర్, శ్రీనివాస్‌లతో పాటు అంబులెన్సులోని తౌహిత్ (34) అనే మరో వ్యక్తి చికిత్స పొందుతున్నారు.



పండుగకు వెళుతూ మరొకరు

యాచారం మండలం తక్కళ్లపల్లి వద్ద చెట్టును ఢీకొన్న కారు

సంక్రాంతి పండుగ కోసమని సొంతూరికి వెళుతున్న ఓ కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్ల గేట్ సమీపంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చనిపోగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన అనిల్ చౌదరి (42) తన పిల్లలు దినేశ్, తేజస్వినితో కలసి సొంతూరికి బయల్దేరాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో యాచారం మండలం తక్కళ్లపల్లి తండా వద్దకు చేరుకోగానే అదుపుతప్పిన కారు రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టేసింది. ప్రమాదంలో కారును నడుపుతున్న అనిల్ చౌదరి చనిపోయాడు.



మీ కష్టాలు వింటా

దుబాయ్ టూర్‌లో భారతీయ కార్మికులతో రాహుల్

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ) లో భారతీయ కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకోవడానికే తాను దుబాయ్ వచ్చినట్లు కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ చెప్పారు. అంతే తప్ప తన 'మన్ కీ బాత్' చెప్పడానికి రాలేదని పరోక్షంగా ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశిస్తూ ఆయన కామెంట్ చేశారు. యుఏఈ అభివృద్ధిలో భారతీయ కార్మికులు ఉన్నందుకు తానెంతో గర్వపడుతున్నానన్నారు. శుక్రవారం తెల్లవారుజామున దుబాయ్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్ వారితో మాట్లాడుతూ 'దుబాయ్‌లో ఎటు చూసినా ఎత్తైన బిల్డింగులు, పెద్ద పెద్ద విమానాశ్రయాలు కనిపిస్తాయి. మీరు చెమట చిందించకుంటే ఇవన్నీ సాధ్యం కావు' అని అన్నారు. 'యుద్ధం మొదలైంది. మనం గెలవబోతున్నాం' అని పరోక్షంగా రానున్న లోక్ సభ ఎన్నికలను ప్రస్తావించారు. రెండు రోజుల పాటు యూఏఈలో పర్యటిస్తారు.

పల్లెలు బాగుపడాలె

హైదరాబాద్, వెలుగు:

పల్లెల అభివృద్ధితోనే సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. 'సమగ్ర గ్రామ వికాసమే ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత బాగా పెరగాలి. ఇందుకోసం సర్పంచులకు, ఉప సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలి' అని అధికారులకు ఆయన సూచించారు. త్వరలోనే ప్రతి పంచాయతీ కార్యదర్శిని నియమిస్తామన్నారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతామని, అప్పుడే పంచాయతీలకు నిధులు ఇచ్చే వీలుంటుందని తెలిపారు. ఆ నిధులను సరిగ్గా వినియోగించుకోవాలంటే పంచాయతీ పాలకవర్గానికి సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ దిశగానే శిక్షణ కార్యక్రమాలు కొనసాగాలన్నారు. కొత్త సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఇచ్చే శిక్షణపై అధికారులు, ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్షించారు. ఫిబ్రవరి నుంచి మే వరకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. పంచాయతీలను అద్భుతంగా తీర్చిదిద్దడంలో గ్రామ పాలకులకు సమగ్ర అవగాహన అవసరమని, కొత్త పంచాయతీరాజ్ చట్టంపైనా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సమగ్ర వికాసానికి పాటుపడే ఉద్యమకారులుగా తీర్చిదిద్దాలని, నిర్లిప్తత పనికిరాదని హితవుపలికారు. పల్లెల ప్రగతి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకువచ్చిందని సీఎం తెలిపారు. హరితహారంతో ప్రతి పల్లెను పచ్చని పల్లెగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలే యాదయ్య, మర్రి జనార్దన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- పంచాయతీ పాలకులకు శిక్షణనివ్వండి: సీఎం కేసీఆర్
- వారిని పల్లె ప్రగతి కోసం ఉద్యమకారులుగా తీర్చిదిద్దండి
- కేంద్రంలో కొత్త సర్కార్ వచ్చాకే రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్

శుక్రవారం ప్రగతిభవన్‌లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణపై సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

సీఎం కేసీఆర్‌కు ఢిల్లీలో కొత్త కాన్వాయ్

హైదరాబాద్, వెలుగు:

ఫెడరల్ ఫ్రంటు ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వ పనులపై కేంద్ర పెద్దలను కలిసేందుకు తరచూ ఢిల్లీ వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అక్కడో కొత్త కాన్వాయ్ సిద్ధమవుతోంది. ఢిల్లీలో ఆయనకు భద్రత పెంచాలన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాల పర్యటనకు కేసీఆర్ ఇక్కడ వినియోగిస్తున్న కాన్వాయ్ వాహనాలను సైతం మార్చేందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం కాన్వాయ్‌లో పైలెట్ వాహనం, జామర్ వాహనం, ఒక ఎస్కార్టు, రెండు స్పేరు కార్లు, సీఎంవో కారు, ఆంబులెన్సు సహా మొత్తం 11 వాహనాలు ఉన్నాయి. ఢిల్లీ కాన్వాయ్‌ని కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం టొయోటా ల్యాండ్ క్రూజర్, ఫార్చునర్ వాహనాలను కొనుగోలు చేయాలని సీఎం నిర్ణయించారు. ఒక్కో ల్యాండ్ క్రూజర్ ధర రూ.93 లక్షలు ఉండగా, ఫార్చునర్ ధర రూ.28 నుంచి 33 లక్షల వరకూ ఉంది. వీటి కొనుగోలుకు నిధులు కోరుతూ ఆర్థిక శాఖకు సీఎం ప్రోటోకాల్ విభాగం ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. బెంగళూరులోని టొయోటా కంపెనీ ఆఫీసులో వాహనాలను ఆర్డర్ చేసినట్టు తెలుస్తోంది. సీఎం సెక్యూరిటీ కోసం రాష్ట్ర పోలీస్ విభాగం నుంచి 20 మంది పోలీసులను కూడా ఢిల్లీకి పంపనున్నారు. దీనికి సంబంధించి ఢిల్లీ ప్రభుత్వ అనుమతి తీసుకున్నట్టు సమాచారం. ఈ మొత్తం వ్యవహారానికి రూ.15 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



- భద్రతా కారణాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- జిల్లా పర్యటనలకు కాన్వాయ్‌లో మార్పులు!
- సీఎం సెక్యూరిటీ కోసం ఢిల్లీకి 20 మంది పోలీసులు

తొలిదశ స్క్రూటినీ పూర్తి

- 23,229 సర్పంచ్ అభ్యర్థులు
- 93,501 మంది వార్డు మెంబర్లు

హైదరాబాద్, వెలుగు: గ్రామపంచాయతీ తొలిదశ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తయింది. 4,468 పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులుగా 23,229 మంది, 39,616 వార్డుల్లో 93,501 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు పరిశీలించారు. తొలిదశలో 4,479 గ్రామపంచాయతీలకు నోటిఫికేషన్ ప్రకటించగా, 11 పంచాయతీల్లో నామినేషన్లు చెల్లుబాటు కాలేదు. దాంతో 4,468 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

మందిర నిర్మాణానికి కట్టుబడ్డాం

- కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోంది
- రాఫెల్‌పై వారిది రాద్ధాంతం
- వచ్చే ఎన్నికల్లోనూ విజయం మాదే
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో అమిత్ షా

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. రామ జన్మభూమిలోనే రామాలయాన్ని నిర్మించాలని కోరుకుంటున్నామన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో బీజేపీ రెండురోజుల జాతీయ కార్యవర్గ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో ప్రధాని మోడీతోపాటు అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. అమిత్ షా మాట్లాడుతూ.. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్న అయోధ్య కేసు విచారణను వేగవంతం చేయడానికి తాము ప్రయత్నిస్తున్నామన్నారు. పౌరసత్వ బిల్లుపై కాంగ్రెస్ నేతలు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ బిల్లు వల్ల ఈశాన్య ప్రజల ప్రయోజనాలు దెబ్బతిన్నవన్నారు. సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన తర్వాత కూడా రాఫెల్ డీల్‌పై రాహుల్‌గాంధీ రాద్ధాంతం చేయడం ఏంటని ప్రశ్నించారు. పార్లమెంటులో రాహుల్ ప్రశ్నలకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ దీటుగా బదులిచ్చారని చెప్పారు.

కోటా బిల్లు చరిత్రాత్మకం

పెద్ద కులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం రూపొందించిన బిల్లు చరిత్రాత్మకమని షా చెప్పారు. దేశంలోని యువత ఎప్పటి నుంచో ఈ డిమాండ్ చేస్తోందన్నారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' లో భాగంగానే కేంద్రం కోటా బిల్లు తీసుకువచ్చిందన్నారు.

మళ్లీ బీజేపీదే అధికారం

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని, మళ్లీ నరేంద్ర మోడీ ప్రధాని కావడం ఖాయమని అమిత్ షా అన్నారు. రాబోయే ఎన్నికలు రెండు విరుద్ధ భావజాలాల మధ్య పోరాటమని, నాయకుడు లేని రాజకీయ పక్షాలతో మోడీ పోరాడబోతున్నారని చెప్పారు. 30 ఏళ్ల సంకీర్ణ ప్రభుత్వాల తర్వాత పరిపూర్ణ ఆధిక్యతగల మొదటి ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని, నాలుగున్నరేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఎంతో చేసిందని తెలిపారు. ప్రధాని మోడీని అధికారం నుంచి దించేయడమే ప్రతిపక్షాల అజెండా అని అన్నారు. మోడీ సర్కార్ చేస్తున్న మంచి పనులు చూసి సహించలేని ప్రతిపక్షాలు సిద్ధాంతాలు పక్కన పెట్టి ఒక్కటవుతున్నాయని దుయ్యబట్టారు. ప్రజలు మరోసారి బీజేపీని గెలిపించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, సీనియర్ నేత ఎల్ కే అద్వానీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. 12 వేల మంది పాల్గొన్నారు.



శుక్రవారం ఢిల్లీలో మొదలైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రధాని మోడీ, అమిత్ షా

30 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

ఫిబ్రవరి 5న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విజయవాడ, వెలుగు: ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనున్నాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం 9 రోజులపాటు సమావేశాలు నిర్వహించనున్నారు. ఫించన్లు రెట్టింపు చేస్తామంటూ ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరి 5న ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. తొలిరోజు సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించే అవకాశం ఉంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2లక్షల కోట్ల రూపాయలు దాటుతుందని ఏపీ ప్రభుత్వం అంచనా వేసింది. గతేడాది ఏపీ బడ్జెట్ రూ.1.93 లక్షల కోట్లు.

సర్పంచ్ పదవులకు తొలిరోజే 4,850 నామినేషన్లు

హైదరాబాద్, వెలుగు: గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికలకు మొదటి రోజైన శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,135 గ్రామ పంచాయతీలకు 4,850 మంది సర్పంచ్ అభ్యర్థులు, 36,602 వార్డులకు 9,198 మంది నామినేషన్లు వేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.



అలోక్‌వర్మ బదిలీ కక్ష సాధింపే: నారాయణ

హైదరాబాద్, వెలుగు: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను అర్ధంతరంగా తప్పించడం కక్షసాధింపు చర్యేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రధాని కార్యాలయమే చట్టాన్ని ఉల్లంఘిస్తోందని శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఈ బదిలీని అత్యున్నత స్థాయి కమిటీలో ఉన్న ప్రతిపక్ష నేత వ్యతిరేకించినా పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదన్నారు. రాఫెల్ కుంభకోణం బయటపడుతుందనే భయంతోనే మోడీ ఈ దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు.

రాజ్యాంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోంది: జాజుల

హైదరాబాద్, వెలుగు: రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ 48 గంటల్లో అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. ఈబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ 'రాజ్యాంగాన్ని రక్షించండి - సామాజిక న్యాయాన్ని కాపాడండి' అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రకటించారు. శనివారం నల్లగొండలో, ఆదివారం విజయవాడలో, 20న వరంగల్, 24న నిజామాబాద్, 27న ఒడిశా, 29న నిజామాబాద్, ఫిబ్రవరి 7న ఢిల్లీలో ఆందోళనలు చేపడతామన్నారు. ఢిల్లీలో నిర్వహించే ఆందోళనలో డీఎంకే ఎంపీ కనిమొళి, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తదితరులు పాల్గొంటారని అన్నారు.



రాష్ట్రంలోనూ 'ఓట్ ఆన్ అకౌంట్'

- ఫిబ్రవరి తొలివారంలో మినీ బడ్జెట్
- సిద్ధమవుతున్న రాష్ట్ర సర్కారు
- అంచనాల సమర్పణకు గడువు 18వ తేదీ
- జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోనూ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. మూడు నెలల ఆర్థిక నిర్వహణ కోసం మినీ బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని శాఖల నుంచి ఆర్థిక శాఖ ప్రతిపాదనలు కోరింది. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో అంచనాలు సమర్పించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్ని శాఖల అధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శాఖలవారీగా ప్రతిపాదనలు పంపే పనిలో అన్ని విభాగాల అధిపతులు నిమగ్నమయ్యారు. జూన్‌లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంతో ద్రవ్య వినిమయ బిల్లు కాల పరిమితి కూడా ముగియనుంది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో పాటే మూడు నెలల కాలానికి ద్రవ్య వినిమయ బిల్లునూ శాసనసభ ఆమోదించనుంది.

కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చుకునేలా..

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ పెట్టనుంది. అదే నెల చివరి వారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయి మేలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మే నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా మధ్యంతర బడ్జెట్ పెట్టేందుకే సిద్ధమయ్యింది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీంలు, గ్రాంట్ ఎయిడ్ నిధులు, కేంద్ర పన్నుల వాటా నిధులను వీలైనన్ని ఎక్కువ తెచ్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీ మేరకు కొత్తగా 20 లక్షల మందికి ఆసరా పెన్షన్లు.. ఇప్పటికే ఫించన్ అందుకుంటున్న 42 లక్షల మందికి రెట్టింపు పెన్షన్ మొత్తం ఇవ్వాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ నుంచి రైతు బంధు సాయాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచాల్సి ఉంది. పెన్షన్ల పెంపు వల్ల పడే భారాన్ని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే చేర్చనుండగా, రైతుబంధు సాయం పెంపు అంశాన్ని పూర్తి స్థాయి బడ్జెట్‌లో పెట్టనున్నారు.

కేంద్రం ఇచ్చింది కొంతే..

కేంద్ర ప్రభుత్వంతో కేసీఆర్ సర్కారు సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నా నిధుల విడుదలలో మాత్రం మొండిచేయే ఎదురవుతోంది. డిసెంబర్ చివరి నాటికి ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగుస్తుండగా నవంబర్ నెలాఖరుకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రాష్ట్రానికి సమకూరిన ఆదాయం రూ.5,376 కోట్లే. 2018-19 బడ్జెట్ అంచనాల్లో ఈ నిధులు రూ.29,041 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం లెక్కగట్టుకుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్, ఇతర నిధుల కోసం ఆర్థిక శాఖ అధికారులు ఢిల్లీ బాట పట్టారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. కేంద్ర ఆర్థిక శాఖ అధికారులతో ఆయన సమావేశమై రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చర్చిస్తారు.

ఆదాయం రాక ఇలా...

రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక వనరుల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రూపేణా ఇప్పటికే 75 శాతం ఆదాయం సమకూరింది. రూ.4,700 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా 3,557 కోట్లు ఇప్పటికే ఖజానాకు చేరాయి. జీఎస్టీ ఆదాయ లక్ష్యం రూ.34,232 కోట్లు కాగా నవంబర్ నెలాఖరుకు రూ.18,964 కోట్లు సమకూరాయి. ఎక్సైజ్ డ్యూటీగా రూ.6,643 కోట్లు, కేంద్ర పన్నుల వాటాగా రూ.8,510 కోట్లు వచ్చాయి. పన్నేతర ఆదాయంలోనూ రాష్ట్రం వెనుకబడింది. రూ.8,973 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.2,993 కోట్లే వచ్చింది. అమ్మకం పన్ను ఆదాయ లక్ష్యం రూ.25,942 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.12,264 కోట్లు ఖజానాకు చేరాయి.

ఏపీలో పింఛన్లు రెట్టింపు

నెల్లూరు: ఏపీలో పలు వర్గాలకు అందుతున్న సంక్షేమ పింఛన్ల మొత్తాన్ని జనవరి నుంచి రెట్టింపు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రకటించారు. ప్రజలకు ఇది తన సంక్రాంతి కానుక అన్నారు. ఏపీలో పలు వర్గాల లబ్ధిదారులకు నెలకు రూ.1,000 నుంచి రూ.2,500దాకా పింఛన్లు అందుతున్నాయి. ఇప్పుడు అవన్నీ రెట్టింపు కానున్నాయి.

ఈ ఏడాది 34 మంది 'వైద్య' ప్రొఫెసర్ల రిటైర్మెంట్

మొత్తం 51 మంది జాబితా విడుదల

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల్లో ఈ ఏడాది 34 మంది ప్రొఫెసర్లు, వివిధ విభాగాధిపతులు రిటైర్ కానున్నారు. రిటైర్మెంట్ జాబితాలో మొత్తం 51 మంది సీనియర్లు ఉన్నట్లు వైద్య శాఖ ప్రకటించింది. ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వయోపరిమితి పెంచుతుందని ఆశిస్తున్న తరుణంలో వచ్చిన ఈ ప్రకటన చర్చనీయాంశమైంది. ప్రభుత్వం వయోపరిమితి పెంపుపై ఒక అవగాహనకు వచ్చేందుకే ఈ జాబితా విడుదల చేసిందని సీనియర్లు అంటోంటే, అసలు వయోపరిమితిపై నిర్ణయమే ఉండకపోవచ్చంటూ ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న సర్వీస్ డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఖాళీలను భర్తీ చేయాలంటూ జూనియర్ డాక్టర్ల సంఘం ప్రభుత్వానికి రెండ్రోజుల క్రితమే విజ్ఞప్తి చేసింది.

ఎట్టకేలకు ఆర్టీసీ ఉద్యోగులకు డ్రెస్ క్లాత్

హైదరాబాద్, వెలుగు : టీఎస్ ఆర్టీసీ కార్మికులకు త్వరలో డ్రెస్ క్లాత్ అందనుంది. రెండేళ్లుగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుండడంతో ఈ యేడు మూడు జతల క్లాత్ ఇచ్చేందుకు సంస్థ నిర్ణయం తీసుకుంది. 2016-17కు సంబంధించిన క్లాత్‌ను ఇప్పుడు ఇస్తున్నారు. గతంలో మామూలు క్లాత్ ఇవ్వగా ఈసారి రేమండ్ క్లాత్ అందజేస్తున్నారు. వివిధ విభాగాలకు మూడు రంగుల్లో క్లాత్ ఇవ్వనున్నారు.



ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్న ప్రాంతం..

ట్రైబల్ వర్సిటీకి గ్రీన్ సిగ్నల్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి క్లాసులు

హైదరాబాద్, వెలుగు:

- ఆరు కోర్సుల్లో 180 మందికి అడ్మిషన్లు
- గిరిజనులకు 30 శాతం రిజర్వేషన్
- హెచ్‌సీయూకు నిర్వహణ బాధ్యతలు

రాష్ట్రంలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. డిసెంబర్ నెలాఖరులో కేంద్ర ఎంహెచ్ఆర్‌డీ కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యం ములుగులో పర్యటించి ఇచ్చిన మినిట్స్ ఆధారంగా వర్సిటీ ఏర్పాటును అధికారికంగా ధ్రువీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారమిచ్చింది. దీనిపై సీఎస్ ఎస్‌కే జోషి శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రతినిధి, సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీర్‌తో పాటు గిరిజన, అటవీ, ఉన్నత విద్యాశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే వర్సిటీ పనిచేసే విధంగా కార్యాచరణను ఖరారు చేశారు. ప్రాథమికంగా 6 కోర్సులు, ఒక్కో కోర్సులో 30 మంది విద్యార్థులచొప్పున 180 మందికి అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. ములుగు ప్రతిపాదిత ట్రైబల్ యూనివర్సిటీకి దగ్గర్లో ఉన్న జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో క్లాసులు నిర్వహించాలని, దీని బాధ్యతలను హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో గిరిజనుల జనాభా, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని వారికి 30శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. సీఎస్ మీటింగ్ మినిట్స్‌ను శుక్రవారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

జూలై నుంచి కోర్సులు

జూలై నుంచి ట్రైబల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనంలో క్లాసులు, హాస్టల్ సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది బీఏ (హోటల్ మేనేజ్‌మెంట్), బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ (అటవీ ఉత్పత్తుల ఆధారంగా మార్కెటింగ్, ప్యాకేజింగ్), బీబీఏ, మాస్టర్స్ ఇన్ ట్రైబల్ కల్చర్, జానపద (సంస్కృతి) కోర్సులుంటాయి.

ఈసీలో ముగ్గురు కార్యదర్శులు

దేశంలోని మిగతా అన్ని యూనివర్సిటీలకు భిన్నంగా ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) ఉంటుంది. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, అటవీశాఖ కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఇందులో సభ్యులుగా ఉంటారు. యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలం ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. మిగతా అంశాలన్నీ కేంద్రం సమకూరుస్తుంది. ఇప్పటికే 498ఎకరాల స్థలాన్ని వర్సిటీ కోసం సేకరించారు. అందులో 200 ఎకరాల అటవీ భూములున్నాయి.

ట్రైబల్ వర్సిటీపై డీపీఆర్

ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి (ఉన్నత విద్య) రెడ్డి సుబ్రమణ్యం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రాముఖ్యం, ట్రైబల్ వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తి, తదితరాలను దీనిలో వివరించారు. ట్రైబల్ వర్సిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ములుగును జిల్లా కేంద్రంగా చేసిన తీరును తెలిపారు. రాష్ట్రానికి రెండో రాజధానిగా భావిస్తున్న వరంగల్ ప్రాచుర్యాన్ని ప్రస్తావించారు. వీటితోపాటు ఈ యూనివర్సిటీ వచ్చే ఏడేండ్లలో 7 వేల మంది విద్యార్థుల క్యాంపస్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం డీపీఆర్‌ను రూపొందించింది.

పండుగపై ధరల బండ

సామాన్యుడికి సంక్రాంతి కష్టాలు ■ టికెట్ ధరలు భారీగా పెంచిన ఆర్టీసీ, రైల్వే

హైదరాబాద్, వెలుగు:



- ఊరెళ్లాలంటే వేలల్లోనే ఖర్చు
- కొండెక్కిన కూరగాయలు, మాంసం ధరలు
- నెల జీతం ఒక్కరోజు సంబురానికి ఆవిరి

పండుగంటే పరమాన్నం, కొత్త బట్టలు, ప్రయాణాలు, పలకరింపులు.. ఇంకా మరెన్నో సరదాలు. ఒకప్పుడు ఇవన్నీ తలుచుకుని సంబురపడిన సగటు జీవి.. ఇప్పుడు 'వామ్మో మళ్లీ పండుగా?' అని బెంబేలెత్తుతున్నాడు. పల్లెను ఇడిచి పట్నంలో ప్రైవేటు కొలువు చేసుకుంటున్న వారి పరిస్థితి మరీ ఘోరం. భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలు ఓ వైపు, పట్టపగలే చుక్కలు చూపుతున్న బస్సు, రైలు చార్జీలు మరోవైపు సామాన్యుడి పండుగపై బండ వేస్తున్నాయి. దీంతో నెల జీతం ఒక్కరోజు సంబురానికి ఆవిరైపోతోంది.

నిత్యావసరాలు కొనలేం

నిత్యావసర సరుకుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ఏడాది లోటు వర్షపాతం వల్ల రాష్ట్రంలో పంట దిగుబడి తగ్గిపోయింది. దీంతో వేసవిలో పెరగాల్సిన కూరగాయల ధరలు జనవరిలోనే కొండెక్కాయి. ఈ సీజన్ కిలో రూ.5 ఉండే టమాట, ప్రస్తుతం రూ.30 పలుకుతోంది. మిగతా కూరగాయల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇక కిలో చికెన్ రూ.200, మటన్ రూ.550 పలుకుతున్నాయి. కొన్ని చోట్ల కిలో మటన్ రూ.650 కన్నా ఎక్కువే చెబుతున్నారు. ఇక పెట్రోలు ధరల మంట కూడా సామాన్యుడి జేబుకు చిల్లు వేస్తోంది.

టికెట్ రేట్లకు రెక్కలు

సామాన్యుడికి సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా రవాణా సంస్థలు, ఇప్పుడు ఆ వేతన జీవినే నిలువు దోపిడీ చేస్తున్నాయి. ప్రైవేటు సంస్థల మాదిరి పండుగ పూట రద్దీని క్యాష్ చేసుకుంటున్నాయి. ప్రత్యేక బస్సుల పేరిట తెలుగు రాష్ట్రాల ఆర్టీసీలు టికెట్ల రేట్లపై 50 శాతం ఎక్కువ వసూలు చేస్తున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి గోదావరిఖనిరూ.258 ఉండే ఆర్టీసీ టికెట్ ధర, పండుగ పూట రూ.387కి చేరింది. దీనికి టోల్, సర్వీస్, రిజర్వేషన్ చార్జీలు కలుపుకుని ఒక్కో సీటుకు రూ.440 వసూలు చేస్తున్నారు. ఇక ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఖమ్మం వంటి దూరప్రాంతాలకు వెళ్లే వారికైతే ప్రయాణ చార్జీలు తడిసిమోపెడవుతున్నాయి. బస్సు చార్జీల మోత తట్టుకోలేక రైళ్లలో పోదామంటే, అక్కడా సేమ్ సీన్. ప్రత్యేక రైళ్ల పేరిట దక్షిణ మధ్య రైల్వే టికెట్ రేట్లు భారీగా పెంచింది. విజయవాడ, విశాఖ సహా ఆంధ్రలోని పలు ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. వీటిలో కొన్ని టికెట్ల ధరలైతే ఏకంగా విమాన చార్జీలను మించిపోయాయి. మరోవైపు రాష్ట్రంలోని ప్రాంతాలకు మాత్రం ప్రత్యేక రైళ్లు నడపట్లేదు. దీంతో ఉన్న అరకొర రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థలే ఇలా ఉంటే ప్రైవేటు ట్రావెల్స్ సంగతి చెప్పనక్కర్లేదు. టికెట్ల రేట్లను నాలుగైదు రెట్లు పెంచేశాయి. అందినకాడికి దండుకుంటున్నాయి.

కొత్త బట్టలకు 'కట్టలు' కావాలె

కొత్త బట్ట కట్టనిదే పండుగ పరిపూర్ణమవదు. బ్రాండు బట్టలు కొంటే తప్ప పిల్లలు అంగీకరించడంలేదు. దీంతో ఓ నెల మొత్తం సంపాదన ఒక్క రోజులోనే ఖర్చయిపోతోంది. ప్రధాన పండుగల సమయాల్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా వ్యాపారులు సహజంగానే రేట్లు పెంచుతరు. ఈసారి పెంపు మరో 10-15 శాతం ఎక్కువగానే ఉంది.

సగటు వేతనం పది వేలు

ధరలన్నీ జెట్ స్పీడుతో దూసుకెళ్తుంటే, సగటు జీవి వేతనం రూ.పది వేలు దాటడం లేదు. ఇండియాలో వ్యవసాయంపై ఆధారపడిన వారు, ప్రైవేటు ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులే అధికం. గతేడాది సెప్టెంబర్‌లో అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ విడుదల చేసిన రిపోర్టు ప్రకారం భారత్‌లో 57 శాతం ఉద్యోగుల సగటు వేతనం నెలకు రూ.10 వేలు, లేదా అంతకంటే తక్కువే. ఏటా పెరిగిపోతున్న పండుగ ఖర్చును తట్టుకోలేక సామాన్యుడు డీలాపడిపోతున్నాడు. సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగ రోజు భారంగా నిట్టూరుస్తున్నాడు.

కామన్ ఎంట్రెన్స్‌లకు కన్వీనర్ల నియామకం

హైదరాబాద్, వెలుగు: వివిధ కోర్సులకు మే నెలలో జరిగే కామన్ ఎంట్రెన్స్ పరీక్షలకు కన్వీనర్లను ఉన్నత విద్యామండలి నియమించింది. ఎంసెట్ కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ యాదయ్య, ఈసెట్‌కు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోవర్ధన్, పీఈసెట్‌కు ప్రొఫెసర్ సత్యనారాయణ (ఎంజీయూ), ఐసెట్‌కు ప్రొఫెసర్ రాజేశం(కేయూ), లాసెట్, పీజీలాసెట్‌లకు ప్రొఫెసర్ జీబీరెడ్డి(ఓయూ), ఎడ్‌సెట్‌కు ప్రొఫెసర్ మృణాళిని(ఓయూ), ఈసెట్‌కు ప్రొఫెసర్ ఎం కుమార్(ఓయూ)ను నియమిస్తూ మండలి చైర్మన్ పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



శుక్రవారం సీపీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న ఆర్థిక నేరాల బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

క్యూనెట్ స్కాం.. 20 వేల కోట్లు!

మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నాం: సీపీ సజ్జనార్

హైదరాబాద్, వెలుగు: గోల్డ్ క్వెస్ట్.. క్వెస్ట్ కాయిన్స్.. విహాన్‌డైరెక్ట్ సెల్లింగ్.. ఇలా రకరకాల పేర్లతోకనికట్టు చేసిన క్యూనెట్ గొలుసుకట్టు స్కాం విలువ రూ.20 వేల కోట్ల దాకా ఉందని బాధితులు చెబుతున్నారు. ఇప్పటికే క్యూనెట్ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి, మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు సైబరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి మోసాల బారినపడకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్యూనెట్ ఆస్తులను గుర్తించే పనిలో ఉన్నామని, ముంబై, పూణే, బెంగళూరు వంటి నగరాల నుంచీ ఫిర్యాదులందుతున్నట్టు చెప్పారు. ఈ ఆర్థిక నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. శుక్రవారం ముంబైకి చెందిన ఆర్థిక నేరాల బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హైదరాబాద్‌కు వచ్చి సజ్జనార్‌ను కలిశారు. ''ఇప్పటివరకు దేశంలో జరిగిన ఆర్థిక నేరాల్లోకెల్లా క్యూనెట్‌దే భారీ కుంభకోణం. ఇది జనం నుంచి 20 వేల కోట్లు కొల్లగొట్టింది'' అని సంఘం సెక్రటరీ గురుప్రీత్‌సింగ్ చెప్పారు.

జగన్ పై దాడి కేసు నిందితుడికి ఎన్ఐఏ కస్టడీ

విచారణ ఈనెల 25కు వాయిదా

విజయవాడ, వెలుగు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిపై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు వారంపాటు ఎన్ఐఏ కస్టడీ విధిస్తూ విజయవాడలోని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. శ్రీనివాసరావును విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఎన్ఐఏ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. కొన్ని షరతులతో కస్టడీకి అప్పగిస్తున్నట్లు కోర్టు చెప్పింది. నిందితుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించకూడదని, మూడు రోజులకోసారి వైద్య పరీక్షలు చేయించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించింది. నిందితుడు కోరితే లాయర్ సమక్షంలో విచారణ చేపట్టాలని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది.


జర్నలిస్టు హత్య కేసులో గుర్మీత్ దోషే

సీబీఐ స్పెషల్ కోర్టు తీర్పు

న్యూఢిల్లీ: జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి హత్య కేసులో వివాదాస్పద డేరా బాబా గుర్మీత్ రామ్ రహీంను దోషిగా నిర్ధారిస్తూ హర్యానాలోని పంచకుల సీబీఐ స్పెషల్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. మరో ముగ్గురినీ దోషులుగా నిర్ధారించింది. ఈ నలుగురికి 17న శిక్షలు ఖరారు చేస్తారు. కోర్టు తీర్పు నేపథ్యంలో పంచకుల, హర్యానాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులు కోర్టుకు హాజరయ్యారు. గుర్మీత్ రామ్ రహీం మాత్రం రోహ తక్‌లోని సునారియా జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. తన అనుచరులైన ఇద్దరు మహిళల రేప్ కేసుకు సంబంధించి గుర్మీత్ ప్రస్తుతం 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

పది లెక్కల పరీక్ష.. ఏది కావాలంటే అది రాయొచ్చు

న్యూఢిల్లీ:



- ఒకటో పేపర్ మ్యాథ్స్ స్టాండర్డ్, రెండో పేపర్ మ్యాథ్స్ బేసిక్
- స్టూడెంట్స్‌కే నచ్చిన పేపర్‌ను ఎంచుకునే చాన్స్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న సీబీఎస్ఈ

టెన్త్ స్టూడెంట్స్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) రెండు రకాల గణితం పరీక్షలు పెట్టనుంది. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లోనే గణితాన్ని, మ్యాథ్స్ స్టాండర్డ్(కఠిన ప్రశ్నలు), మ్యాథ్స్ బేసిక్(సులువైన ప్రశ్నలు) పేపర్లుగా విడగొట్టింది. స్టూడెంట్‌కు నచ్చిన పేపర్‌ను రాసుకుని టెన్త్‌ను పూర్తి చేసే చాన్స్ కల్పించింది. భవిష్యత్‌లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌గా చదువు కొనసాగించాలనుకునే వారు మ్యాథ్స్ స్టాండర్డ్, ఇతర చదువులకు వెళ్లాలనుకునేవారు మ్యాథ్స్ బేసిక్(ప్రశ్నలు సులువుగా ఉంటాయి) పేపర్‌ను రాసుకోవచ్చు. 2020 విద్యా సంవత్సరం నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు సీబీఎస్ఈ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పరీక్షకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టుకునే సమయంలో మ్యాథ్స్ స్టాండర్డ్, మ్యాథ్స్ బేసిక్‌లో ఏదో ఒక ఎగ్జామ్‌ను మాత్రమే స్టూడెంట్స్ ఎంచుకోవాలని సూచించింది. సిలబస్, క్లాస్ రూమ్ టీచింగ్, ఇంటర్నల్స్ యథావిధిగా కొనసాగుతాయని సీబీఎస్ఈ వెల్లడించింది. తొలిసారి పెద్ద ఎగ్జామ్ ఎదుర్కొనే టైంలో టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ బాగా ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది. ఈ సందర్భంగా 2005లో నేషనల్ ఫోకస్ గ్రూప్ ఎగ్జామ్స్‌పై సూచించిన సంస్కరణలను సీబీఎస్ఈ ప్రస్తావించింది. స్టూడెంట్స్‌పై భారాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. స్టూడెంట్ల మాదిరే స్కూళ్లకూ సబ్జెక్టుల విషయంలో వెసులుబాటు ఇవ్వనుంది.

ఫెయిల్ అయితే?

మ్యాథ్స్ బేసిక్ ఎగ్జామ్‌లో స్టూడెంట్ ఫెయిలైతే, మ్యాథ్స్ బేసిక్ కంపార్ట్‌మెంటల్ ఎగ్జామ్‌ను, స్టాండర్డ్ ఎగ్జామ్ ఫెయిలైతే, స్టాండర్డ్ కంపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ రాసుకోవచ్చని వివరించింది. ముందు బేసిక్ ఎగ్జామ్ రాసి పాసైన స్టూడెంట్ మనసు మార్చుకుని స్టాండర్డ్ ఎగ్జామ్ రాయాలనుకుంటే స్టాండర్డ్ కంపార్ట్‌మెంటల్ పరీక్ష రాసుకోవచ్చని తెలిపింది.

కాపీ, పేస్ట్ థీసిస్‌లకు చెక్

అన్ని వర్సిటీల్లో 'యాంటీ ప్లాగరిజమ్' సెల్ ■ యూజీసీ ఆదేశాలు అమలు

హైదరాబాద్, వెలుగు:



- 10% కాపీకి మాత్రమే అనుమతి
- 60 శాతంలోపు కాపీ చేస్తే సరిదిద్దుకునేందుకు చాన్స్
- అంతకు మించితే అడ్మిషన్ రద్దే
- ప్రొఫెసర్ల పరిశోధన పత్రాలకూ వర్తింపు

ఆ పుస్తకంలో నుంచి కొంత.. ఈ పుస్తకంలో నుంచి కొంత పేరాలకు పేరాలు తీసి తీసి రాసే థీసిస్‌లకు కాలం చెల్లినట్లే. యూనివర్సిటీల్లో పాత పుస్తకాలు, ఇంటర్నెట్ ఆధారంగా సిద్ధం చేస్తున్న ఎంఫిల్, పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాలు, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించే పరిశోధన వ్యాసాలకు చెక్ పడనుంది. పరిశోధనల్లో నాణ్యత పెంచేందుకు అన్ని విశ్వవిద్యాలయాల్లో యాంటీ ప్లాగరిజమ్ సెల్(గ్రంథ చౌర్య వ్యతిరేక విభాగం)ను ఏర్పాటు చేయాలని గత ఏడాది జూలైలో యూజీసీ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో యాంటీ ప్లాగరిజం సెల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఓయూలో ఇది అమలులోకి వచ్చింది.

పెనాల్టీ ఇలా..

ఎంఫిల్, పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాల్లో కాపీ(ప్లాగరిజం) శాతాన్ని బట్టి యూజీసీ పెనాల్టీ నిర్ణయించింది. ప్లాగరిజం ఎంత ఉందనే విషయాన్ని యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన యాంటీ ప్లాగరిజం సెల్ నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తుంది. ఇందులో 10 శాతం ప్లాగరిజం ఉంటే జీరో లెవల్‌గా, పది శాతం నుంచి 40 శాతాన్ని మొదటి దశగా, 40 నుంచి 60 శాతాన్ని రెండో దశగా, 60 శాతంపైగా కాపీని మూడో దశగా విభజించింది. జీరో లెవల్ కాపీ వచ్చిన వారు పీహెచ్‌డీ థీసిస్ సమర్పించేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. 40 శాతంలోపు ఉంటే ఆ విద్యార్థి సరిచేసుకుని 6 నెలల్లో తిరిగి సబ్మిట్ చేసుకోవచ్చు. 40 నుంచి 60 శాతంలోపు కాపీ ఉంటే సరిచేసుకునేందుకు సంవత్సరం గడువు ఇస్తారు. అదే 60 శాతం మించితే మాత్రం అడ్మిషన్ రద్దు చేస్తారు. పరిశోధక విద్యార్థులకు విధించినట్లే యూనివర్సిటీలు, కళాశాలల్లో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లకు కూడా యూజీసీ నిబంధనలు విధించింది. వారు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించే ముందు యాంటీ ప్లాగరిజం సెల్‌లో ప్లాగరిజం శాతాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

ప్రతిబంధకమా? ప్రయోజనమా?

యూజీసీ విధించిన నిబంధనలు పరిశోధక విద్యార్థులకు ప్రతిబంధకంగా మారాయని కొందరు వాదిస్తున్నారు. మరికొందరు మాత్రం మంచి నిర్ణయమని చెప్తున్నారు. సిద్ధాంత గ్రంథాల్లో సందర్భోచితంగా గత పరిశోధకులు చెప్పిన అంశాలను ప్రస్తావించడం తప్పనిసరి అని, కానీ ఈ అంశాలను కాపీగా చూడటం సరికాదని కొందరు స్కాలర్స్, ప్రొఫెసర్స్ వాదిస్తున్నారు. రిఫరెన్స్‌లను పేర్కొనడం రీసెర్చ్ మెథడాలజీలో ఓ పద్ధతి అని, దీనిని ఎలా ప్లాగరిజం కింద పరిగణిస్తారని అంటున్నారు. ఈ నిబంధనలు సడలించాలని కనీసం 25 నుంచి 30 శాతం ప్లాగరిజానికి అనుమతించాలని కోరుతున్నారు. అయితే.. మరికొందరు మాత్రం ఈ నిర్ణయం వల్ల పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుందని చెప్తున్నారు.

ఫ్రీ చెక్‌కు వెబ్‌సైట్లు

యాంటీ ప్లాగరిజం సెల్‌కు థీసిస్‌ను సమర్పించడానికి ముందు ఎవరికి వారు ప్లాగరిజంను చెక్ చేసుకునే వీలుంది. ఇందుకు ఇంటర్నెట్‌లో పలు పెయిడ్ వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఇది ఖర్చుతో కూడుకున్న పని కావడంతో స్కాలర్స్ కొంత వెనుకంజ వేస్తున్నారు. యూనివర్సిటీల్లోని అన్ని విభాగాల్లో ముందస్తుగా ఉచితంగా ప్లాగరిజం చెక్ చేసుకునే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

అలాంటి వాటికి చెక్ పడుతుంది



ఈ మధ్య పరిశోధనలు సరిగా జరగడం లేదు. థిసిస్‌ను కొనుక్కొని సబ్మిట్ చేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు యాంటీ ప్లాగరిజం ఎంతగానే ఉపయోగపడుతుంది. ఒకే రకమైన పరిశోధనాంశం ఎంపిక చేసుకున్నప్పుడు, పాత వాటిల్లోని పదాలు మార్చి కూడా సబ్మిట్ చేసే అవకాశమూ ఉంది.

- ఆర్ఎల్ మూర్తి, సోషియాలజీ స్కాలర్

నిజాయితీగా పరిశోధనలు



ఓయూ స్టాండర్డ్స్ కోసం యాంటీ ప్లాగరిజం సెల్ అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా నిజాయితీగా పరిశోధనలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికి ఓయూలో 27 విభాగాల్లో సుమారు 220 థీసిస్‌ను తీసుకున్నాం. యాంటీ ప్లాగరిజంపై స్కాలర్స్‌కు అవగాహన కల్పిస్తున్నాం.

- చక్రవర్తి, యాంటీ ప్లాగరిజం సాఫ్ట్‌వేర్ కో ఆర్డినేటర్

నాణ్యత పెరుగుతుంది



పరిశోధనల్లో కొంత నాణ్యత లోపిస్తున్నది. కొందరు విద్యార్థులు ఫీల్డ్‌కు వెళ్లకుండానే థీసెస్ సమర్పించిన సందర్భాలు చాలా ఉన్నాయి. కొత్త విధానంతో ప్రతి విద్యార్థి ఫీల్డ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిద్వారా పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుంది. డాటా ఎనాలసిస్, ఫీల్డ్‌కు వెళ్లే సమయంలో డబ్బు ఎక్కువగా ఖర్చు అవుతుంది.

- ఆర్ఎన్ శంకర్, ఎకనామిక్స్ స్కాలర్



యూపీలో 'పొత్తు' పొడుపు

- ఎస్పీ, బీఎస్పీ పోటీ చేసే సీట్లపై ఇవాళ క్లారిటీ
- ఒంటరిగానే కాంగ్రెస్!

లక్నో : వచ్చే లోక్ సభ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్ లో 'మహాఘట్ బంధన్' తరఫున ఎవరు ఎన్ని సీట్లకు పోటీ చేస్తారన్న విషయం శనివారం స్పష్టం కానుంది. సమాజ్ వాది పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ , బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) చీఫ్ మాయావతి మీడియాకు ఈ వివరాలు చెబుతారు. కాంగ్రెస్ ను దూరం పెడుతూ యూపీలో ఇప్పటికే ఈ రెండు పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయి. అయితే ఏ పార్టీ ఏ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తుంది అనే వివరాలను ఇద్దరు మాజీ సీఎంలు మీడియా సమావేశంలో వెల్లడిస్తారు. మహాఘట్ బంధన్ లో అజిత్ సింగ్ నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్ తో పాటు నిషాద్ పార్టీ కూడా చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే గాంధీ కుటుంబానికి చెందిన వారు ప్రాతినిధ్యం వహించే అమేథీ, రాయ్ బరేలి నియోజకవర్గాల్లో పోటీ పెట్టకూడదని ఎస్పీ, బీఎస్పీ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎస్పీ, బీఎస్పీ తమను దూరం పెట్టడంతో యూపీలో కాంగ్రెస్ ఒంటరి పోరుకు రెడీ అయింది. యూపీ పరిణామాలపై స్పందిస్తూ కాంగ్రెస్ ను తక్కువగా అంచనా వేయొద్దని ఆ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ ఈమధ్య కామెంట్ చేశారు. ప్రజల్లో తమ పార్టీకి ఆదరణ ఉందన్నారు. మహాఘట్ బంధన్ లో లేనంత మాత్రాన తమ పార్టీకి వచ్చిన నష్టమేమీలేదన్నారు. అయితే పొత్తులకు సంబంధించి యూపీ నమూనాను మిగతా రాష్ట్రాలు కూడా అనుసరిస్తాయోమోనన్న భయం కాంగ్రెస్ లో కనిపిస్తోంది. కాంగ్రెస్ ను దూరం పెట్టి అక్కడి ప్రాంతీయ పార్టీలే జట్టు కట్టి ఎన్నికల్లో పోటీ చేస్తే చివరకు అది బీజేపీకి లాభిస్తుందని కాంగ్రెస్ భయాందోళనలు వ్యక్తం చేస్తోంది.

మాకే అనుకూలం : బీజేపీ

యూపీ పరిణామాలు తమకు అనుకూలంగా ఉన్నాయని బీజేపీ నాయకులు సంతోష పడుతున్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అటు కాంగ్రెస్ , ఇటు మహాఘట్ బంధన్ మధ్య చీలిపోతాయని బీజేపీ లీడర్లు లెక్కలు వేసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో మొత్తం 80 సెగ్మెంట్లలో బీజేపీ కూటమి 73 సీట్లు గెలుచుకుంది. ఈసారి కూడా అవే ఫలితాలు వస్తాయంటున్నారు కాషాయ పార్టీ నాయకులు.

ఎస్పీ, బీఎస్పీలకే కైరానా లోక్ సభ సీటు

రాష్ట్రీయ లోక్ దళ్ ఆలోచన


లక్నో : ఆర్నెల్ల కిందట బై ఎలెక్షన్ లో గెలుచుకున్న కైరానా లోక్ సభ సెగ్మెంట్ ను పొత్తులో భాగంగా ఎస్పీ, బీఎస్పీలకు ఇవ్వడంపై అజిత్ సింగ్ నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ ఎల్ డీ) ఆలోచన చేస్తోంది. కైరానా ఉప ఎన్నికలో ఆర్ ఎల్ డీ తరఫున తబస్సుమ్ బేగం పోటీ చేసి,బీజేపీ కేండిడేట్ పై 55 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. సమాజ్ వాది పార్టీలో ఉన్న ఆమె బై ఎలెక్షన్ కు ముందు ఆర్ ఎల్ డీలో చేరారు. 2014 ఎన్నికల తర్వాత యూపీ నుంచి లోక్ సభకు ఎన్నికైన తొలి ముస్లింగా తబస్సుమ్ పేరు నమోదు చేసుకున్నారు. ముజఫర్ నగర్ లో సహజంగా జాట్ ఓటర్లు ఎక్కువ. దీంతో జాట్ కుల పార్టీగా పేరున్న రాష్ట్రీయ లోక్ దళ్ అక్కడ్నుంచి పోటీ చేసి, గుజ్జర్లు పెద్ద సంఖ్యలో ఉన్న కైరానా ను ఎస్పీ లేదా బీఎస్పీకి వదిలేయాలని అజిత్ సింగ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తబస్సుమ్ బేగం మళ్లీ సమాజ్ వాది పార్టీలో చేరుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. లోక్ సభ ఎన్నికల్లో మొత్తం ఆరు సెగ్మెంట్లలో పోటీ చేయాలని ఆర్ ఎల్ డీ నిర్ణయించుకుంది. ఇందుకు సంబంధించి మహాఘట్ బంధన్ కూడా ఓకే చెప్పినట్లు తెలిసింది. మధుర,అమ్రోహా, బాగ్ పత్, బిజ్నోర్, ముజఫర్ నగర్, బులంద్ షహర్ సెగ్మెంట్ల నుంచి పోటీ కి అజిత్ సింగ్ పార్టీ రెడీ అవుతోంది. మధుర,బాగ్ పత్, ముజఫర్ నగర్ సెగ్మెంట్ల లో ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది.మధుర నియోజకవర్గం నుంచి పార్టీ ఉపాధ్యక్షుడు జయంత్ చౌధురి పోటీ చేసే అవకాశాలున్నాయి.



ఆర్ఎల్డీ చీఫ్ అజిత్ సింగ్

కమలంతో కలవం: స్టాలిన్

చెన్నై: రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునేది లేదని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాల హక్కులను అణగదొక్కుతోందని ఆరోపించారు. ఫెడరల్ వ్యవస్థకు బీజేపీ తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఎన్నికలకు సన్నద్ధం అవడంలో భాగంగా కొత్త, పాత మిత్రులను భాగస్వాములుగా చేర్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామంటూ తమిళనాడులోని బీజేపీ కార్యకర్తలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. 2014 ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ వచ్చినప్పటికీ, భాగస్వాములతో కలిసి సర్కార్ నడపడానికే తాము మొగ్గు చూపామన్నారు. కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్లడానికి బీజేపీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. దివంగత మాజీ ప్రధాని వాజ్ పేయి హయాంలో ఎన్డీయే కూటమి పనిచేసిన తీరును ఈ సందర్భంగా మోడీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వాజ్ పేయితో మోడీ తనను తాను పోల్చుకోవడం విడ్డూరంగా ఉందని స్టాలిన్ ఎగతాళి చేశారు. వాజ్ పేయి సంకీర్ణ ధర్మానికి కట్టుబడి పనిచేశారన్నారు. భాగస్వామ్య పక్షాలను ఎంతో గౌరవించారన్నారు. అందుకే వాజ్ పేయి హయాంలో ఎన్డీయే కూటమికి తాము మద్దతు ఇచ్చామని స్టాలిన్ వివరణ ఇచ్చారు.



సర్వీస్కి అలోక్వర్మ గుడ్బై

కొత్త పోస్టులో చేరకుండానే రాజీనామా

సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ సర్వీస్కు రిజైన్ చేశారు. శుక్రవారం ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్గా పదవీబాధ్యతలు చేపట్టకుండానే గుడ్ బై చెప్పారు. హైపవర్ కమిటీ తీరుపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తన వాదన వినకుండానే కమిటీ ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. సీవీసీని అడ్డంపెట్టుకుని సీబీఐ స్వతంత్ర ప్రతిపత్తిని ఇబ్బందికలిగించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. మరోవైపు, సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్ను కొట్టేయడానికి కోర్ట్ నో చెప్పింది.

న్యూఢిల్లీ:
సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్వర్మ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. సీబీఐ పదవి నుంచి ఉన్నత స్థాయి కమిటీ తొలగించిన ఒక్కరోజులోనే అలోక్వర్మ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)కు రిజైన్ చేశారు. పీఎం నరేంద్రమోడీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి, లోక్సభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ 2:1 మెజార్టీ నిర్ణయంతో అలోక్వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించింది. ఆయనను ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్, హోమ్ గార్డ్స్ డైరెక్టర్ జనరల్గా బదిలీచేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అయితే బాధ్యతల్ని చేపట్టకముందే తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

"సహజ న్యాయాన్ని (నేచురల్ జస్టిస్) పట్టించుకోలేదు. సెలక్షన్ కమిటీ కసరత్తు అంతా నన్ను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలన్న లక్ష్యంగానే సాగింది. తనపై చేసిన ఆరోపణలు ఫిర్యాదుచేస్తున్న వ్యక్తిని ఇప్పుడు సీబీఐ విచారణ జరుపుతోంది. ఆ నిజాన్ని కూడా కమిటీ పట్టించుకోలేదు." అంటూ పరోక్షంగా స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా పేరును ప్రస్తావించారు. "ఆస్తానా ఆరోపణల్ని మాత్రమే సీవీసీ ఫార్వర్డ్ చేసింది.ఈ ఆరోపణలపై నియమించిన జరిపిన జస్టిస్ (రిటైర్డ్) ఎ.కె.పట్నాయక్ కమిటీ ముందు ఆస్తానా ఎప్పుడూ విచారణకు హాజరుకాలేదు' అని అలోక్వర్మ చెప్పారు.

గురువారం తీసుకున్న నిర్ణయాలు నా పనితీరును ప్రతిఫలించబోదని, అయితే ఇది సీబీఐ లాంటి సంస్థను సీవీసీ ద్వారా కేంద్రం ఎలా కంట్రోల్ చేస్తుందో అనడానికి నిదర్శనమని మాజీ సీబీఐ చీఫ్ అన్నారు. అధికారంలో ఉన్న పార్టీలోని మెజార్టీ సభ్యుల ద్వారానే సీవీసీ నియామకం జరుగుతుందన్న విషయాన్ని ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. నిజానికి తన పదవీకాలం జులై 31, 2017 నాటికి ముగిసినా సీబీఐ చీఫ్ హోదాలో ఈ ఏడాది జనవరి 31 వరకు కొనసాగాల్సి వచ్చిందన్నారు. డీజీ ఫైర్ సర్వీసు డీజీ పదవికి అర్హమైన వయసు కూడా దాటిపోవడంవల్లే తాను కొత్తపోస్టులో చేరడంలేదని వివరించారు. ఈమేరకు డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీకి అలోక్వర్మ లెటర్ రాశారు.

రెండో సార్లు సీబీఐ చీఫ్గా తొలగింపు

సీబీఐ డైరెక్టర్గా పనిచేసిన అలోక్వర్మ రెండుసార్లు ఉద్వాసనకు గురయ్యారు. గురువారంనాటి హైపవర్ కమిటీ నిర్ణయంతో రెండో సారి ఆయన తన పదవిని కోల్పోయారు. అంతకుముందు సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాకు, వర్మకు మధ్య గొడవలు తారాస్థాయికి చేరడంతో కేంద్రమే గత ఏడాది అక్టోబరు 23న సీబీఐ చీఫ్ పదవి నుంచి తప్పించింది. అలోక్వర్మ, ఆస్తానాలు ఒకరిపై మరొకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. ఆస్తానాపై ఆలోక్వర్మ అవినీతి కేసు పెట్టారు. అవినీతిపరుడంటూ ఆస్తానా కూడా వర్మపై ప్రభుత్వానికి కంప్లయింట్ పెట్టారు. దీంతో కేంద్రం ఇద్దర్నీ బలవంతంగా సెలవుపై పంపించింది. కేంద్ర నిర్ణయంపై వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ డైరెక్టర్పై కేంద్రానికి ఎలాంటి అధికారం లేదంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అలోక్వర్మను మళ్లీ సీబీఐ చీఫ్గా నియమించాలని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడితో కూడిన హైపవర్ కమిటీకి మాత్రమే సీబీఐ చీఫ్పై చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని స్పష్టంచేసింది. ఈనేపథ్యంలో గురువారం ఈ కమిటీ సమావేశమైంది. అలోక్ వర్మను తొలగించడానికి అనుకూలంగా జస్టిస్ ఎ.కె.సిక్రి (సీజేఐ రంజన్ గొగొయ్ ప్రతినిధి), పీఎం నరేంద్రమోడీ ఓటేశారు. లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాత్రం వాళ్లద్దరి నిర్ణయంపై అసమ్మతిని తెలిపారు.

ఆగిన ట్రాన్స్ఫర్స్

అలోక్వర్మ స్థానంలో అడిషనల్ డైరెక్టర్గా ఉన్న ఎం.నాగేశ్వరరావు తాత్కాలిక బాధ్యతలు తీసుకున్నారు. తొలగించడానికి కొన్ని గంటల ముందు అలోక్వర్మ ఐదుగురు సీబీఐ ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే అలోక్ వర్మ చేసిన ట్రాన్స్ఫర్స్ను తాత్కాలిక సీబీఐ డైరెక్టర్ నాగేశ్వరరావు రద్దు చేశారు. గతంలో ఉన్న స్థానాల్లోనే వాళ్లను కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు.





ఆస్తానాకు ఎదురుదెబ్బ

10 వారాల్లో దర్యాప్తు పూర్తి చేయాలన్న ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణల వ్యవహారంలో ఆయనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టివేసేందుకు హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. క్రిమినల్ ప్రొసీడింగ్స్ నుంచి రక్షణ కల్పిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్ లపై నమోదైన ఎఫ్ఐఆర్ లను కూడా కొట్టివేసేందుకు న్యాయమూర్తి జస్టిస్ నజ్మీ వైజీరి నిరాకరించారు. ఈ కేసులో వాస్తవాలను పరిశీలించాక ఆస్తానా, కుమార్ లపై విచారణకు ముందస్తు అనుమతి అవసరం లేదని జడ్జి చెప్పారు. ఆస్తానా, ఇతరులపై కేసు విచారణను 10 వారాల్లోగా పూర్తి చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశించింది. ఎఫ్ఐఆర్ లను కొట్టివేయాలంటూ ఆస్తానా, దేవేందర్ కుమార్, ప్రసాద్ వేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. అలోక్ వర్మ, ఆస్తానా కొన్ని నెలలుగా ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటున్న విషయం తెలిసిందే. మాంసం ఎగుమతిదారు మొయిన్ ఖురేషీ కేసులో తనను తప్పించేందుకు మధ్యవర్తి ద్వారా అస్తానాకు లంచం ఇచ్చినట్లు హైదరాబాద్ కు చెందిన వ్యాపారి సతీశ్ బాబు ఆరోపించారు. దీంతో రాకేశ్ అస్తానా, సీబీఐ డిప్యూటీ ఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్లపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దేవేందర్ కుమార్ గత అక్టోబర్ 22న అరెస్టు కాగా అదే నెల 31న బెయిల్ మంజూరైంది. ప్రసాద్ గత అక్టోబర్ 17న అరెస్టు కాగా, డిసెంబర్ 18న బెయిల్ వచ్చింది. ఆస్తానా, కుమార్, ప్రసాద్ పై ఆధారాలు ఉన్నాయని ప్రిలిమినరీ ఎంక్వైరీ తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లో వర్మ పేర్కొన్నారు.



జస్టిస్ సిక్రి నిర్ణయంపై మాజీ జడ్జి ఖట్జూ ట్వీట్

అలోక్ వర్మపై చర్యలు తీసుకునేందుకు ఏర్పాటైన హైపవర్ కమిటీ మెంబర్గా ఉన్న జస్టిస్ ఏకే సిక్రి నిర్ణయంపై సుప్రీం కోర్టు మాజీ జడ్జి మార్కండేయ ఖట్జూ తన ఫేస్బుక్లో వివరాలు పోస్టు చేశారు. గతంలో తనతో పనిచేసిన సిక్రితో శుక్రవారం ఉదయం మాట్లాడినట్లు ఖట్జూ చెప్పారు. వర్మకు వ్యతిరేకంగా కొన్ని తీవ్రమైన ఆరోపణలున్నట్లు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, అవినీతి నిరోధక శాఖలు తెలిపాయని, దర్యాప్తు పూర్తయ్యే వరకు వర్మ సీబీఐ చీఫ్ పదవిలో ఉండకూడదని సిక్రి అభిప్రాయపడినట్టు తనతో చెప్పారని వివరించారు. "నిందితుడ్ని విచారించకుండానే సస్పెన్షన్ ఆర్డర్ ఇవ్వడం, విచారణను పెండింగ్లో ఉంచడం అనేది సాధారణం, అయినా వర్మను అదే స్థాయిలోని మరో పోస్టుకు బదిలీ చేశారంతే" అని ఖట్జూ పేర్కొన్నారు.

ఆ సినిమా షో ఆపండి: కాంగ్రెస్

పంజాబ్: 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'సినిమా ప్రదర్శనను నిలిపేవేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ లోని లుథియానాలో కాంగ్రెస్పార్టీ కార్యకర్తలు ఆందోళన చేశారు. మల్టీప్లెక్సుల ముందు నిరసనకు దిగారు. అయితే పోలీసులు జోక్యం చేసుకుని వారిని తరిమి కొట్టారు. పశ్చిమ బెంగాల్లో యూత్కాంగ్రెస్పార్టీ కార్యకర్తలు సినిమా విడుదలను అడ్డుకున్నారు. ప్రదర్శనను నిలిపేయాలని థియేటర్ల ముందు ధర్నా చేశారు. మోడీ దిష్టిబొమ్మను, సినిమా పోస్టర్లను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు సినిమా విడుదల సందర్భంగా మధ్యప్రదేశ్ లోని ఇండోర్లో బీజేవైఎం కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బ్యాండ్తో ఊరేగింపుగా వచ్చి సినిమాను చూశారు. ఈ సందర్భంగా సీఎం కమల్నాథ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఊళ్లను మింగుతున్న మైనింగ్

అలప్పాడ్ (కేరళ):

పాడుబడిన ఇళ్లు, దుమ్ముకొట్టుకుపోయిన స్కూళ్లు, ఇసుక కుప్పలు, నిర్మానుష్యంగా ఉండే ఓ గుడి, ఎండిపోయిన మడ అడవులు.. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన పొన్మానా గ్రామం ప్రస్తుత పరిస్థితి ఇది. కేరళలోని కొల్లాం జిల్లా అలప్పాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుందీ ఊరు. ఇలా పాడుబడిన గ్రామాలు అక్కడ ఇంకా చాలానే ఉన్నాయి. అసలు కనిపించకుండా పోయిన గ్రామాలు ఇంకెన్నో. అసలు ఎందుకీ పరిస్థితి?

జోరుగా ఇసుక మైనింగ్

త్రివేండ్రం-షోరానూర్ (టీఎస్) కెనాల్ మధ్య అలప్పాడ్ పంచాయతీ ఉంటుంది. అలప్పాడ్ పరిధిలోని గ్రామాలతోపాటు ఇతర పల్లెల బీచ్లలో ఇసుక మైనింగ్ జోరుగా సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ఆధ్వర్యంలోనే పనులు సాగుతున్నాయి. దీంతో దశాబ్దాల కిందట లిథోగ్రాఫిక్ మ్యాప్లో 89.5 చదరపు కిలోమీటర్లుగా ఉన్నా అలప్పాడ్ పంచాయతీ, ప్రస్తుతం 7.6 చదరపు కిలోమీటర్లు తగ్గిపోయింది. ప్రస్తుతం పొన్మానాలో రెండు కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి.

ఓ గ్రామం తర్వాత మరొకటి

బీచ్లలో ఇసుక మైనింగ్కు వ్యతిరేకంగా స్థానికులు పోరాడుతున్నారు. తీరంలోని ఇసుకను తవ్వి తరలిస్తుండటంతో సముద్రం కోతకు గురై తమ భూములను మింగేస్తోందని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఇండియన్ రేర్ ఎర్త్ (ఐఆర్ఈ)', కేరళ మైన్స్, మెటల్స్ లిమిటెడ్ (కేఎంఎంఎల్) చేపట్టిన మైనింగ్ యాక్టివిటీల వల్ల ఒక గ్రామం తర్వాత మరో గ్రామం మ్యాపుల్లో కనిపించకుండా పోతున్నాయని ఆరోపిస్తున్నారు. పొన్మానా గ్రామం మాత్రమే కాదని, ఇలాంటి ఎన్నో గ్రామాలు పాడుబడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా గ్రామాలనైనా కాపాడుకోవాలని అలప్పాడ్ పంచాయతీ, ఇతర గ్రామాల ప్రజలు నిర్ణయించారు. 'యాంటీ మైనింగ్ పీపుల్స్ ప్రొటెస్ట్ కౌన్సిల్' అనే సంస్థగా ఏర్పడి పోరాడుతున్నారు. ఇసుక మైనింగ్ను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అలప్పాడ్లోని వెల్లనాతురుతు గ్రామంలో రెండు నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు.

నదుల్లోకి ఉప్పు నీరు

సముద్ర కోత మరింత పెరిగితే నదుల్లోని నీరు ఉప్పగా మారిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని చెబుతున్నారు. ముఖ్యంగా కేరళలో వరి ఎక్కువగా పండే లోయర్ కుట్టనాడ్పై ప్రభావం పడుతుందంటున్నారు.



- కేరళ తీరంలోని గ్రామాలు మాయం
- పల్లెలను విడిచి వెళ్తున్న ప్రజలు
- ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలోనే మైనింగ్
- ఇసుక తరలింపు ఆపాలంటూ సాగుతున్న ఆందోళనలు
- రెండు నెలలుగా రిలే నిరాహార దీక్షలు

అన్ని రూల్స్ పాటిస్తున్నాం

"మాది వ్యూహాత్మక ప్రాముఖ్యమున్న పబ్లిక్ సెక్టార్ కంపెనీ. మైనింగ్కు సంబంధించిన అన్ని నిబంధనలను పాటిస్తున్నాం. మేం అనుసరించే ప్రక్రియ గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మానిటరింగ్ ఏజెన్సీలకు తెలుసు. దాదాపు 60 పరిశ్రమలు పని చేస్తున్నాయి. ఇందులో ట్రావెన్కోర్ టైటానియం ప్రొడక్ట్స్, కేఎంఎంఎల్ వంటి సంస్థలు కూడా ఉన్నాయి"

- ఐఆర్ఈలో పని చేసే ఓ అధికారి

ప్రభుత్వానికి తెలుసు

"ప్రస్తుత పరిస్థితి గురించి ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు. స్థానికుల ఆందోళనల్లో నిజానిజాలు తెలుసుకునేందుకు స్టడీ చేస్తాం. తర్వాత మైనింగ్ లిమిట్ విధించడం గురించి ఆలోచిస్తాం. సముద్ర ఇసుక మైనింగ్ కాకుండా, ఇన్లాండ్ మైనింగ్ చేపట్టాలని ప్రభుత్వం కూడా సూచనలిచ్చింది"

- కొల్లాం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.కార్తికేయన్

మరిన్ని గ్రామాలు

"మేం ఈ ఆందోళనలు మాకోసం చేయడం లేదు. తర్వాతి లిస్టులో అలప్పుజా జిల్లాలోని ఒనట్టుకారా, అప్పర్ కుట్టనాడ్, అరట్టుపుజా గ్రామాలు ఉన్నాయి. మైనింగ్ ఇలానే కొనసాగితే ఉప్పు నీళ్లు పల్లికల్, అచంకోవిల్ నదుల్లో కలుస్తాయి. వరి పంటపై తీవ్ర ప్రభావం పడుతుంది"

- యాంటీ మైనింగ్ పీపుల్స్ ప్రొటెస్ట్ కౌన్సిల్ సభ్యుడు కేఎస్ శ్రీకుమార్

కంపెనీ మోసం చేసింది

"భూమిని ఇస్తే బదులుగా ఉద్యోగమిస్తామని కంపెనీ చెప్పడంతో కొన్నేళ్ల కిందట యూఏఈలో జాబు వదులుకుని వచ్చా. ఉద్యోగమిచ్చారు. కానీ రెండేళ్ల కాంట్రాక్టు ముగియడంతో ఇంటికి పంపేశారు. గ్రామాల్లోని చాలా మంది ఇలా భూమి పోగొట్టుకున్నారు. వారిచ్చిన ఎంతో కొంత పరిహారాన్ని తీసుకుని వెళ్లిపోయారు"

- ప్రశాంత్, స్థానికుడు



మంచు ముగ్గులు!

కాశ్మీర్లో కురుస్తున్న మంచు కొత్త అందాలకు విందుచేస్తోంది. పేరుకుపోయిన మంచులో కొత్త రూపాలు కనిపిస్తున్నాయి. శ్రీనగర్లోని ఓ పార్క్లో శుక్రవారం ఇలా మొక్కలపై మెరిసిన మంచు ముగ్గులుపెట్టినట్టు కనిపించింది. సంక్రాంతికి ఇది ప్రకృతి ఇచ్చిన కానుకేమో!



పాయసం పాత్రలను స్వామికి నివేదిస్తున్న అర్చకులు

వైభవంగా కూడార్రై ఉత్సవం

- రామయ్యకు నైవేద్యంగా 108 గంగాళాల పాయసం

భద్రాచలం, వెలుగు : శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం కూడార్రై ఉత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామికి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ధనుర్మాసోత్సవాల్లో గోదాదేవి అమ్మవారు చేపట్టిన వ్రతం చివరి రోజున స్వామికి 108 గంగాళాల్లో పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తానని మొక్కుకుంటుంది. దీనిలో భాగంగా ఈ ఉత్సవాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ముందుగా ప్రాకార మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామికి విశేషపూజలు చేశారు. గోదాదేవి అమ్మవారిని కూడా అలంకరించి తీసుకొచ్చారు. పాయసాన్ని తయారు చేసి ముందుగా పేర్చిన 108 పాత్రల్లో ఉంచారు. దివ్యప్రబంధాల్లోని చివరి పాశురాల ప్రవచనం తర్వాత స్వామికి నైవేద్యంగా గోదాదేవి అమ్మవారు పాయసాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పాయసాన్ని తీర్థ ప్రసాదాలుగా స్వీకరించారు. అంతకు ముందు శ్రీసీతారామచంద్రస్వామి మూలవరులకు స్వర్ణ కవచం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆటలాడండి... పేరు తెండి



- మంచిర్యాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

మంచిర్యాల, వెలుగు : క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకుని జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 4వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల వాలీబాల్ పోటీలను ఆయన మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, రామగుండం సీపీ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంచిర్యాలలో స్టేడియం నిర్మాణానికి రూ.2.6 కోట్లు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదన్నారు. రూ.50 కోట్లతో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉంటారన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా ముందుగా విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో అతిథులకు స్వాగతం పలికారు. పోటీల్లో పాల్గొంటున్న పది ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలబాలికలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ వేణుగోపాల్‌రావు, పోటీల కన్వీనర్, మంచిర్యాల సీఐ ఎడ్ల మహేష్, సీఐలు చంద్రమౌళి, రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వసుంధర, వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

కోల్‌బెల్ట్ అభివృద్ధికి రూ.1600 కోట్లు

- భద్రాద్రి జిల్లాకు రూ.300 కోట్లు
- వివరాలు వెల్లడించిన సింగరేణి డైరెక్టర్లు

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో అభివృద్ధి పనులకు గానూ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద రూ.1600 కోట్లను సింగరేణి మంజూరు చేసిందని కంపెనీ డైరెక్టర్లు ఎస్ చంద్రశేఖర్, ఎన్ బలరాం, ఎస్ శంకర్, బీ భాస్కర్‌రావు తెలిపారు. కొత్తగూడెంలోని బంగ్లోస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద పెద్దపల్లి జిల్లాకు రూ.600 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రూ.300 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం, కంపెనీ సీఎండీ ఎన్ శ్రీధర్ ప్రణాళిక బద్ధమైన ముందుచూపుతో సింగరేణి కంపెనీ దేశంలోని బొగ్గు పరిశ్రమల్లోనే నెంబర్ వన్‌గా ఎదుగుతోందన్నారు. టన్నుకు రూ.300 లాభం ప్రస్తుతం వస్తోందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ.1200 కోట్లు లాభం వచ్చిందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరింతగా సంస్థ లాభాలు సాధించే దిశగా పయనిస్తోందన్నారు. ఇతర రాష్టాల్లోనూ కొత్త బొగ్గు బ్లాకుల ఏర్పాటుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణి ఇంటర్నల్, ఎక్స్ టర్నల్ విభాగాల్లో వందకు పైగా నోటిఫికేషన్లను ఇచ్చి దాదాపు 5వేల మందికి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. కొత్త బొగ్గు గనుల ఏర్పాటు విషయంలో ఒక్క రామగుండం ఏరియాలో భూసేకరణ విషయంలో కొంత ఇబ్బందులున్నాయని అన్నారు. సింగరేణిలో తొలిసారిగా రూ.1,360 కోట్లతో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రూ.650 కోట్లతో 129 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. భూగర్భ గనుల్లో ఈ ఏడాది కనీసం ఒక మిలియన్ టన్నుల బొగ్గును అధికంగా ఉత్పత్తి చేసేలా కృషి చేస్తున్నామన్నారు. 7,800 మందికి పైగా రిటైర్డ్ కార్మికులకు ఆరోగ్య కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 5,800 మందికి పంపిణీ చేశామన్నారు. రూ.పది లక్షల ఇంటి నిర్మాణ లోన్ కోసం 2,335 దరఖాస్తులు వచ్చాయని, 500 దరఖాస్తులకు మంజూరు ఇచ్చామని తెలిపారు. ఇటీవల జరిగిన రెండు రోజుల సమ్మె సమయంలోనూ కార్మికులు కంపెనీ పరిస్థితిని అర్థం చేసుకొని విధులకు హాజరయ్యారన్నారు. దీంతో 2లక్షల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి సాధించామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి నివేదించిన ప్రకారంగా 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డిసెంబర్ నాటికి డిపార్ట్‌మెంటల్ పరంగా ఓవర్‌బర్డెన్ విషయంలో 15శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. ఉత్పాదకత 2017 డిసెంబర్‌లో 4.26గా ఉంటే 2018 డిసెంబర్ నాటికి 5.79గా నమోదైందని వివరించారు. అడ్రియాల లాంగ్‌వాల్ ద్వారా బొగ్గు ఉత్పత్తిని మరింతగా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పర్సనల్, వెల్ఫేర్ జీఎంలు కే బసవయ్య, ఆనందరావు, రుష్యేంద్రుడు పాల్గొన్నారు.



తిరిగొస్తాం.. తిరిగిస్తాం

పల్లెబాట పట్టిన ఉద్యోగులు • స్థానిక ఎన్నికల బరిలో గ్రాడ్యుయేట్లు

పెద్ద సదువులు సదివిండు... ఇగ ఊర్ల ఎందుకుంటడు. పట్నం పోయి ఏదో ఒక ఉద్యోగం సూసుకుంటడు... ఒకప్పుడు పల్లెల్ల ఇన్పించిన మాటలివి. గిప్పుడు సీన్ రివర్సయితంది. పెద్ద సదువులు సదివినోళ్లంత కొలువులు మానేసి మళ్ల ఊర్ల బాట పడుతున్నరు. వార్డుమెంబర్లు, సర్పంచులుగా పోటీ చేస్తున్నరు. ఊరి డెవలప్‌మెంట్‌కు పని చేస్తమని చెబుతున్నరు.

దేవరకొండ, వెలుగు: ఉన్నత చదువులు చదివినవారు సొంత గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనతో తిరిగి ఊళ్ల బాట పడుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతుండడం, రిజర్వేషన్లు సైతం కలిసి రావడంతో బీటెక్, ఎంటెక్, ఎంఫిల్, ఎల్ఎల్‌బీ, పీజీలు చేసిన వారు సైతం బరిలో ఉంటున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడమే లక్ష్యంగా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ పడుతున్నారు. చదువుకున్నవారు ప్రజాప్రతినిధులు అయితే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని చెబుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ, కొండమల్లేపల్లి, చందంపేట, నేరడుగొమ్ము, డిండి, చింతపల్లి, పీఏ పల్లి మండలాల్లో వార్డుసభ్యులు, సర్పంచ్ పదవులకు వచ్చిన నామినేషన్లలో 25 శాతానికి పైగా విద్యాధికులవే కావడం గమనార్హం.



గ్రామాభివృద్ధి కోసమే..

మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే సర్పంచ్ పదవికి నామినేషన్ వేశా. 2017లో జేఎన్‌టీయూ నుంచి ఎంటెక్ పూర్తి చేశా. ఇన్నాళ్లుగా హైదరాబాద్‌లోనే ప్రైవేట్ జాబ్ చేశా. సివిల్ ఇంజినీరింగ్ నా సబ్జెక్టు. గ్రామస్తుల నుంచి సహకారం లభిస్తోంది. ఎన్నికల్లో గెలుస్తాననే నమ్మకముంది.

నేనావత్‌దేవా, ఎంటెక్, దేఖాతండా



ఉపసర్పంచినవుతా

నేను ఎంటెక్ చేశా. ఊరికి ఏదైనా చేయాలనే ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా నామినేషన్ వేశా. ఎంటెక్ చదువుకుంటున్నప్పుడే ప్రైవేట్‌గా ఉద్యోగం చేశా. అది మానేసి ఊర్లోనే వ్యవసాయం చేయిస్తున్నా. వార్డు సభ్యుడిగా గెలిస్తే ఉప సర్పంచ్‌గా ఎన్నికవుతాననే నమ్మకం ఉంది.

ముదిగొండ హరిదాస్, ఎంటెక్, కాసారం



ఏకగ్రీవం చేసుకుంటున్నాం

మాది కొత్తగా ఏర్పడిన పంచాయతీ. బాగా చదువుకున్నవారైతే అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతో నన్ను ఎన్నికల్లో నిలబెట్టారు. నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినప్పటికీ తండాలోనే ఉంటున్నా. ఇక్కడి ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. తండాలో సర్పంచ్ పదవికి నేనొక్క దానినే నామినేషన్ వేశా.

రాజేశ్వరి, గౌరికుంట తండా

వార్డుమెంబర్‌గా పోటీ



ఎంటెక్ పూర్తి చేసినప్పటికీ ఊర్లోనే వ్యవసాయ పనులు చూసుకుంటున్నాం. ఇన్నాళ్లు హైదరాబాద్‌లోనే ఉన్నాం. మా తండా ఈ సారి సూర్యతండా గ్రామపంచాయతీగా మారింది. అందుకే వార్డుమెంబర్‌గా నామినేషన్ వేశా. కచ్చితంగా గెలుస్తాననే నమ్మకముంది. ఉపసర్పంచి పదవి కూడా వచ్చే అవకాశముంది. అనుకున్నట్లు జరిగితే ఇక్కడికే షిఫ్ట్ అవుతా. తండాను అభివృద్ధి చేయాలనే ఆశయంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నా.

నేనావత్‌నారాయణ, ఎంటెక్, బాన్యబావోజి తండా

విద్యావంతులను గెలిపించాలి



రాజకీయాల్లో చదువుకున్నవారు లేకపోవడం వల్లే గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. ఈసారి ప్రజలు బాగాచదువుకున్నవారిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. విద్యార్థి నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై పోరాడిన అనుభవముంది. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే మైనంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశా.

కొర్ర రాంసింగ్‌నాయక్, ఎంఏ, ఎల్ఎల్‌బి, కొర్రతండా



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం..

- షాపును పేల్చేశాడు
- ఖమ్మం పేలుళ్ల సూత్రధారి అరెస్టు

ఖమ్మంటౌన్, వెలుగు : ఖమ్మం కమాన్ బజార్‌లోని శ్రీనివాస బట్టల షాపులో జరిగిన పేలుళ్ల సూత్రధారి దేవాండ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు నగర ఏసీపీ జీ వెంకట్రావ్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం వన్ టౌన్ లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటకు చెందిన దేవాండ్ల శ్రీనివాస్ 1994 నుంచి వివిధ ప్రాంతాల్లో బట్టల షాపులు నడిపిన ష్టాలు చవిచూశాడు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లిలో శ్రీనివాస బట్టల షాపును నిర్వహించాడు. అక్కడ కూడా నష్టం రావడంతో మార్చి 2017లో ఖమ్మం కమాన్ బజార్‌లోని బండారు కుమార్‌కు చెందిన రెండంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకొని వ్యాపారం మొదలు పెట్టాడు. నష్టాలు రావడంతో వర్కర్లకు జీతాలు, షాపు అద్దె చెల్లించలేకపోయాడు. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో షాపులో ఫర్నీచర్‌కు ఇన్స్యూరెన్స్ చేయించి, షాపును తగలబెట్టి ఇన్సరెన్స్ డబ్బులు తీసుకోవాలని ప్లాన్ వేశాడు. గతేడాది అక్టోబర్ 26వ తేదీన షాపులోని స్టాక్‌కు రూ.99 లక్షలు, ఫర్నీచర్‌కు రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయించాడు. ఆ మరుసటి రోజు నర్సంపేటలోని ఖమ్మంపల్లికి చెందిన ఐదుగురు కూలీలను పిలిపించి ఆ రాత్రి స్టాక్‌ను ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు లోని అద్దె ఇంటికి తరలించాడు. అక్టోబర్ 28న పెట్రోల్ తీసుకువచ్చి సిద్ధంగా పెట్టుకున్నాడు. 29వ తేదీన రాత్రి 2:30 గంటల సమయంలో పాతస్టాక్‌పై శ్రీనివాస్ పెట్రోల్ పోశాడు. అందుబాటులో అగ్గిపెట్టె లేకపోవడంతో కరెంట్ వైర్లను కలపగా మంటలు చెలరేగాయి. దాంతోపాటు పెద్ద శబ్దంతో షాపు కూలిపోయింది. శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. ట్రీట్‌మెంట్ అనంతరం శుక్రవారం అరెస్టు చేశారు. గుర్రాలపాడులో దాచిపెట్టిన స్టాక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో సీఐలు రమేశ్, నరేందర్, షూకుర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుంటే కారు ఢీకొట్టింది

భార్యాభర్తల మృతి

కోదాడ, వెలుగు : రోడ్డు దాటుతుండగా కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యభర్తలు మృతిచెందారు. మునగాల మండలం గణపవరం గ్రామానికి చెందిన సూరేపల్లి ముత్తయ్య, కమలమ్మ దంపతులు ముకుందాపురంలోని వారి బంధువు మరణించడంతో పరామర్శించడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతుండా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు వేగంగా వచ్చి వారిని ఢీ కొట్టింది. ప్రమాదంలో కమలమ్మ (50) అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు ముత్తయ్య(55)ను కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.







వైకుంఠపురం రథయాత్ర

సంగారెడ్డి శివారులో ప్రసిద్ధి గాంచిన వైకుంఠపురం శ్రీమహాలక్ష్మి గోదాసమేత విరాట్ వేంకటేశ్వర స్వామి రథయాత్ర శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి వైకుంఠపురం వరకు దాదాపు 10 గంటల పాటు రథయాత్ర కొనసాగింది. గోండు నృత్యాలు, చిన్నారుల వేషధారణలు, మహిళల కోలాటాలు, కేరళ వాయిద్యాలు, అంబారీ ఊరేగింపులు, అశ్వాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆశ్రమాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో దర్శకుడు పూరి జగన్నాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

- సంగారెడ్డి, వెలుగు



'లా' పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

హైదరాబాద్, వెలుగు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో న్యాయ విద్య (లా) కోర్సుల పరీక్షల షెడ్యూల్ మారింది. రాష్ట్రంలో ఈ నెల 21, 25, 30 తేదీల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి. అయితే అవే తేదీల్లోనే ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ, బీకాం ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ హానర్స్, బీబీఏఎల్ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్షల షెడ్యూల్‌ను ఓయూ అధికారులు విడుదల చేశారు. విద్యార్థులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో పరీక్షల రీ షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేశారు. 21న జరగాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 7కు, 25న జరగాల్సిన పరీక్షలు ఫిబ్రవరి 11కు, 30న జరగాల్సిన ఎగ్జామ్స్‌ను ఫిబ్రవరి 8కి మార్చినట్టు అధికారులు తెలిపారు. కాగా 21న జరగాల్సిన ఎల్ఎల్ఎం లీగల్ రీసెర్చ్ మెథడాలజీ పరీక్షను ఈనెల 28కి మార్చారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

హైదరాబాద్, వెలుగు: నిరుద్యోగ యువతకు అపెరెల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్(ఏటీడీసీ) ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏటీడీసీ ప్రకటించింది. ఇంటర్ పాసైన 18 నుంచి 25 ఏళ్లలోపు యువతకు హైదరాబాద్‌లో 8 నెలల పాటు శిక్షణ ఇస్తామని తెలిపింది. వివరాలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని ఏటీడీసీ కార్యాలయంలో సంప్రదించవచ్చని లేదా 040 23112155/56, 9912108844, 9885089801, 961123 8944 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

సీబీఐ డైరెక్టర్ తొలగింపు అప్రజాస్వామికం: మల్లు రవి

హైదరాబాద్, వెలుగు: రాఫెల్ కుంభకోణం నుంచి తప్పించుకోవడానికే ప్రధాని మోడీ సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను ఆగమేఘాల మీద బదిలీ చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఆరోపించారు. వర్మ నుంచి వివరణ తీసుకోవాలని తమ పార్టీ నేత మల్లికార్జున ఖర్గే ప్రధానికి సూచించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్మను తప్పించిన తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉందన్నారు. రాజ్యాంగ హక్కును మోడీ తన స్వార్థానికి వాడుకుంటున్నారని విమర్శించారు.

రోహింగ్యాల డ్రగ్స్ దందా



- పాతబస్తీ శివారు ప్రాంతాల్లో సప్లయ్
- ఇద్దరు మయన్మార్ దేశస్థుల అరెస్ట్
- 133 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్, వెలుగు: డ్రగ్స్ కేసుల గురించి విన్నప్పుడల్లా నైజీరియన్లే గుర్తొస్తారు. చదువుల పేరుతో ఇండియాకి వచ్చి డ్రగ్స్ సప్లయ్ చేస్తూ పోలీసులకు పట్టుబడుతుంటారు. అయితే ఇప్పుడు డ్రగ్స్ దందాను శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాలు కూడా తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీ శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నారు. బాలాపూర్ పోలీసులు సమాచారం అందుకుని ఇద్దరు మయన్మార్ దేశస్థులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 133 గ్రాముల డ్రగ్స్ ట్యాబ్లెట్లు, రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రాచకొండ సీపీ మహేశ్ భగవత్ వెల్లడించారు.

ఈజీ మనీ కోసం

మయన్మార్‌కు చెందిన రెహమాన్ (21), మహ్మద్ రహీమ్(20) హైదరాబాద్‌లోని బాలాపూర్ రాయల్ కాలనీలో ఉంటున్నారు. రహీమ్ హోటల్‌లో, రెహమాన్ సెంట్రింగ్ పని చేస్తున్నారు. ఈజీ మనీ కోసం డ్రగ్స్ సప్లయర్స్ గా మారారు. మయన్మార్‌కు చెందిన సలీమ్ అనే ఏజెంట్ వద్ద డ్రగ్స్ ట్యాబ్లెట్లను కొంటున్నారు. సలీమ్ నుంచి ఒక్కో ట్యాబ్లెట్‌కు రూ.50 చొప్పున కొనేవారు. తర్వాత డిమాండ్‌కు తగ్గట్టు ఒక్కో ట్యాబ్లెట్‌ను రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మి సొమ్ము చేసుకునే వాళ్లు. వారం రోజుల క్రితమే సలీమ్ నుంచి రూ.66,500లతో 1,330 డ్రగ్స్ ట్యాబ్లెట్లను కొన్నారు.



నిందితులు రెహమాన్, మహ్మద్ రహీమ్

కోడ్ భాషలో సప్లయ్

రెహమాన్, రహీమ్ తాము సప్లయ్ చేసే డ్రగ్స్‌కు 'వై' 'యాబా' అని కోడ్‌లు పెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం రాయల్ కాలనీలోని ఫాతీమా మజీద్ వద్ద డ్రగ్స్ ట్యాబ్లెట్లను సప్లయ్ చేసేందుకు రెడీ అయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వి.సైదులు సిబ్బందితో కలిసి రెహమాన్, రహీమ్‌లను అదుపులోకి తీసుకున్నారు. 7 పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసిన 133 గ్రాముల డ్రగ్స్ ట్యాబ్లెట్లను గుర్తించారు. రెండు మొబైల్, ఫోన్లు రూ.26 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.

మూడు రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం

కుమ్రంభీం జిల్లా గిన్నెదారిలో 7.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

హైదరాబాద్, వెలుగు: రానున్న మూడురోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం చెప్పారు. కోస్తా కర్నాటక నుంచి నైరుతి మధ్యప్రదేశ్ వరకు నార్త్ ఇంటీరియర్ కర్నాటక, మరాఠ్వాడ, విదర్భ మీదుగా 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందన్నారు. తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి చలిగాలులు వీస్తున్నాయన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రాష్ట్రంలో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఉదయం 8 దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. కుమ్రంభీం జిల్లాలోని గిన్నెదారిలో 7.2 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లాలోని అర్లిలో 7.4, బేలలో 7.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు చెప్పారు.



డెడ్ స్టోరేజీకి జూరాల

- వేసవిలో తాగునీటి అవసరాలపై అధికారులు తలోదారి..
- ఏది వాస్తవమో అంతుబట్టని వైనం..
- గతంలోనూ ఇదే సమస్య...
- ముందస్తు చర్యలు శూన్యం

గద్వాల, వెలుగు :

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. భిన్నమైన నిర్ణయాలతో వేసవిలో తాగునీటి అవసరాలపై అంతుబట్టని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏది వాస్తవమో తెలియని పరిస్థితి నెలకొంది. జూరాల ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వను తాగునీటి అవసరాల కోసం ఉంచేందుకు జనవరి 1వ తేదీ నుంచి నీటి విడుదలను నిలిపి వేస్తున్నామని జూరాల ఇంజనీర్ల సూచన మేరకు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ డిసెంబర్ 31న ప్రకటన జారీ చేశారు. కలెక్టర్ చేత ప్రకటన విడుదల చేయించిన జూరాల ఇంజనీర్లు, అదే జూరాల నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు ఎలాంటి ఢోకా లేదని మరో ప్రకటన ఈ నెల 8వ తేదీన జారీ చేశారు. ఒకసారి వేసవి తాగునీటి కోసం నిల్వ చేయాలని, మరోసారి విడుదల చేసినా సమస్య రాదని భిన్నమైన ప్రకటనలు చేస్తుండడంతో ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ఏది వాస్తవమో.. ఏది అవాస్తమోనని తేల్చుకోలేకపోతున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయంలో నీటిమట్టం 315 మీటర్లకు తగ్గి డెడ్ స్టోరేజీకి చేరింది. జనవరి నెలలోనే జూరాల డెడ్‌స్టోరేజికి వెళ్లడం అందరిని ఆందోళనకు గురి చేస్తోంది. వేసనిలో తాగు అవసరాలకు నీళ్లు ఇవ్వండంటూ కర్ణాటక ప్రభుత్వాన్ని వేడుకోవాల్సిన పరిస్థితి తప్పేలా లేదని జూరాల ఇంజనీర్లే పరోక్షంగా అంటున్నారు. ఇప్పటికే గత అనుభవాలు లేకపోలేదు. 2016, 2017లోనూ జూరాల జలాశయం వట్టిపోయింది. 'కనీసం 3 టీఎంసీల నీటిని విడుదల చేయండి. తాగునీటి అవసరాలు తీర్చుకుంటాం' అని మన ప్రభుత్వం కర్ణాటకను వేడుకుని నీటిని విడుదల చేయించుకుంది. ఇన్ని ఉన్నా.. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతుందనేది పరిపాటిగా మారినట్టు కన్పిస్తున్నది. ఈ ఏడాది వర్షాకాలంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు తక్కువగా కురిశాయి. అందుకు జూరాల నుంచి ఎక్కువ రోజులు నీటిని విడుదల చేయలేమని, డిసెంబర్‌లోగానే పంటలు పూర్తయ్యేలా సాగు చేసుకోవాలని ఆయకట్టు రైతులను చైతన్య పర్చే కార్యక్రమాలను చేపట్టక పోవడం కూడా మరో తప్పిందంగా కన్పిస్తున్నది. సమస్య వచ్చినప్పుడే స్పందించే అలవాటు నుంచి కర్ణాటక రాష్ట్రంలా ముందు జాగ్రత్తగా రైతులను అప్రమత్తం చేయలేక పోతున్నది ఇక్కడి అధికార యంత్రాంగం.

జూరాల నుంచే ఉమ్మడి పాలమూరు తాగునీరు...

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయం నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన పట్టణాల తాగునీటి అవసరాలు ఆధారపడి ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా గద్వాల జిల్లా అంతటికీ, పాత తాగు నీటి పథకాల ద్వారా పాలమూరు, కొత్తకోట, వనపర్తి, దేవరకద్ర, తదతర పట్టణాలు ఆధారపడి ఉన్నాయి.

జూరాల ప్రాజెక్టు జలాశయంలో నీటిమట్టం....

జూరాల ప్రాజెక్టు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 9.66 టీఎంసీల సామర్థ్యం ఉంది. జనవరి 1వ తేదీన 4.64 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అందులో లైవ్ స్టోరేజి 0.92 టీఎంసీలు. అదే రోజు నుంచి వేసవి తాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి విడుదలను నిలిపి వేస్తామని జిల్లా కలెక్టర్ ప్రకటన చేశారు. ఆ మరుసటి రోజు నుంచే నీటి విడుదల నిలిచిపోతుందనుకున్నారు. కానీ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నీటి విడుదలను కొనసాగిస్తున్నామని ఇంజనీర్లు చెప్పారు. నాటి నుంచి నీటి విడుదలను కొనసాగిస్తుండగా, 10 వ తేదీ నాటికి జూరాల జలాశయంలో నీటిమట్టం డెడ్‌స్టోరేజికి చేరింది. 315 మీటర్లకు రాగానే డెడ్‌స్టోరేజిగా అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం జలాశయంలో నీటినిల్వ 3.93 టీఎంసీలకు చేరింది. అందులో లైవ్ స్టోరేజి నీటి లభ్యత కేవలం 0.22 టీఎంసీలుగా ఉంది. ఇంకా ఎడమ కాలువ ద్వారా 555 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 53 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



మిషన్ భగీరథకు ఢోకాలేదు :

జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా మిషన్ భగీరథకు ఎలాంటి ఇబ్బంది రాదు. కేవలం ఆపోహ మాత్రమే. భగీరథకు ప్రభుత్వం ఇచ్చిన జీఓ 885 తేదీ 30.10.2017 ప్రకారం 2.66 టీఎంసీలు అవసరం. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 4.07 టీఎంసీల నీటినిల్వ ఉంది. అందుకు తాగునీటి అవసరాలకు నీటి కొరత ఉండదు.

శ్రీధర్, ఈఈ, జూరాల ప్రాజెక్టు

డెయిరీలు, నాటు కోళ్లు

నిరుద్యోగులకు స్వయం ఉపాధి చూపే సరికొత్త పథకాలను ఎస్సీ సంక్షేమ శాఖ రూపొందిస్తోంది. ఇప్పటికే కొన్ని పథకాల అమలుకు రంగం సిద్ధం చేసింది. మరికొన్ని పట్టాలెక్కించేందుకు ప్రయత్నిస్తోంది. తొలుత మునిసిపల్ పరిధుల్లో, పంచాయతీ ఎన్నికలు పూర్తి కాగానే గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

హైదరాబాద్, వెలుగు:

ఎస్సీ కార్పొరేషన్ నుంచి ప్రస్తుతం రూ.5 లక్షల రుణ పథకం ద్వారా డెయిరీ యూనిట్లు అందజేస్తున్నా అవి పరిమిత సంఖ్యలోనే అందుతున్నాయి. ఇప్పుడు ఈ పథకాన్ని మరింత కింది స్థాయికి తీసుకెళ్లేందుకు బడ్జెట్‌ను రూ.5 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు పరిమితం చేయనుంది. లబ్ధిదారులకు కనీసం నాలుగు పాడి గేదెలను అందజేయనుంది. సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపును పూర్తి చేసింది. సబ్సిడీ పోను మిగతా మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా సమకూరుస్తోంది. ఈ పథకాన్ని వచ్చే నెలలో అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

జోగినులకు ప్రోత్సాహకాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జోగినులకు ప్రభుత్వం జీవనోపాధి కోసం కొంత భూమి కేటాయించింది. జోగినులను ఐదు గ్రూపులుగా విభజించిన సంక్షేమ శాఖ వారికి కేటాయించిన భూమిని సద్వినియోగం చేయడానికి వేర్వేరు పథకాలను రూపొందించింది. కొందరికి కూరగాయలు సాగు చేసేందుకు ప్రోత్సాహకాన్ని అందజేస్తోంది. మరికొందరికి డెయిరీ, సిమెంట్ బ్రిక్స్ తయారీ యూనిట్లు అందజేయనుంది. వచ్చే నెలలో ఈ స్కీం ప్రారంభించనుంది.

యువ రైతులకు ట్రాక్టర్లు

వ్యవసాయ శాఖ ద్వారా పెద్ద రైతులకు మాత్రమే ట్రాక్టర్లు అందుతుండటంతో ఎస్సీ నిరుద్యోగ యువతకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందజేయాలని ఎస్సీ శాఖ నిర్ణయం తీసుకుంది. 30 జిల్లాల్లో తొలి దశలో కనీసం వంద ట్రాక్టర్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

మొబైల్ షూ పాలిషింగ్

గ్రేటర్ హైదరాబాద్‌లో షూ పాలిషింగ్, చెప్పుల కుట్టే 50 మందితో మొబైల్ షూ పాలిషింగ్ యూనిట్లను ఎస్సీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయనుంది. టూ వీలర్‌తోపాటు పాలిషింగ్, రిపేరింగ్ కిట్‌తో నగరంలో ఎక్కడికంటే అక్కడికి వెళ్లి పాలిష్ చేయవచ్చు. ఓపెన్ మార్కెట్‌తో పాటు కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకోవడానికి సంక్షేమ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.



- సరికొత్తగా స్వయం ఉపాధి
- పథకాలు రూపొందిస్తున్న ఎస్సీ సంక్షేమ శాఖ
- త్వరలోనే లబ్ధిదారులకు అందజేసేందుకు సన్నాహాలు

నాటుకోళ్ల పెంపకం

సిద్దిపేట జిల్లాలోని కొన్ని దళిత కుటుంబాలకు ఐదు నుంచి పది గుంటల్లోపు భూమి మాత్రమే ఉంది. వారికున్న భూమిలోనే కుటుంబం మొత్తం జీవనం సాగించేందుకు సంక్షేమ శాఖ నాటుకోళ్ల పెంపకం పథకాన్ని రూపొందించింది. ఒక్కో కుటుంబానికి 50 కోడి పిల్లలు, వాటి పోషణకు అవసరమైన దాణా హేచరీ యూనిట్‌ను అందజేస్తుంది. ఈ మొత్తం స్కీం విలువ రూ.50 వేలు మాత్రమే. నాటుకోళ్లు సహజసిద్ధంగా పెరిగేవే కావడంతో వాటి పోషణకు పెద్దగా కష్టం అవసరం ఉండదు. కోళ్లు, గుడ్లను ఊళ్లోనే అమ్ముకునే సదుపాయం ఉండటంతో డబ్బు కూడా వెంటనే అందుతుంది.



ఒక్కో కుటుంబానికి నెలకు గరిష్టంగా రూ.5 వేల వరకు ఆదాయం సమకూరుతుందని సంక్షేమ శాఖ లెక్కలు వేస్తోంది.

'అగ్రకులాలకు రిజర్వేషన్లు ఎందుకు'

హైదరాబాద్, వెలుగు: న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పదవులు, ఉద్యోగాల్లో 80శాతం అగ్రకులాల వారే ఉన్నారని, వారికి రిజర్వేషన్లు ఎందుకని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన 112 బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్రం జరిపిన సర్వేలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 7శాతం, ఓబీసీలు 14శాతం, అగ్రకులాలు 64శాతం మంది ఉద్యోగాల్లో ఉన్నారని తేలిందన్నారు. దేశంలో 54 శాతం జనాభా ఉన్న బీసీలకు చట్టసభలు, న్యాయ వ్యవస్థ, ప్రైవేట్‌లో రిజర్వేషన్లు కల్పించాలని తాము ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. మహిళా బిల్లుతో పాటు 122 బిల్లులు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కానీ అగ్రకులాలకు 10 శాతం బిల్లు కల్పిస్తూ రెండు రోజుల్లోనే పాస్ చేయించుకున్నారని మండిపడ్డారు.

ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి ప్రభును కోరిన రాష్ట్ర బీజేపీ నేతలు
- ఎఫ్ఆర్ఐకి నిధులివ్వాలని మరో మంత్రి హర్షవర్ధన్‌కు వినతి

హైదరాబాద్, వెలుగు: హైదరాబాద్‌లో ఏవియేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభును రాష్ట్ర బీజేపీ నేతలు కోరారు. శుక్రవారం ఢిల్లీలో ప్రభును కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలోని బృందం ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. బేగంపేట్‌లో ఎయిరిండియా ఏర్పాటు చేసిన సెంట్రల్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీటీఈ) గతేడాది 200 మంది పైలట్లకు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. అయితే సీటీఈలో ఏటీఆర్ సిములేటర్ లేకపోవడంతో ఇక్కడ ట్రైనింగ్ తీసుకున్న పైలట్లు అదనపు శిక్షణ కోసం బ్యాంకాక్, సింగపూర్‌లకు వెళ్లాల్సి వస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటు చేస్తే మరింత మంది శిక్షణపొందే అవకాశం ఉందని విన్నవించారు. ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ)కు నిధులు కేటాయించాలని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి చేశారు. కొన్నేళ్లుగా నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వల్ల సంస్థ సేవలను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు.

చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం

హైదరాబాద్, వెలుగు: వైభవం కోల్పోతున్న చారిత్రక కట్టడాలను గుర్తించి వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదపై సమీక్షించారు. చారిత్రక కట్టడాలపై ఆరా తీసిన ఆయన.. శిథిలావస్థకు చేరుకోక ముందే వాటిని కాపాడుకోవాలని సూచించారు. బోధన్‌లోని దేవల్ మసీదు, నిజామాబాద్‌లోని ఖిలా రామాలయం, డిచ్‌పల్లిలోని రామాలయం, జగిత్యాల కోట, కొలనుపాకలోని జైన దేవాలయాలకు పూర్వ వైభవం తేవాలన్నారు.

పంటలకు సాగునీళ్లు ఇవ్వండి: సీపీఎం

హైదరాబాద్, వెలుగు: ఎండిపోతున్న పంటలకు సాగునీరు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. వర్షాభావంతో వానాకాలం పంటలు దెబ్బతిన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, శ్రీరాంసాగర్, జూరాల కింద యాసంగి కోసం తైబందీ చేశారన్నారు. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో వేసిన పంటలకు ఇవ్వాల్సిన నీటిని మిషన్ భగీరథకు తరలించడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందన్నారు. సాగర్ జలాలపై ఆధారపడ్డ ప్రాంతంలో పంటలకు సత్వరమే నీటి విడుదల చేయాలన్నారు.

చైనా మాంజా అమ్మితే జైలే

హైదరాబాద్, వెలుగు: చైనా మాంజాపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మాంజా అమ్మితే ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా, దాని వల్ల పక్షులకు హాని జరిగితే ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల పెనాల్టీ విధించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కలెక్టర్లకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలు, పక్షులకు హాని జరుగుతుండటంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైనా మాంజాను నిషేధించిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మాంజా రవాణాకు వాహనాలు వాడితే వాటినీ సీజ్ చేస్తామని హెచ్చరించారు.

తెలుగులో బీసీ కమిషన్ల నివేదికలు

గవర్నర్‌కు మొదటి కాపీని అందజేసిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

హైదరాబాద్, వెలుగు: మండల్, హావనూర్, అనంతరామన్ కమిషన్ల రిపోర్టులను 'బీసీ నోట్ బుక్'గా రాష్ట్ర బీసీ కమిషన్ తెలుగులో పబ్లిష్ చేసింది. తొలి కాపీని గవర్నర్ నరసింహన్‌కు అందజేసింది. శుక్రవారం రాజ్ భవన్ లో కమిషన్ సభ్యులు కృష్ణ మోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితా రాజేంద్రతోపాటు చైర్మన్ బీఎస్ రాములు గవర్నర్‌ను కలిశారు. దేశంలోనే తొలిసారి బీసీ కమిషన్ల నివేదికలను ప్రాంతీయ భాషలోకి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గవర్నర్ 'రిజర్వేషన్ల ఆవశ్యకతను ఈ కమిషన్లు గొప్పగా వివరించాయి' అని అన్నారు.

టీఆర్ఎస్ తొత్తుగా ఈసీ: మర్రి

హైదరాబాద్, వెలుగు:

ఎన్నికల సంఘం టీఆర్ఎస్ పార్టీకి తొత్తుగా మారిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు జరిగాయని చెప్పినప్పటికీ దానికి బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అధికార పార్టీకి ఎలక్షన్ అధికారులు అనుకూలంగా పనిచేశారన్నారు. అందుకే కేబినెట్ సమావేశంలో వారికి సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు చెప్పారన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గుణాత్మక మార్పు అంటూ ఇతర పార్టీలను కలుస్తున్న కేసీఆర్ ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేశారో తెలుపుతూ అన్ని పార్టీలకు లేఖలు రాయనున్నట్లు చెప్పారు. 30 లక్షల ఓట్లను ఈసీ తొలగించిందని, దీనికి ఎలక్షన్ అధికారి క్షమాపణలు చెబితే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా టీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.

ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధికి 2018 -19 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ వెల్ఫేర్ కమిషనర్ అనిత రాజేంద్ర తెలిపారు. బీసీ, ఈబీసీ విభాగాల విద్యార్థులు విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు సంక్షేమ శాఖ ఆర్థిక తోడ్పాటునిస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యేడాది జూలై ఒకటి నాటికి 35 ఏళ్లలోపు వయస్సు, కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉన్న వారు దీనికి అర్హులని తెలిపారు. రిజర్వేషన్ కేటగిరీ, మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జెర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియా దేశాల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు www.telanganaepass.cgg.gov.in లో వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులను ఇవ్వాలన్నారు.

ఈ ఓట్లు సరే, మరి ఆ ఓట్లు?

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడ్డ వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయం ఎవరు ఔనన్నా కాదన్నా పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయమేనని ఖచ్చితంగా చెప్పొచ్చు. రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం తెలపడం నుంచి ఉభయ సభల్లో బిల్ పాస్ అవడం వరకు రెండు రోజుల్లో జరిగిపోయింది. ఈ చర్య వల్ల బీజేపీకి రాజకీయంగా లాభముంటుందా, లేదా అన్నదే ఇప్పుడు చర్చనీయాంశం. అగ్రవర్ణాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నప్పటికీ బీజేపీకి సంప్రదాయ ఓటు బ్యాంకు అయిన ఓబీసీలు ఎలా రియాక్టవుతారో అన్న దాన్ని బట్టే మళ్లీ మోడీ ప్రధాని అవుతారా, లేదా అన్నది తేలనుంది.

బీజేపీని ఒకప్పుడు బ్రాహ్మణ్, బనియా పార్టీ అనేవారు. కారణమేమిటంటే, మొదట్లో ఈ రెండు వర్గాలకు చెందినవారే ఎక్కువగా పార్టీలో ఉండేవారు. 90వ దశకంలో మండల్, కమండల్ ఉద్యమాలే ఇండియన్ పాలిటిక్స్‌ని ప్రధానంగా ప్రభావితం చేశాయి. ఓబీసీ రిజర్వేషన్ల కోసం మండల్ ఉద్యమం జరుగుతున్నప్పుడే అద్వానీ అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం రథయాత్ర చేపట్టారు. బాబ్రీ మసీదు విధ్వంసం తదనంతర పరిణామాలలో బీజేపీకి అగ్రవర్ణాలతోపాటు ఉత్తరప్రదేశ్ లాంటి హిందీ బెల్ట్ రాష్ట్రాలలో యాదవేతర ఓబీసీలు పూర్తిగా అండ నిలిచారు. ఈ కాంబినేషన్‌వల్లే 1996 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఉత్తరప్రదేశ్ నుంచే 52 పార్లమెంట్ సీట్లు సాధించి, లోక్‌సభలో అతి పెద్ద రాజకీయ పార్టీగా నిలిచి, ప్రధాన పీఠంపై తొలిసారి వాజ్‌పేయిని కూర్చుండబెట్టింది. ఇక, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మీద వ్యతిరేకతనో, మోడీ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదం ఆకర్షించిందో కానీ ఎస్సీ,ఎస్టీలు కూడా బీజేపీకి ఓటేశారు.

ఇప్పుడు 2019 ఎన్నికల నాటికి ఇప్పటివరకూ బీజేపీకి స్థిరంగా ఉన్న అగ్రవర్ణ ఓటు బ్యాంక్ చెదిరేపోయే పరిస్థితి వచ్చింది. గత నాలుగున్నరేళ్లుగా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విషయం అర్థమవుతూ వచ్చింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో అగ్రవర్ణాలు పూర్తిగా కాంగ్రెస్‌కి ఓటేశాయి. ఈ రాష్ట్రాలలోని రాజ్‌పుట్, జాట్, బ్రాహ్మణ, బనియా ఓట్లు పెద్ద ఎత్తున హస్తం గుర్తుకు పడ్డాయి. అగ్రవర్ణ ఓటు బ్యాంక్‌ని మరలా రాబట్టడంకోసం మోడీ అగ్రవర్ణ రిజర్వేషన్ల కార్డు ఉపయోగించారు. సౌత్ ఇండియాతో పోలిస్తే, బీజేపీ బలంగా ఉండి ఎక్కువ సీట్లు వచ్చే అవకాశమున్న ఉత్తర, పశ్చిమ భారతాల్లో అగ్రవర్ణాల ఓట్లు ఎక్కువే. ఈ రెండు ప్రాంతాల్లోని అన్ని రాష్ట్రాల సగటును తీసుకుంటే 35 శాతం వరకు అగ్రవర్ణాల ఓట్లు ఉంటే, 40 శాతం ఓబీసీల ఓట్లున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్, హర్యానా, ఢిల్లీలాంటి కొన్ని రాష్ట్రాల్లో 50 శాతం కంటే ఎక్కువగా అగ్ర వర్ణాల ఓట్లున్నాయి. మహారాష్ట్ర జనాభాలో 33 శాతం మరాఠాలే కావడం గమనార్హం. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, బీహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, హిమాచల్, ఉత్తరాఖండ్‌లాంటి రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది కోసమే ఎన్డీఏ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను ఇచ్చింది అనుకోవచ్చు.




హర్యానాలో జాట్‌ల ఆందోళన


గుజరాత్‌లో పటేల్ పోరాటం

> జనరల్ ఎలక్షన్స్‌ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న పెద్ద నిర్ణయం 'పెద్ద కులాల పేదలకు 10% రిజర్వేషన్' ఇవ్వడం. బీజేపీకి సంప్రదాయ ఓటు బ్యాంకు అయిన ఓబీసీలు ఎలా రియాక్టవుతారో అన్నది తేలాల్సి ఉంది. గడచిన నాలుగేళ్లలో
> మోడీ–షా టీమ్‌కి దక్కిన విజయాల్లో ఓబీసీల పాత్ర చాలా కీలకమైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి స్థిరంగా ఉన్న పెద్ద కులాల ఓటు బ్యాంక్ చెదిరిపోయే పరిస్థితి వచ్చింది. అగ్రవర్ణ ఓటు బ్యాంక్‌ని మరలా రాబట్టడంకోసం మోడీ అగ్రవర్ణ రిజర్వేషన్ల కార్డు ఉపయోగించారు.


మహారాష్ట్రలో మరాఠా ఉద్యమం

గత నాలుగేళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలలో అగ్రవర్ణాలు రిజర్వేషన్ ఉద్యమాలు చేశారు. గుజరాత్‌లో పటేళ్లు, హర్యానాలో జాట్‌లు, మహారాష్ట్రలో మరాఠాలు రిజర్వేషన్లకోసం ఉద్యమించారు. ఆయా రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ వర్గాలు బీజేపీకి పెద్దగా ఓటేయలేదు. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లతోనే ఈ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని చెప్పొచ్చు.

కాబోయే ప్రధానిని నిర్ణయించేది ఓబీసీలే!

రిజర్వేషన్లు ఇచ్చినందుకు అగ్రవర్ణాలు అనుకూలంగా ఓటేస్తే, జనరల్ కోటా నుంచి 10 శాతం తగ్గినందుకు ఓబీసీలు అదే రేషియోలో వ్యతిరేకంగా ఓటేస్తారా అన్నది ఖచ్చితంగా చెప్పలేం. డీఎంకే, ఆర్జేడీ, ఎంఐఎం తప్ప ఏ రాజకీయ పార్టీ కూడా ఈ కొత్త కోటాకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు సాహసించడం లేదు. రాజకీయ పార్టీలు ఓబీసీలకు అన్యాయం జరుగుతుందని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే ఆయా వర్గాలు మోడీకి కొద్దో గొప్పో వ్యతిరేకంగా ఓటేసే అవకాశం ఉంది. మొత్తానికి మోడీ మళ్లీ ప్రధాని అవుతారో లేదో అనేది ఓబీసీల ఓట్లే నిర్ణయించనున్నాయి.

– సంగనభట్ల భరత్‌కుమార్

మహారాష్ట్రలో మరాఠాయేతర ఓటు


దేవేంద్ర ఫడ్నవీస్


ఇక, మహారాష్ట్రలోకూడా గత అసెంబ్లీ ఎన్నికల్లో మరాఠాలు కాకుండా ఇతర వర్గాల వారు బీజేపీకి దన్నుగా ఉన్నారు. కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన, బీజేపీ 4 పార్టీలూ ఒకరితో ఒకరు పొత్తు లేకుండా గత ఎన్నికల్లో పోటీ చేశాయి. బీజేపీ కాకుండా మిగతా మూడు పార్టీలకు ఎన్నికల్లో మరాఠా సామాజిక వర్గానికి చెందినవారే నేతృత్వం వహించారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే, 2014లో కాంగ్రెస్ సీఎంగా ఉన్న పృథ్వీరాజ్ చవాన్ మరాఠా సామాజిక వర్గానికే చెందినవారే. ఒక్క బీజేపీ మాత్రమే ముఖ్యమంత్రిగా ఎవరిని ప్రొజెక్ట్ చేయకుండా నరేంద్ర మోడీ అంతా తానై వ్యవహరించి ఎన్నికలకు వెళ్లింది. ఎన్నికల ఫలితాలు కమలనాథుల్నే కాక మిగతా పార్టీలనూ ఆశ్చర్యపరిచాయి. అప్పటివరకు శివసేనకి జూనియర్ పార్ట్‌నర్‌గా ఉన్న బీజేపీ ఏకంగా 116 స్థానాలు సాధించి మెజార్టీకి అతి దగ్గరలో ఆగిపోయింది. మరాఠాయేతరులే బీజేపికి ఓటేసి విజయం సాధించిపెట్టారు. బ్రాహ్మణ వర్గానికి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్‌ని సీఎంగా చేయడంతో మరాఠాలు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. ఈ వర్గం రిజర్వేషన్ల కోసం నిరంతర పోరాటం చేయడంతో చివరకి ఫడ్నవీస్ సర్కార్ దిగి రాక తప్పలేదు. 16 శాతం రిజర్వేషన్‌ని మరాఠాలకు ఇచ్చింది. ఈ నిర్ణయం కోర్టులో నిలుస్తుందా అన్న అనుమానం అందరిలోనూ ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్‌ని అన్వయించుకొనే ప్రయత్నం మహారాష్ట్ర ప్రభుత్వం చేయొచ్చు. అయితే, బీజేపీకి ఓటేసిన మరాఠాయేతరులు ఈ 10% రిజర్వేషన్లవల్ల దూరమవుతారేమో అన్న అందోళన ఆ పార్టీ నేతల్ని వెంటాడుతోంది.

యూపీలో యాదవేతర ఓబీసీలే కీలకం


యోగి ఆదిత్యనాథ్


సింగిల్‌గా 73 ఎంపీ సీట్లు సాధించి, పార్లమెంటులో మెజారిటీ సాధించడానికి కారణమైన ఉత్తరప్రదేశ్‌లో ఈ రిజర్వేషన్ల ప్రభావం ఎలా ఉంటుందో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. యూపీలో బీజేపీకి మొదటి నుంచి బ్రాహ్మణులు, బనియాలు, యాదవేతర ఓబీసీలు ఓటు బ్యాంకుగా ఉన్నారు. ముస్లిం, యాదవులు సమాజ్ వాదీ వైపు, దళితులు మాయావతి వైపు సంప్రదాయంగా ఉంటూ వస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్‌ని యూపీ సీఎంగా నియమించడంతో మరో అగ్రవర్ణమైన రాజ్‌పుట్‌లు కూడా బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి వచ్చే అవకాశముంది. అదే సమయంలో రామ మందిర నిర్మాణ ఉద్యమం నుంచి బీజేపికి అండగా ఉంటూ వస్తున్న యాదవేతర ఓబీసీలు 10 శాతం అగ్రవర్ణ రిజర్వేషన్ల ప్రకటన నేపథ్యంలో బీజేపీకి కొద్ది శాతమైనా దూరం జరిగే అవకాశముందని ఆ పార్టీ నేతలే అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ఎస్పీ, బీఎస్పీలు అగ్రవర్ణాల రిజర్వేషన్‌కి వ్యతిరేకంగా వ్యవహరించకుండా తెలివిగా వ్యవహరించాయి. 10 శాతం రిజర్వేషన్లను పూర్తిగా సమర్థిస్తున్నట్లు మాయావతి, అఖిలేష్ ప్రకటించి అగ్రవర్ణాలకు పూర్తిగా దూరం కాకుండా జాగ్రత్త పడ్డారు. రిజర్వేషన్ల ఎఫెక్ట్‌తో ఈసారి బ్రాహ్మణులు, రాజ్‌పుట్‌లు, బనియాలు బీజేపీకి ఓటేయడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, యాదవ్‌లు కాకుండా ఇతర ఓబీసీలు మహాకూటమి వైపు కొద్ది శాతం మళ్లినా బీజేపీకి పెద్ద నష్టాన్నే చేకూరుస్తుంది. ఎస్పీ, బీఎస్పీలు రెండు ఒక కూటమిగా బరిలోకి దిగుతుండడంతో ముస్లిం, యాదవ్, దళిత ఓటు బ్యాంక్ సాలిడ్‌గా కూటమికి ఓటేయడం ఖాయం. ఈ వర్గాలకు గనుక ఓబీసీలు తోడైతే మహా కూటమి బీజేపీని మట్టి కరిపించడం ఖాయం.

హర్యానాలో నాన్–జాట్ ఓటే ఆయుధం


మనోహర్ లాల్ ఖట్టర్

మోడీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డీ పార్టీలు జాట్‌లకే ప్రాధాన్యమివ్వడంతో... తొలిసారి నాన్-జాట్ నినాదంతో బీజేపీ ఆ ఎన్నికలకు వెళ్లింది. తాము అధికారంలోకి వస్తే జాట్ కాకుండా వేరే వ్యక్తిని సీఎం చేస్తామని ఎన్నికల ముందే ఇండికేషన్స్ ఇచ్చింది. 30 శాతం జాట్ జనాభా కలిగిన హర్యానాలో ఇదొక సాహసోపేత చర్యనే. బీజేపీ వ్యూహం అద్భుతంగా ఫలించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాన్-జాట్ నేత మనోహర్ లాల్ ఖట్టర్‌ని సీఎం చేసింది బీజేపీ. దీంతో, ఖట్టర్ ప్రభుత్వాన్ని రిజర్వేషన్ల పోరాటంతో జాట్లు ఇబ్బంది పెడుతూనే ఉన్నారు.

కాంగ్రెస్ వైపు మళ్లిన పటేళ్లు


విజయ్ రూపాని

గుజరాత్‌లో పటేళ్ల ఉద్యమం దేశాన్ని ఊపేసింది. సంప్రదాయంగా బీజేపీ మద్దతుదారులైన పటేళ్లు రిజర్వేషన్ ఇవ్వనందుకు 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు షిఫ్ట్ అయ్యారు. ఆ పార్టీ పటేళ్లకు రిజర్వేషన్ ఇస్తామన్నందుకు హార్దిక్ పాండ్యా నేతృత్వంలో కాంగ్రెస్‌కి మద్దతు పలికారు. అయినాగానీ, నాన్-పటేల్ ఓట్లతో బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చింది. ఓబీసీలతో పాటు గుజరాత్‌లో సంప్రదాయంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉన్న 12 శాతం ఎస్టీలు బీజేపీకి సపోర్ట్ చేశారు. 10 శాతం రిజర్వేషన్లతో పటేల్ సామాజికవర్గం మళ్లీ తమవైపు వస్తుందని బీజేపీ అనుకుంటోంది. పటేల్ సామాజికవర్గం కాకుండా ఇతరుల ఓట్లు మోడీ ప్రభుత్వ తాజా చర్యతో ఎటువైపు వెళ్తాయోమరి.



మరణం నీ చివరి చరణం కాదు...

అగ్గి పుట్టిచ్చినోడు అలిశెట్టి ప్రభాకర్. కలంతో తూటాలు పేల్చినోడు అలిశెట్టి ప్రభాకర్. 1954 జనవరి 12న జగిత్యాలలో జన్మించి...18 ఏండ్లకే కలంతో విప్లవ కవాతు నడిపాడు. పుట్టిన గడ్డ జగిత్యాలలో ఫొటోగ్రాఫర్‌గా పూర్ణిమ స్టూడియో, అటు తరువాత కరీంనగర్‌లో శిల్పి స్టూడియోలు నడిపిస్తూ...ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నాడు. హైదరాబాద్‌లో పెట్టిన చిత్రలేఖ స్టూడియో...సాహితీ మిత్రులకు అదో అడ్డా. ఎర్ర పావురాలు, మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, ఎన్నికల ఎండమావి, సంక్షోభ గీతం, సిటీ లైఫ్...కవిత్వ సంకలనాలు చదివితే... ఇలా కూడా రాయవచ్చా అనిపిస్తుంది. ధనిక, పేదల గురించి చెబుతూ...

'చెక్కు చెదరని
చెక్కు బుక్కులా
నువ్వు...
నలిగిపోయిన
రేషన్ కార్డులా
నేను....

చిన్నచిన్న పదాలతో అందరికీ అర్థమయ్యే భాషలో రాయడం అలిశెట్టి ప్రత్యేకత. పండితుల భాషకు, సంస్కృత సంధులు సమాసాలకు సంబంధంలేని వాడుక భాషలో కవిత్వం రాసి జనకవి అనిపించుకున్నాడు. కష్టజీవి బతుకును కలం సిరాలో నింపి కవిత్వం అల్లినోడు అలిశెట్టి. తాజ్ మహల్‌కి రాళ్లెత్తిన కూలీలు ఎవరోయ్...అని ఓ కవి ప్రశ్నిస్తే...మన అలిశెట్టి మరో అడుగు ముందుకు వేసిండు.

పాలరాయి రక్తం పీల్చేస్తుందనడానికి...
ఒకే ఒక్క చారిత్రక నిదర్శనం తాజ్ మహల్

జన్మనిచ్చిన జగిత్యాలను వదిలి,హైదరాబాద్‌లో బతుకు బండి లాగించాడు. లక్షలమంది జనం. చుట్టూ మనుషులే. కానీ ప్రతీవాడు ఏకాకే. పల్లె నుంచి పట్నం వచ్చిన అలిశెట్టి... ఇదిగో ఇలా ఫీలయ్యాడు.

హైదరాబాదనే
మహావృక్షమ్మీద
ఎవరి వారే ఏకాకి

కష్టాలు ముంచెత్తినా కవిత్వాన్నీ ఏనాడు అమ్ముకోలేదు అలిశెట్టి. బొమ్మలు గీసినా, రచనలు చేసినా...జనం కోసమే అనుకున్నాడు. ఆ రోజుల్లో ఇలాంటి ఎందరో కవులకు, రచయితలకు సినీ పరిశ్రమ బంగారు బాటలు వేసింది. కానీ, అక్షరాన్ని నమ్ముకున్న అలిశెట్టి... దాన్ని అమ్ముకోలేకపోయాడు. అందుకేనేమో మన సినిమాల గురించి ఇంత వాస్తవంగా రాయలిగాడు.

వరుసగా అయిదు తెలుగు సినిమాలు చూస్తే
చస్తే పంచేంద్రియాలు పన్జేయవు

మన న్యాయవ్యవస్థ గొప్పతనం గురించి ఎన్నో పుస్తకాలు వచ్చాయి. కింది కోర్టులో నిర్దోషి అని తేలితే, పై కోర్టులో ఉరిశిక్షలు ఎందుకు పడతాయో అర్థంకాని... ఓ ప్రశ్నకు సమాధానం రాశాడు అలిశెట్టి.

న్యాయాన్ని ఏ కీలు కా కీలు
విరగ్గొట్ట గలవాడే వకీలు

> ఆ రోజుల్లో నిత్యావసర ధరలు మండుతున్నప్పుడు... అలిశెట్టి కవిత్వం నిరసన వంటలు వండింది. అవి చదివితే ఆకలి తీరినంత సంతృప్తి కలుగుతుంది ఇప్పటికి కూడా.
> చెయ్యి కందిపోతుంది
> కందిపప్పు తాకకు...
> దవడ పేలిపోతుంది
> ధరలేవి చెప్పకు...

అలిశెట్టి కవిత్వానికి అందనిదంటూ ఏది లేదు. ఏ సమస్యను, ఏ రంగాన్ని వదలకుంటా కడిగేశాడు. వేశ్యలపై ఆయన రాసిన కవిత్వం ఎందరినో ఆలోచింపజేసింది.

తను శవమై...
ఒకరికి వశమై...
తనువు పుండై....
ఒకడికి పండై...
ఎప్పుడూ ఎడారై...
ఎందరికో ఒయాసిస్సై....

గడియారం పెట్టుకున్నప్రతీవాడూ...పరిగెడుతున్న కాలాన్ని పట్టుకోలేడు అని రాసిన అలిశెట్టి కూడా కాలాన్ని పట్టుకోలేకపోయాడు. టీబీ సోకి ఒంటిని కబళిస్తున్నా లెక్క చేయలేదు. ఆరోగ్యం విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉండేవాడని అలిశెట్టి దగ్గరి దోస్తులు చెబుతుంటారు. కవిత్వాన్ని రాస్తూనే... 1993 జనవరి 12న కన్ను మూశాడు. అక్షర యోధుడు అలిశెట్టి పుట్టిన రోజున, పుట్టిన నెలలోనే చనిపోయాడు. తెలంగాణలో పుట్టినందుకేమో ఆ రోజుల్లో అలిశెట్టికి రావాల్సినంత గుర్తింపు, గౌరవం రాలేదనే చెప్పాలి. కానీ, ఆయన రాసుకున్నట్టే... నీ మరణం చివరి చరణం కాలేదు. కాదు కూడా. జోహార్ అలిశెట్టి ప్రభాకర్.

– రఘు భువనగిరి


ఏమన్నారంటే



మిత్రులను మరువం

మిత్రపక్షాలను మరిచిపోం. పొత్తులకు సానుకూలమే. ప్రాంతీయ పార్టీలకు, ఆకాంక్షలకు అటల్‌జీ ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన చూపిన మార్గంలోనే బీజేపీ వెళ్తోంది.

– నరేంద్ర మోడీ, ప్రధాన మంత్రి



గోడ ఉంటేనే ఎంజాయ్

మెక్సికో–అమెరికాల మధ్య గోడ అవసరమే. జూలో ఎందుకు ఎంజాయ్ చేస్తారో తెలుసా. అక్కడ గోడలు ఉంటాయి. మెక్సికన్లు మనుషులే కాదు.

– జూనియర్ ట్రంప్, ట్రంప్ పెద్ద కొడుకు



ఫ్రంట్ ఫుట్ ఆడదాం

రైతులు, యువత ఎవరికీ భయపడవద్దు. ఆ అవసరం లేదు. పిచ్‌పై ఫ్రంట్‌ఫుట్ వచ్చి ఆడాలి. ప్రధాని మోడీ ఐదేళ్లుగాబ్యాక్‌ఫుట్ (వెనకడుగు) వేసి ఆడుతున్నారు.

– రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు



భాషపై బలవంతం లేదు

కొత్త విద్యా విధానంకోసం కమిటీ నివేదిక అందించింది. ఆ నివేదికలో ఏ భాషపైనా ప్రత్యేక సూచనలు లేవు. ఏ భాషనీ అమలు చేయాలని సూచించలేదు.

– ప్రకాశ్ జవదేకర్, కేంద్ర మంత్రి

నిన్ను నిలబెట్టేదే సరైన చదువు



విజ్ఞానమనేది మానవుడిలో స్వతసిద్ధంగానే ఉంది. ఏ జ్ఞానమూ బయట నుంచి నీలో ప్రవేశించదు. అంతా నీలోనే ఉంది. న్యూటన్ గురుత్వాకర్షణను కనిపెట్టాడని అంటాం. అంతదాకా ఆ గ్రావిటీ థియరీ అతడి కోసం ఏ మూలో దాక్కొని వేచి ఉందా? అది అతడి మనసులోనే ఉంది. తగిన సమయంలో అది బయటపడింది. ఇప్పటివరకూ ఈ ప్రపంచం పొందిన విజ్ఞానమంతా మనస్సు నుంచే వెలువడింది. - స్వామి వివేకానంద

మానవుడిలో సహజంగా ఉన్న శక్తి సామర్థ్యాలను ప్రకటించటమే విద్య. చదువు అంటే ఏమిటి? పుస్తకాలు చదివి సంపాదించే పాండిత్యం చదువు అవుతుందా? కాదు! అనేక కోణాలలో సాధించిన విజ్ఞానం విద్య అవుతుందా? అదీ కాదు. నీ సంకల్పం, దానిని వ్యక్తీకరించడం అనేవి ఏ శిక్షణద్వారా సమగ్రంగా అలవడి ఉపయోగంలోకి వస్తాయో అలాంటి శిక్షణే చదువు అవుతుంది. నా దృష్టిలో మనస్సును ఏకాగ్రపరచడమే విద్య. అంతేగానీ సమాచారాన్ని పోగుచెయ్యటం చదువు అనిపించుకోదు. నేనే గనుక నా విద్యాభ్యాసాన్ని మళ్లీ మొదలెట్టాల్సి వస్తే సమాచారాన్ని పోగు చెయ్యటంపై దృష్టి పెట్టను. దానికి బదులుగా ఏకాగ్రతా శక్తిని, డిటాచ్‌మెంట్‌ని పెంచుకుంటాను. అలా సమగ్రంగా నన్ను నేను మలచుకొంటే, బుద్ధి అనే టూల్‌ద్వారా నా ఇష్టం వచ్చిన రీతిలో సమాచారాన్ని పోగు చేసుకోగలను.

జీవన పోరాటాన్ని ఎదుర్కోవటానికి జన సామాన్యాన్ని సిద్ధం చెయ్యకుండా; క్యారెక్టర్‌ని, హెల్పింగ్ నేచర్‌ని పెంచకుండా, ధైర్య సాహసాలను వెలికి తీయకుండా మనిషిని మరబొమ్మలా మార్చేది విద్య అనిపించుకుంటుందా? విజ్ఞానమనేది మానవుడిలో స్వతసిద్ధంగానే ఉంది. ఏ జ్ఞానమూ బయట నుంచి నీలో ప్రవేశించదు. అంతా నీలోనే ఉంది. న్యూటన్ గురుత్వాకర్షణను కనిపెట్టాడని అంటాం. అంతదాకా ఆ గ్రావిటీ థియరీ అతడి కోసం ఏ మూలో దాక్కొని వేచి ఉందా? అది అతడి మనసులోనే ఉంది. తగిన సమయంలో అది బయటపడింది. ఇప్పటివరకూ ఈ ప్రపంచం పొందిన విజ్ఞానమంతా మనస్సు నుంచే వెలువడింది. యూనివర్స్ అనే అనంతమైన గ్రంథాలయం నీ మనస్సులోనే ఉంది. బాహ్య ప్రపంచం కేవలం సూచన మాత్రమే; నీ మనస్సును అధ్యయనం చేసే అవకాశం మాత్రమే.

> మనిషి తన కాళ్ల మీద తాను నిలబడగలిగేట్లు చేసేదే నిజమైన విద్య. ఊరికే నీ బుర్రలోకి చొప్పించేది విద్య అనిపించుకోదు. నీ జీవితకాలమంతా జీర్ణం కాకుండా నిలిచిపోయిన సమాచారం చదువు అనిపించుకోదు. మనిషిని మనిషిగా తీర్చిదిద్దగలిగి, వ్యక్తిత్వాన్ని పెంచుకోవటమే ప్రధాన లక్ష్యం. నీ జీవితాన్ని, నీ క్యారెక్టర్‌ని తీర్చిదిద్దుకుంటే ఒక లైబ్రరీలోని పుస్తకాలన్నింటినీ కంఠస్థం చేసిన వ్యక్తి కంటే నువ్వు అధిక విద్యావంతుడివి అవుతావు.

ప్రతి వ్యక్తీ ఆజ్ఞాపించడానికే ఇష్టపడతాడు గానీ, ఆ ఆర్డర్‌ని అమలు చేయడానికి ఎవడూ ముందుకు రాడు. విధేయతతో ఆదేశాలను అమలు చేయడం ముందు నేర్చుకో. ఆర్డర్స్ వేసే అధికారం దానంతటదే వస్తుంది. ఎప్పుడూ ఒక సేవకుని మాదిరి ప్రవర్తించటం నేర్చుకో; తర్వాత నాయకుడు కావడానికి అర్హత సాధించగలుగుతావు. ఐరోపాలోని అనేక నగరాలలో ప్రయాణించినప్పుడు అక్కడ పేదవారికి సైతం సమకూరిన సౌకర్యాలను, విద్యావకాశాలను పరిశీలించాను. మన దేశంలోని పేదవారి అవస్థలు గుర్తుకొచ్చాయి. నా కళ్లు కన్నీళ్లతో నిండిపోయాయి. ఈ వ్యత్యాసానికి కారణం ఏమిటి? కేవలం విద్య అని స్ఫురించింది. విద్య, విద్య, విద్య.. ఇదే కావాలి మనకు.

మనకు కావాల్సింది ఈ శ్రద్ధే. దురదృష్టవశాత్తు మన ఇండియా నుంచి ఈ శ్రద్ధ దాదాపు మాయమైపోయింది. మన దుస్థితికి ఇదే కారణం. వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య తేడాని చూపించేది ఈ శ్రద్ధ మాత్రమే! ఒక వ్యక్తిని గుడ్డివాడిగా చేసేదీ, మరొకణ్ణి ఎందుకూ పనికిరానివాడిగా చేసేదీ ఈ శ్రద్ధ మాత్రమే. ఏ విషయాన్నీ పట్టించుకోకపోవటం, ప్రతి విషయాన్నీ చులకన చేయడం అనే రుగ్మతలు మన జాతి రక్తంలోకి చొచ్చుకుపోతున్నాయి. ఈ భయంకర వ్యాధిని నివారించండి. దరి చేరకుండా తరిమికొట్టండి. బలవంతులై, శ్రద్ధాసక్తులతో మెలగండి - మిగతాదంతా దానికదే అనుసరించి వస్తుంది.

మన దేశంలోని అట్టడుగు ప్రజలకు మనం చెయ్యవలసిన సేవ అంతా- వారికి చదువు నేర్పించటమే. వారిలో వ్యక్తిత్వాన్ని పెంపొందించటమే!. వారికి కావలసింది అదే. మీరు ఆ విధంగా చేసినట్లయితే సత్ఫలితాలన్నీ వాటికవే వస్తాయి. పర్వతం గనక ప్రవక్త వద్దకు రాకపోతే ప్రవక్తే పర్వతం వద్దకు పోవలసి ఉంటుంది. పేద పిల్లవాడు చదువు నేర్చుకోవటానికి రాలేకపోతే, అతడి వద్దకే వెళ్లి విద్య నేర్పాలి. మానసిక బలాన్ని పెంపొందించేది, మనిషిని తన కాళ్ల మీద తాను నిలబడేటట్లు తీర్చిదిద్దే విద్యే మనకు అవసరం.

(నేడు స్వామి వివేకానంద జయంతి)

టాకీస్

ప్రభాత వెలుగు 09

శనివారం | హైదరాబాద్

12.01.2019

www.v6velugu.com

Follow: v6velugu



నాకదే స్పెషల్

ఎంత దూరం ప్రయాణించినా మొదట వేసిన అడుగు ఎప్పటికీ ప్రత్యేకంగా గుర్తుండి పోతుంది. తనకీ అంతే అంటోంది సోనాక్షి సిన్హా. 'దబాంగ్' చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది సోనా. అది కూడా సల్మాన్ ఖాన్ కారణంగా. అతడే పట్టుబట్టి, లావుగా ఉన్న ఆమెను సన్నగా మార్చి మరీ తన సినిమాలో హీరోయిన్‌గా చాన్సిచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో సోనాక్షి దశ తిరిగింది. వరుస అవకాశాలతో బిజీ హీరోయిన్ అయి పోయింది. తర్వాత 'దబాంగ్ 2'లో కూడా ఆమెనే తీసుకున్నాడు సల్మాన్. అదీ హిట్. అందుకేనేమో... ఇప్పుడు 'దబాంగ్ 3' కూడా ఆమెతోనే చేస్తున్నాడు. ఈ మూవీతో పాటు కళంక్, మిషన్ మంగళ్ చిత్రాలు కూడా చేస్తోంది సోనాక్షి. అయినా కూడా తనకి 'దబాంగ్' సీక్వెలే స్పెషల్ అని రీసెంట్‌గా ఓ సందర్భంలో చెప్పింది సోనాక్షి. తన మొదటి సినిమా కావడం, పైగా సల్మాన్ హీరో కావడం.. ఈ రెండు కారణాల వల్ల ఎన్ని సినిమాలు చేసినా, ఎన్ని హిట్లు కొట్టినా ఆ సినిమాదే తన కెరీర్లో ఫస్ట్ ప్లేస్ అని తేల్చేసింది.

'రంగస్థలం'తో గత ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న రామ్‌చరణ్... ఈ సంక్రాంతికి 'వినయ విధేయ రామ'తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన బోయపాటి శ్రీను దర్శకుడు. ఖర్చుకు వెనకాడని డీవీవీ దానయ్య నిర్మాత. కాంబినేషన్‌తోనే అంచనాలు పెంచేసుకున్న ఈ సినిమా ఆ అంచనాలను అందుకుందో లేదో చూద్దాం.



విధేయ రామ... యాక్షన్ డ్రామా

కథ

రామ్ (రామ్ చరణ్) అనాథ. అతడిని మరో నలుగురు అనాథలు చేరదీస్తారు. భయస్తులైన ఆ నలుగురికి ధైర్యం అవుతాడు రామ్. వారి జోలికి ఎవరొచ్చినా అంతు చూస్తాడు. నలుగురి పెళ్లిళ్లతో అదో పెద్ద కుటుంబం అవుతుంది. సీత (కియారా)తో రామ్ పెళ్లి కుదురుతుంది. పెద్దన్నయ్య భువన్ కుమార్ సిన్సియర్ ఎలక్షన్ కమిషన్ ఆఫీసర్. మిగతావారు అతనితో పాటే. అన్నల జోలికి ఎవ రొచ్చినా ఆటాడేసుకునే రామ్.. ఓసారి పందెం పరశురా మ్‌ని ఢీకొడతాడు. మరోవైపు బీహార్‌లో ఎన్నికలకు అడ్డు పడిన రాజా భాయ్ మున్నా (వివేక్ ఒబెరాయ్)ను ఎదిరిం చబోయి ఇబ్బందుల్లో పడతాడు భువన్. తన టీమ్‌తో సహా రాజా భాయ్ చెరలో చిక్కుకుంటారు. వారిని రామ్ ఎలా కాపాడాడు, ఆ క్రమంలో ఏం జరిగిందనేది మిగతాకథ.

ఎవరెలా..

యాక్షన్ ఎపిసోడ్స్‌లో మునుపెన్నడూ లేనంత పవర్ ఫుల్‌గా కనిపించాడు చరణ్. సిక్స్ ప్యాక్ లుక్, డైలాగ్ డెలివరీ అభిమానులను అలరిస్తుంది. కియారా పాత్ర పాటల కోసమే అన్నట్టుగా ఉన్నప్పటికీ గ్లామర్‌తో ఆకట్టుకుంది. చరణ్ వంటి మాస్ హీరోకు తగ్గ పవర్ ఫుల్ విలనిజం ప్రదర్శించాడు వివేక్ ఒబెరాయ్. ప్రశాంత్, స్నేహలవి ప్రాధాన్యత కలిగిన పాత్రలే అయినా ఆసక్తికరంగా లేవు. మహిళా సంఘం అధ్యక్షురాలిగా హేమ నవ్వించింది. ఆర్యన్ రాజేశ్, రవి వర్మ, మధు నందన్ మిగతా అన్నలుగా కనిపించారు. పందెం పరశురామ్‌గా ముఖేశ్ రుషి మెప్పించాడు. సినిమాలో చాలా పాత్రలున్నప్పటికీ స్క్రీన్ నిండుగా కనిపించడం కోసమే అన్నట్టుగా ఉన్నాయి. పాటల విషయంలో మెప్పించలేకపోయిన దేవిశ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతంలో తన మార్క్ చూపించాడు. సినిమాటోగ్రఫీ కథకు తగ్గట్టు సాగింది. నిర్మాణ విలువల్లో రాజీ పడలేదు నిర్మాత దానయ్య.

ఎలా ఉందంటే..

అనాథల పసితనంతో కథ ప్రారంభించి సినిమాపై ప్రారంభంలో కొంత ఆసక్తి పెంచాడు బోయపాటి. ఆ తర్వాత వచ్చే ఫ్యామిలీ సీన్స్, చరణ్ పెళ్లిచూపులు వంటి సీన్స్‌తో కథ ఆడుతూ పాడుతూ ముందుకెళ్లింది. ఆ తర్వాత వచ్చే పరశురామ్ వార్నింగ్ సీన్, ఇంటర్వెల్ ముందు వచ్చే ఫైట్ సీన్‌తో ఫస్ట్ హాఫ్‌కు మార్కులు పడ్డాయి. అయితే సెకెండాఫ్‌లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ సీన్స్ దశాబ్దాల క్రితమే చూసేసిన భావన కలుగుతుంది. అజర్ బైజాన్‌లో తీసిన యాక్షన్ సీన్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేసినా కొంత అతి అనిపిస్తుంది. ఇలా కథ చుట్టూ యాక్షన్ సీన్స్ అల్లుకోవడం మాస్ సినిమాలకు మామూలే. కానీ కథపై దృష్టి పెట్టకుండా కేవలం భారీ యాక్షన్ సీన్స్‌తో సినిమాను నడిపించాలంటే కష్టం. ఈ సినిమా విషయంలో అదే జరిగింది. దశాబ్దాల క్రితం నాటి పాత కథను మళ్లీ తీయాలనుకోవడమే ఓ సాహసం. కథ పాతదైనప్పుడు కనీసం కొత్త తరహా ట్విస్టులతో ఎంగేజ్ చేయగలగాలి. కానీ ఈ సినిమా విషయంలో అలా జరగలేదు. బోయపాటి మార్క్ ఫ్యామిలీ సెంటిమెంట్ సీన్స్, లవ్ ట్రాక్ ఉన్నప్పటికీ యాక్షన్ సీన్స్ వాటిని డామినేట్ చేశాయి. హీరో, విలన్ ఎదురుపడేవి రెండే సన్నివేశాలు కావడం, వారిద్దరి మధ్య ఎత్తుకు పైఎత్తుల్లాంటివేమీ లేకపోవడంతో కథనం ఫ్లాట్‌గా ముందుకెళ్తుంది. కథ కంటే ఎక్కువగా దర్శకుడిని చరణ్ నమ్మాడనే విషయం సినిమాలోని ప్రతి సీన్‌లో అర్థమవుతుంది. లాజిక్స్ పట్టించుకోకుండా, కొత్తదనం ఆశించకుండా పక్కా మాస్ సినిమా చూడాలనుకునే వారికి ఈ సినిమా నచ్చుతుంది.

ఫొటో ఫీస్ట్



అయినవారికి ఏదైనా అయితే అల్లాడిపోతాం. తన తండ్రి రాకేశ్‌కి క్యాన్సర్ అని తెలిశాక కూడా అలాగే తల్లడిల్లిపోయాడు హృతిక్ రోషన్. అయితే ఆపరేషన్ సక్సెస్ కావడంతో ఎంతో ఆనందపడుతున్నాడు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యేటప్పుడు తండ్రితో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఇలా ఫొటోకి పోజిచ్చాడు. మేం ఆగేదే లేదు, సాగుతూనే ఉంటాం అని కాన్ఫిడెంట్ గా క్యాప్షన్ కూడా ఇచ్చాడు.

ట్విటర్ టాక్




కెరీర్ ప్రారంభించి పదమూడేళ్లయిన సందర్భంగా రామ్ ఇలా ట్వీట్ చేశాడు. "అప్పుడే పదమూడేళ్లు అయిపోయింది. కానీ నాకింకా ఇప్పుడే మొదలుపెట్టినట్టుంది. నా అభిమానులందరి ప్రేమకి, సపోర్ట్‌కి థ్యాంక్స్. అభిమానం అన్న పదానికి నిర్వచనం మీరు. విజయాలప్పుడే కాదు, పరాజయాలు వచ్చినప్పుడూ మీరు నా వెంటే ఉన్నారు. మీరంతా దొరకడం నిజంగా నా అదృష్టం."

ఆన్ లొకేషన్



సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ బందిపోటుగా నటిస్తోన్న చిత్రం 'సోన్‌చిడియా'. సమాజంలో ఎదురయ్యే పరిస్థితులు కొందరి జీవితాలను ఎలా మార్చేస్తాయన్న కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్ర లొకేషన్లో తీసిన ఫొటో.

ఒన్ మ్యాన్ షో



'ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాని ప్రకటించినప్పటి నుంచీ దేశమంతా ఒకటే రభస. అనుకోకుండా ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ కాంగ్రెస్ అధిష్టానం చేతిలో కీలు బొమ్మ అయ్యారని చెప్పే ఉద్దేశంతో తీసిన చిత్రం కావడంతో కాంగ్రెస్ నేతలు విరుచుకుపడ్డారు. రిలీజ్ ఆపమన్నారు. వాటన్నిటినీ లెక్కచేయకుండా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. మన్మోహన్ కి మీడియా అడ్వైజర్‌గా పని చేసిన సంజయ్ బారు రాసిన పుస్తకం ఆధారంగా అదే పేరుతో తీసిన ఈ సినిమాలో మన్మోహన్ గా అనుపమ్ ఖేర్ నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. లుక్స్, బాడీ లాంగ్వేజ్, వాయిస్ అన్నిటినీ దించేసిన ఆయన... పర్ఫార్మెన్స్‌తోనూ అదరగొట్టారు. సంజయ్ బారుగా అక్షయ్ ఖన్నా కూడా అద్భుతంగా నటించినా... అనుపమ్ రాక్ చేసి ఒన్ మ్యాన్ షో అనిపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధిష్టానం తన మీద తెస్తోన్న ఒత్తిడిని తట్టుకోలేక తల్లడిల్లే సీన్లలో ఆయన నటన అద్భుతం. ఈ సినిమా ఒక కుట్ర అంటున్నవారి సంగతెలా ఉన్నా ప్రేక్షకులు మాత్రం ఒకటే అంటున్నారు... అనుపమ్‌జీ... హ్యాట్సాఫ్!



ఇన్నాళ్లకు లక్కీ రాయ్ ?

ఎంత ప్రయత్నించినా అదృష్టం కలిసిరాదు కొందరికి. లక్ష్మీరాయ్‌కి కూడా అంతే. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో నటించినా సరైన సక్సెస్‌ను అందుకోలేకపోయింది. కానీ ఈ యేడు కచ్చితంగా హిట్టు కొడతానంటోంది. కొన్నాళ్ల క్రితం వరకూ అరకొర ఆఫర్లతో ఉన్న లక్ష్మి ఇప్పుడు లక్ కలిసొచ్చిందంటూ సంతోషపడుతోంది. నీయా, సిండ్రెల్లా, ఝాన్సీ, వేరీజ్ వెంకటలక్ష్మి చిత్రాల్లో నటిస్తోందామె. సోషియో ఫాంటసీ, యాక్షన్, కామెడీ ఎంటర్ టైనర్, హారర్... నాలుగూ నాలుగు రకాల చిత్రాలు. వీటిలో కనీసం ఒకట్రెండు విజయం సాధించినా చాలు... లక్ష్మీరాయ్ ఇప్పటికైనా లక్కీ రాయ్ అవుతుంది.



డేట్ ఫిక్సయింది

కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తోన్న స్టైలిష్ యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ '118'. లవ్, యాక్షన్, సస్పెన్స్ అన్నీ మిళితమైన డిఫరెంట్ కథాంశంతో కె.వి.గుహన్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 1న విడుదల చేయనున్నట్లు నిర్మాత మహేశ్ కోనేరు తెలిపారు. ఇది కళ్యాణ్ రామ్ ఇంతవరకూ చేయని ఒక డిఫరెంట్ జానర్ అని, అద్భుతమైన యాక్షన్ పార్ట్ ఉంటుందని, కళ్యాణ్ రామ్ లుక్‌తో పాటు సినిమా కూడా అందరినీ ఆకట్టుకుంటుందని చెబుతున్నారాయన. నివేదా థామస్, షాలినీ పాండే హీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీత దర్శకుడు.

గప్‌చుప్



బయోపిక్స్ హవా పెరిగాక ఏఎన్నార్ బయోపిక్ తీయమని కొందరు నాగార్జునని అడిగారు. కానీ ఏమాత్రం కాంట్రవర్సీలు, ఎత్తుపల్లాలు లేని ఆయన జీవితాన్ని సినిమాగా తీసినా రుచించదని చెప్పేశారు నాగ్. అయితే ఎన్టీయార్ బయోపిక్ చూశాక ఆ ఆలోచన మారిందని టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏఎన్నార్ పాత్రలో సుమంత్ అద్భుతంగా నటించడం చూశాక నాగార్జునతో పాటు చాలామందికి ఏఎన్నార్ జీవితాన్ని సినిమాగా తీయాలన్న ఆలోచన వచ్చిందట. కొందరు ఆ దిశగా పావులు కదుపుతున్నారని సమాచారం.

కమెడియన్‌తో స్టెప్స్

'చినుకు చినుకు అందెలతో' అంటూ బాబూమోహన్ తో కలిసి స్టెప్పులేసింది సౌందర్య. అదే పాటకు అలీతోనూ ఆడిపాడింది. కమెడియన్లతో హీరోయిన్లు డ్యాన్స్ చేయడం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు మరో హీరోయిన్ కూడా అలా చేస్తోంది. 'అఖిల్' చిత్రంతో తెలుగువారికి పరిచయమైన సాయేషా సెహగల్ తర్వాత తెలుగులో నటించలేదు కానీ తమిళంలో చాన్సులు సంపాదిస్తోంది. కమెడియన్ యోగిబాబు హీరోగా నటిస్తోన్న ఒక చిత్రంలో అతనితో కలిసి ఒక పాటలో డ్యాన్స్ చేయబోతోందట కూడా. కాశి, కొకొ కోకిల వంటి డబ్బింగ్ చిత్రాల ద్వారా యోగిబాబు తెలుగు వారికీ సుపరిచితుడే. అతడు హీరోగా మారి ధర్మప్రభు, జాంబీ, గూర్ఖా వంటి కొన్ని మూవీస్ చేస్తున్నాడు. ఇటీవలే 'వాచ్‌మేన్' అనే సినిమా కూడా స్టార్ట్ చేశాడు. అందులోనే సాయేషా సాంగ్ ఉండనుందట. ఇదిలా ఉంటే ఆమె త్వరలో హీరో ఆర్యను పెళ్లి చేసుకోనుందనే వార్త కూడా కోలీవుడ్లో వినిపిస్తోంది. అది నిజమో కాదో ఆమే చెప్పాలి.





అట్రాక్టివ్ టైటిల్‌తో...

హిట్ పాటల్లోని లైన్లనే సినిమా టైటిళ్లుగా పెట్టే ట్రెండ్ కొన్నాళ్లుగా నడుస్తోంది. ఆ కోవలోనే వస్తోన్న మరో చిత్రం 'రావే నా చెలియా'. నెమలి అనిల్, సుభాంగీ పంథ్ హీరో హీరోయిన్లు. ఎన్.మహేశ్వరరెడ్డి దర్శకుడు. సూర్యచంద్ర ప్రొడక్షన్లో శ్రవణ్, అనిల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర లోగోను శుక్రవారం రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "చిన్న సినిమాలు విజయం సాధిస్తున్నాయి. ఈ సినిమా కూడా సక్సెస్ అవుతుందని ఆశిస్తున్నాను. టైటిలే చాలా అట్రాక్టివ్‌గా ఉంది. కంటెంట్ కూడా బాగుంటుందని నమ్ముతున్నాను" అన్నారు. మంచి కంటెంట్ ఉన్న చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నందుకు సంతోషంగా ఉందని, చిన్న సినిమా అయినా అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉందని అన్నాడు హీరో అనిల్. దర్శకుడు మాట్లాడుతూ... "నిర్మాతలు, హీరో నన్ను నమ్మి సపోర్ట్ చేశారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయను. ఇది ఒక డిఫరెంట్ లవ్ స్టోరీ. తప్పకుండా నచ్చుతుంది" అన్నారు. శ్రవణ్, ఎం.ఎం.కుమార్, కృష్ణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.443	రూ.5.05
వరంగల్	రూ.445	రూ.5.05

మార్కెట్

సెన్సెక్స్ ↓ 96 — 36,191.87

నిఫ్టీ ↓ 26 — 10,794.95

ఓపెనింగ్ లాభాలు ఆవిరి..

చివరికి నష్టాలతో ముగిసిన మార్కెట్

ముంబై: ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడటంతో, దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు నష్టాలతో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 96 పాయింట్లు కిందకి పడిపోయి 36,009.84 వద్ద క్లోజైంది. 36,191.87 వద్ద సెన్సెక్స్ లాభాలతో ప్రారంభమైనప్పటికీ, ఆ లాభాలను ఎంతో సేపు నిలుపుకోలేకపోయింది. ఆద్యంతం ఒడిదుడుకులు పాలైంది. ఒకానొక దశలో సెన్సెక్స్ 200 పాయింట్ల మేర కూడా నష్టపోయింది. నిఫ్టీ కూడా 26.65 పాయింట్ల నష్టంతో 10,794.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, టీసీఎస్, యస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీసీ, ఓఎన్‌జీసీ, వేదాంత లిమిటెడ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు లాభాలతో క్లోజయ్యాయి. గ్లోబల్‌గా ఈక్విటీలు పెరిగినప్పటికీ దేశీయంగా మార్కెట్ నష్టాలు పాలుకావడం గమనార్హం. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 21 పైసలు బలహీనపడి 70.55 వద్ద ట్రేడైంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 1.10 శాతం పెరిగి బ్యారల్‌కు 62.36 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

చిన్న కంపెనీలలో పనిచేసే చిన్న ఉద్యోగులకు అప్పు పుట్టడమంటే ఆకాశాన్నందుకోవడమంత కష్టమే. ఇంకా అందులో తక్కువ జీతాలు, సిబిల్ స్కోర్ అంతంతమాత్రమే అయితే బ్యాంక్ లోన్ అందని ద్రాక్షే అవుతుంది. అందుకే ఇలాంటి చిన్న జీతాల వారికి కూడా లోన్ ఇవ్వడానికి 'వివిఫై' ఫిన్ టెక్ సంస్థ ముందుకువచ్చింది. సాలరీ ఫ్లెక్స్ పేరిట రూ.8 వేల నెల జీతం ఉన్నవారికి కూడా లోన్ ఇచ్చే విధంగా తమ సేవలను అందిస్తోంది.

చిన్న జీతాలవారికీ లోన్లు

హైదరాబాద్, వెలుగు

తక్కువ జీతం ఉన్నవారికి బ్యాంక్ లోన్ అందించే విధంగా వివిఫై ఫిన్ టెక్ సంస్థ తమ సేవలను అందిస్తోంది. బ్యాంకులో లోన్ రావాలంటే పెద్ద కంపెనీలో ఉద్యోగం, ఎక్కువ జీతం, మంచి క్రెడిట్ స్కోర్ వంటివి ఉంటేనే లోన్ మంజూరు అయ్యేందుకు అవకాశాలు ఉంటాయి. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా లోన్ రావడం అంత ఈజీ కాదు. బ్యాంకులు ఇవన్నీ ఉన్న ప్రైమ్ కస్టమర్ల వైపే ఎక్కువ మొగ్గు చూపుతాయి. మూడేళ్లలోపు ఉద్యోగం, చిన్న కంపెనీలో ఉద్యోగం, తక్కువ సిబిల్ స్కోర్, రూ.30 వేల లోపు జీతం వంటివి ఉంటే లోన్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. కానీ ఫ్లెక్స్ సాలరీ ద్వారా తక్కువ సంపాదించేవారికి కూడా అవసరానికి డబ్బు అందే విధంగా తక్షణ లోన్ సదుపాయం తో పాటు సాలరీ అడ్వాన్స్ వంటి సేవలను వివిఫై ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అనిల్ పినపాల అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఒకే రోజులో లోన్ మంజూరు

లోన్ కావాలనుకునే వారు బ్యాంకుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంట్లో కూర్చునే 'ఫ్లెక్స్ సాలరీ ' యాప్ ద్వారా లేదా, బ్రౌజర్ ద్వారా అప్లికేషన్ డౌన్ లోడ్ చేసుకుని తమ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉద్యోగం, బ్యాంకు ఖాతా, పాన్ నంబర్ వంటి వివరాలను ఎంటర్ చేయడం ద్వారా మన లోన్ అర్హత ను అంచనా వేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఆధారితంగా బ్యాంకు లావాదేవీలతో పాటు ఇతర వివరాలను సేకరించి 4 వేల డేటా పాయింట్ల ద్వారా 10 నిమిషాల్లో లోన్ అర్హతను తెలియజేస్తారు. పూర్తి వివరాలతో కస్టమర్ల ప్రొఫైల్



క్రియేట్ చేసి, అనలైజ్ చేసిన తరువాత లోన్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నా, ఇతర వివరాల ఆధారితంగా లోన్ ప్రక్రియ జరుగుతుంది. లోన్ మంజూరు అయితే అదే రోజున మన అకౌంట్ లోకి డబ్బులు చేరుతాయి. కనీసం రూ.4 వేల నుండి గరిష్టంగా రూ.2 లక్షల వరకు లోన్ తీసుకునే అవకాశం ఉంటుంది. మొదటి సారి ప్రాసెసింగ్ ఫీ కింద రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత ఎన్ని సార్లు లోన్ తీసుకున్నా ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు ఉండదు. కేవలం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

ఎక్కువ స్కోర్ ఉంటే తక్కువ వడ్డీ

నెలాఖరులో లోన్లు తీసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని వివిఫై ఫౌండర్ అనిల్ పినపాల తెలిపారు. ఇప్పుడంతా క్రెడిట్ కార్డు యుగం నడుస్తోందని, నెలాఖరులో బిల్స్ చెల్లింపుల తో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక అవసరాలను నెరవేర్చేందుకు ఇది బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఇది కూడా క్రెడిట్ కార్డు లాంటిదేనని, కాకపోతే తాము డబ్బు రూపంలో ఇస్తున్నామన్నారు. అమెజాన్ కార్డు రూపంలో కూడా లోన్ మంజూరు చేస్తామని చెప్పారు. రూ.10 వేలకి రోజుకు రూ.10 వడ్డీ ఉంటుందని, క్రెడిట్ స్కోర్ ఎక్కువగా ఉంటే వడ్డీ రేటు తగ్గుతుందని అన్నారు. స్కోరు మీదే వడ్డీ రేటు ఆధారపడి ఉంటుందన్నారు. ఒక సారి లోన్ క్యాన్సిల్ అయితే నిరుత్సాహపడక్కర్లేదని, 90 రోజుల తరువాత మళ్లీ అప్లై చేసుకోవచ్చని చెప్పారు.

వేలల్లో అప్లికేషన్లు

వివిఫై స్టార్టప్ 2017 సెప్టెంబర్ లో ప్రారంభమవగా, యేడాది లోనే భారీగా వృద్ధి చెందింది. ప్రారంభించిన నెలలో 500 లోన్ అప్లికేషన్లు రాగా, ప్రస్తుతం నెలకు 25 వేల అప్లికేషన్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు 20 వేల లోన్లు మంజూరు చేసింది కంపెనీ. వచ్చే యేడాది కల్లా లోన్ల మంజూరు 8 నుండి 10 రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఉన్న లోన్ల మంజూరు సంఖ్య వచ్చే యేడాది కల్లా 2 లక్షలకు చేరాలనేది కంపెనీ టార్గెట్. రూ.20 వేల నుండి రూ.30 వేల మధ్యలో లోన్లు తీసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రస్తుతం టెక్నాలజీ, డేటా అనలిస్టుల వంటి 40 మంది ఉద్యోగులతో వివిఫై విజయవంతంగా కస్టమర్ల అవసరాలను తీర్చడంలో ముందుంటోంది.

vivifi

వారికే ఎక్కువ అవసరం

"అత్యవసర పరిస్థితులు, తాత్కాలిక అవసరాలు వచ్చినప్పుడు ఫ్లెక్స్ సాలరీ మంచి ఆప్షన్. కాల్ సెంటర్లు, ఇండస్ట్రియల్ ఉద్యోగులకు ఈ సేవలు ఎక్కువగా ఉపయోగపడతాయి. తాత్కాలిక అవసరాల నుండి సులువుగా గట్టెక్కవచ్చు. తమ నుండి ఒకసారి లోన్ తీసుకున్నవారు మళ్లీ తమ అవసరాలకు ఫ్లెక్స్ సాలరీ నే ఆశ్రయిస్తున్నారు. నెలాఖరులో తీసుకుని మళ్లీ జీతం రాగానే చెల్లిస్తున్నారు. మరింత మందికి తమ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కంపెనీ విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– అనిల్ పినపాల, ఫౌండర్, వివిఫై ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్.





మళ్లీ షేర్ల బైబ్యాక్‌కు ఇన్ఫోసిస్ ఓకే

- క్యూ3 లాభం 30 శాతం డౌన్
- నికరలాభం రూ.3,610 కోట్లు
- మొత్తం ఆదాయం రూ.21,400 కోట్లు

ముంబై: మనదేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ మూడో క్వార్టర్‌లో అంచనాలను అందుకోలేకపోయింది. గత డిసెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం 29.6 శాతం తగ్గిపోయి రూ.3,610 కోట్లకు దిగజారింది. 2017లో ఇదే క్వార్టర్‌లో రూ.5,129 కోట్ల లాభం వచ్చింది. ఈసారి రూ.4,141 కోట్ల లాభం వస్తుందన్న విశ్లేషకుల అంచనాలు తప్పాయి. మొత్తం ఆదాయం మాత్రం గత ఏడాదితో పోలిస్తే రూ.17,791 కోట్ల నుంచి పెరిగి రూ.21,400 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం 10.5 శాతం తగ్గి రూ.4,379 కోట్లు చేరింది. ఆపరేటింగ్ మార్జిన్ 110 బేసిస్ పాయింట్లు తగ్గి 22.6 శాతానికి క్షీణించింది. వృద్ధి అంచనాలను 8.5 శాతం నుంచి తొమ్మిది శాతానికి పెంచింది. ఫలితాలపై కంపెనీ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ డిజిటల్ వ్యాపారం 33.1 శాతం పెరిగిందని, 2019లో ఆదాయం మరింత పెరుగుతుందన్న నమ్మకం కలిగిందని అన్నారు. షేరుకు రూ.800 చొప్పున రూ.8,260 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేయడానికి ఇన్ఫోసిస్ బోర్డు అంగీకరించింది. ఒక్కో షేరుకు నాలుగు రూపాయలు స్పెషల్ డివిడెండ్‌ను ఈ నెల 28న చెల్లిస్తారు. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు ధర రూ.465 పెరిగి రూ.683లకు చేరుకుంది. మార్కెట్ ముగిసిన తరువాతే కంపెనీ ఫలితాలను వెల్లడించింది. క్రిస్‌మస్, కొత్త సంవత్సరం వేడుకల కారణంగా అమెరికా, యూరప్ కంపెనీలోని ఉద్యోగులకు సెలవులు ఎక్కువ ఉంటున్నందున క్యూ3లో ఆదాయాలు తగ్గాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. టీసీఎస్ కూడా ఈసారి అంచనాలను తప్పిన విషయం తెలిసిందే.

లివ్ ఫాస్ట్ బ్యాటరీలు వచ్చాయి

హైదరాబాద్, వెలుగు: సార్ గ్రూప్ కు చెందిన లివ్ ఫాస్ట్, తమ ఇన్వర్టర్ బ్యాటరీలను తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే యుపి, పంజాబ్, హర్యానాలలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురాగా, ఇప్పుడు దక్షిణ భారతదేశం పై ఎక్కువగా దృష్టి సారించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇన్వర్టర్ ను సరికొత్తగా డిజైన్ చేయడంతో పాటు ఏఐ టెక్నాలజీతో 25% త్వరిత చార్జింగ్, అదనపు బ్యాకప్ వంటి సదుపాయాలతో ఈ సరికొత్త ఇన్వర్టర్ బ్యాటరీల ను రూపొందించినట్లు లివ్ ఫాస్ట్ సీఈవో గుర్ ప్రీత్ సింగ్ భాటియా తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలలోనే 5 వేల యూనిట్ల అమ్మకాలు జరపడం తమ లక్ష్యమని అన్నారు. ఇన్వర్టర్ బ్యాటరీల్లో 18 మోడల్స్ ఉన్నాయని, వీటికి 4-6 సంవత్సరాల వారంటీ అందిస్తున్నట్లు చెప్పారు. ఇన్వర్టర్ బ్యాటరీ మార్కెట్లో తెలంగాణ, ఏపీల వాటా రూ.750 కోట్లు



ఉంటుందని తెలిపారు. 22 డిస్ట్రిబ్యూటర్లు, 3 వేల డీలర్ల తో తెలుగు రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ఇండియాలో 50 శాతం అనార్గనైజ్డ్ బ్యాటరీ మార్కెట్ కాగా, మొత్తం బ్యాటరీల మార్కెట్ రూ.25 వేల కోట్లని, దీన్లో రూ.15 వేల కోట్ల మేర ఇన్వర్టర్ బ్యాటరీల మార్కెట్ ఉంటుందన్నారు. గతేడాది మార్చి నాటికి కంపెనీ రూ.వెయ్యి కోట్ల టర్నోవర్ సాధించగా, 2019 మార్చి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తామని గుర్ ప్రీత్ సింగ్ చెప్పారు.



హైదరాబాద్‌లో ముక్తా థియేటర్

హైదరాబాద్, వెలుగు: దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించడంలో భాగంగా 'ముక్తా ఏ2 సినిమాస్' హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో శుక్రవారం సింగిల్ స్క్రీన్ థియేటర్‌ను ప్రారంభించింది. 487 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌కు డాల్బీ సరౌండ్ సౌండ్ సిస్టమ్, డిజిటల్ పిక్చర్ క్వాలిటీ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. హైదరాబాద్‌లో తమ కంపెనీకి ఇది మొదటి థియేటర్ అని, టికెట్ల ధరలు చౌకగానే ఉంటాయని ముక్తా ఏ2 సినిమాస్ ఎండీ రాహుల్ పురి అన్నారు. హైదరాబాద్‌తోపాటు ముంబై, అహ్మదాబాద్, బరోడా, వైజాగ్, భోపాల్, ఔరంగాబాద్ వంటి 17 నగరాల్లో ఈ కంపెనీ 51 స్క్రీన్లు ఉన్నాయి.



ఎయిరేషియా ఢిల్లీ -హైదరాబాద్ కొత్త సర్వీస్

ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం

జనవరి 10 నుంచి బుకింగ్స్

న్యూఢిల్లీ : విమానయాన రంగంలోని ఎయిర్ ఏషియా ఢిల్లీ–హైదరాబాద్ మధ్య కొత్త సర్వీసును ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించనుంది. న్యూఢిల్లీలో ఉదయం 6.05 కి, సాయంత్రం 5.50 కి బయలుదేరుతాయి. ఇక హైదరాబాద్ నుంచి తిరిగి ఉదయం 8.45 కి, రాత్రి 8.25 కి న్యూఢిల్లీకి బయలుదేరుతాయని ఎయిర్ ఏషియా తెలిపింది. న్యూఢిల్లీ నుంచి శ్రీనగర్, పుణెలకు కూడా కొత్తగా సర్వీస్‌లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. గత ఏడాది డిసెంబర్‌లోనే చెన్నై-హైదరాబాద్ సర్వీస్‌ను ఎయిర్ ఏషియా ప్రారంభించింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగానే ఈ కొత్త సర్వీస్‌లు ప్రవేశపెడుతున్నట్లు ఎయిర్ ఏషియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ భాస్కరన్ చెప్పారు. ఈ కొత్త సర్వీస్‌లకు జనవరి 10 నుంచి బుకింగ్స్ ప్రారంభమైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం 20 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉన్నాయని, 19 డెస్టినేషన్స్‌కు సర్వీస్‌లు నడుపుతున్నామని పేర్కొన్నారు.

త్వరలో జోలో నుంచి 5 స్మార్ట్‌ఫోన్లు



న్యూఢిల్లీ:

లావా సబ్‌బ్రాండ్ జోలో సుదీర్ఘకాలం విరామం తరువాత ఇటీవల 'ఎరా 4ఎక్స్' , ' ఎరా 5ఎక్స్' పేర్లతో రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. రాబోయే నెలల్లో ఐదు స్మార్ట్‌ఫోన్లు విడుదల చేస్తామని తెలిపింది. ఇవన్నీ ఎంట్రీ లెవెల్, మిడ్ బడ్జెట్ సెగ్మెంట్ ఫోన్లని జోలో అధ్యక్షుడు, బిజినెస్ హెడ్ సునీల్ రైనా చెప్పారు. ఏయే నెలల్లో వీటిని విడుదల చేస్తామనే వివరాలు మాత్రం తెలియజేయకున్నా, వీటిని అమెజాన్‌లో మాత్రమే అమ్ముతామని వెల్లడించారు. ఈ నెల ఆఖరు కల్లా ఒక నాచ్ డిస్‌ప్లే ఫోన్ వస్తుందని మాత్రం పేర్కొన్నారు. ఎరా 5ఎక్స్ ఫోన్‌కు మార్చినాటికి అండ్రాయిడ్ 'పై' ఓఎస్ అప్‌డేట్ వస్తుందని చెప్పారు. ఇందులో 5.7 ఇంచుల డిస్‌ప్లే, హీలియో ఏ22 ప్రాసెసర్, 3 జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ వంటి ఫీచర్లు ఉన్నాయి.

పన్ను & బీమా

జీఎస్టీ కట్టే చిన్న వ్యాపారులకు ఇచ్చే ప్రతిపాదన

జీఎస్టీ చెల్లించే చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామమాత్రపు ప్రీమియంతో బీమా సదుపాయం కల్పించడంతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీకి రుణాలు అందించే ప్రతిపాదనలను మోదీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. వ్యాపారాలను కంప్యూటీకరించుకునే వ్యాపారులకు రాయితీ రుణాలు ఇచ్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది

న్యూఢిల్లీ:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వ్యాపారులను ఆకర్షించే పథకాలకు కేంద్ర ప్రభుత్వం మెరుగులు దిద్దుతోంది. జీఎస్టీలో నమోదు చేసుకున్న చిన్న, మధ్యతరహా వ్యాపారులకు బీమా సదుపాయం కల్పించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) తరహాలోనే, వీరికి కూడా తక్కువ ప్రీమియంతో లక్షల రూపాయల విలువైన బీమా కల్పించే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. టర్నోవర్‌ను బట్టి చిన్న వ్యాపారులకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా ఇవ్వవచ్చని పేర్కొన్నాయి. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇది వరకే వ్యాపారులకు బీమా పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ ప్రతిపాదన అమలుకు ప్రభుత్వం అంగీకరిస్తే వచ్చే నెల బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే లాంఛనంగా ప్రకటన చేస్తారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పీఎంఎస్‌బీవైలో లబ్ధిదారుడు ఏడాదికి రూ.12 చెల్లిస్తే రూ.రెండు లక్షల విలువైన యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ఇస్తున్నారు. 18-70 ఏళ్ల వయసున్న సేవింగ్స్ బ్యాంకు ఖాతా ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఏటా బీమా



ప్రీమియాన్ని బ్యాంకులు వారి ఖాతాల నుంచి మినహాయించుకుంటాయి. బీమా పథకంతోపాటు వ్యాపారాలను కంప్యూటీకరించుకునే వ్యాపారులకు రాయితీ రుణాలు ఇచ్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించే అవకాశాలు ఉన్నాయని మరో అధికారి తెలిపారు. ఇది అమల్లోకి వస్తే వడ్డీలో రాయితీ ఇస్తారని చెప్పారు. చిన్న వ్యాపారులకు 59 నిమిషాల్లో లోన్ ఇస్తామని మోదీ ప్రభుత్వం గత ఏడాది ప్రకటించింది. కార్మిక, కంపెనీ చట్టాలనూ సవరించింది. పర్యావరణ అనుమతుల్లో సడలింపు ఇచ్చింది. రాబోయే మరికొన్ని నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్న సంగతి తెలిసిందే.

హోటళ్లు, రెస్టారెంట్లపై

ఓయో, స్విగ్గీ పంజా

కోర్టులో తేల్చుకునే ప్రయత్నాల్లో ఇరుపక్షాలు

హైదరాబాద్, వెలుగు

హోటళ్లకు, ఓటిఏ(ఆన్ లైన్ ట్రావెల్ అగ్రిగేటర్స్) కు మధ్య వివాదం నానాటికి మరింత తీవ్రమవుతోంది. ఓటిఏ లు ఎక్కువ కమీషన్లు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తూ హోటల్స్ బుకింగ్స్ ను తిరస్కరించడంతో పాటు లీగల్ గా కూడా వెళ్తామని హోటల్ అసోసియేషన్లు తెలిపాయి. అలా బుకింగ్స్ తిరస్కరిస్తే లీగల్ గా చర్యలు తీసుకుంటామని ఓయో మరోవైపు హోటళ్లను హెచ్చరించింది. ఇన్ని రోజులు ఓటిఏ లు కమీషన్ తగ్గించుకోవాలనే డిమాండ్లపైన వాటి స్పందన కోసం ఎదురుచూస్తున్న హోటళ్లకు ఇది ఎదురుదెబ్బే. అయినప్పటికీ లీగల్ గా ఓయో ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధమని హైదరాబాద్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి తెలిపారు. తమ వద్ద ఒప్పందానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు లేవని, ఆన్ లైన్ ద్వారా డాక్యుమెంట్ల పై అంగీకారం తీసుకుని ఇప్పుడు తిరిగి బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎక్కువ కమీషన్లు వసూలు చేయడం, అదనపు చార్జీలు వేయడం తో పాటు పలు సమస్యలపై అసోసియేషన్ తరుపున ప్రశ్నిస్తే, అసోసియేషన్ తో మీటింగ్ కు ఒప్పుకోకుండా ఒక్కొక్కరితో సెటిల్ మెంట్ చేసుకుని విభజించు పాలించు రీతిన ఓయో ప్రవర్తిస్తోందని అన్నారు.

అదే దారిలో స్విగ్గీ

ఓటిఏ లతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లకు ఓఎఫ్ఏ (ఆన్ లైన్ ఫుడ్ అగ్రిగేటర్స్) తో ఇబ్బందులు ఎదుర్కుంటున్నట్లు రెస్టారెంట్లు వాపోతున్నాయి. స్విగ్గీ, జొమాటో, ఉబర్ ఈట్స్, ఫుడ్ పాండా వంటివి సిటీలోని దాదాపు అన్ని రెస్టారెంట్లతో ఒప్పందం కుదుర్చుకుని ఆనక ఇష్టా రాజ్యంగా ప్రవర్తిస్తున్నాయని రెస్టారెంట్లు ఆరోపిస్తున్నాయి. మొదట 5 శాతం కమీషన్ తో బిజినెస్ ఒప్పందం ప్రారంభించగా, ఇప్పుడు గరిష్టంగా 25 శాతం దాకా కమీషన్ వసూలు చేస్తున్నాయని దీనికి జీఎస్‌టీ అదనమని హైదరాబాద్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి అన్నారు. దీంతో పాటుగా యాప్ లోని రెస్టారెంట్ల లిస్ట్ లో ముందు కన్పించడానికి అడ్వర్టైజింగ్ చార్జీల తో పాటు కేవలం స్విగ్గీతో మాత్రమే ఒప్పందం కుదుర్చుకునేలా ఎక్స్క్లూజివిటి పేరిట మరిన్ని చార్జీలు బాదుతున్నారని చెప్పారు.

SWIGGY

OYO

ఇన్ హౌజ్ కిచెన్‌తో పెద్ద దెబ్బ

సిటీలో రిజిస్టర్ అయిన రెస్టారెంట్లు 6 వేల దాకా ఉండగా, దీన్లో 4500 నుండి 5 వేల దాకా రెస్టారెంట్లు స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఫుడ్ అగ్రిగేటర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉబర్ ఈట్స్, ఫుడ్ పాండా బిజినెస్ కాస్త తక్కువే అయినప్పటికీ హైదరాబాద్ లో స్విగ్గీ నెలకు రూ.120 కోట్ల దాకా బిజినెస్ చేస్తుందని అంచనా. స్విగ్గీ కొత్తగా ఇన్ హౌజ్ కిచెన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో స్విగ్గీ కిచెన్ సెటప్ ఏర్పాటు చేసిస్తే రెస్టారెంట్లు తమ సేవలను అందించాల్సి ఉంటుంది. ఇక్కడ తయారయ్యే ఫుడ్ కేవలం స్విగ్గీ ఆర్డర్లకే ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి స్విగ్గీకి కొంత మేర చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా రెస్టారెంట్లకు పెద్ద దెబ్బే. ఇలాంటప్పుడు ఇక రెస్టారెంట్లకు వచ్చి ఎవరూ తినడానికి ఆసక్తి చూపరని, తద్వారా భారీగా బిజినెస్ నష్టపోతున్నామని వాపోతున్నారు.



అశోక్‌రెడ్డి

ఆఫర్లతో ఆకర్షిస్తున్నాయి

ఆన్ లైన్ ఫుడ్ అగ్రిగేటర్లు ప్రత్యేక డిస్కౌంట్లు, ఆఫర్లు ఇచ్చి కస్టమర్లను రెస్టారెంట్లకు రాకుండా చేస్తున్నాయని రెస్టారెంట్ల నిర్వాహకులు వాపోతున్నారు. ఫ్రీ డెలివరీ, స్పెషల్ డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు వంటివి ఇస్తుండడంతో పక్కనే ఉండి కూడా రెస్టారెంట్లకు రాకుండా ఇంటి వద్దకే ఫుడ్ తెప్పించుకోవడానికి ఆసక్తి పెరుగుతోందని, దీంతో తమ వ్యాపారం నష్టపోతోందని చెబుతున్నారు. కమీషన్ల పై ఆన్ లైన్ ఫుడ్ అగ్రిగేటర్లతో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు రెస్టారెంట్ల యూనియన్లు తెలిపాయి.

పెట్రో ధరలు పెరుగుడు మొదలు

న్యూఢిల్లీ: పెట్రో ధరలు మరోసారి పెరిగాయి. లీటరు పెట్రోల్ ధర 19 పైసలు, లీటరు డీజిల్ ధరను 28 పైసల చొప్పున పెంచినట్టు ఆయిల్ కంపెనీలు శుక్రవారం ప్రకటించాయి. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.69.07లకు, డీజిల్ ధర రూ.62.82కి చేరింది. ముంబైలో పెట్రోల్ ధర రూ.74.72 కాగా, డీజిల్ ధర రూ.65.73 ఉంది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.71.71లకు, డీజిల్ దర రూ.66.35లకు, హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.73.31లకు, డీజిల్ ధర రూ.68.32లకు చేరింది. ఆయిల్ కంపెనీలు ధరలను పెంచడం ఈ నెల ఇది మూడోసారి. ఈ నెల ఏడో తేదీన కూడా పెట్రోల్ 21 పైసలు, డీజిల్ ఎనిమిది పైసలు పెరిగింది. 8,9 తేదీల్లో కూడా ధరలను పెంచారు. ఈ నెలలో ఇప్పటి వరకు పెట్రోల్ ధర 78 పైసలు, డీజిల్ ధర 55 పైసలు పెరిగింది. అయితే గత ఏడాది అక్టోబరు నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు పెట్రోల్ ధర రూ.14.54, డీజిల్ ధర రూ.13.53 ధర తగ్గింది.



వన్డే వార్

నేడు ఆసీస్‌తో టీమిండియా తొలిపోరు

ఇదే టీమ్.. అదే టార్గెట్ అంటూ... వరల్డ్ కప్ కోసం ప్రిపరేషన్స్ మొదలెట్టిన టీమిండియా ఇక ఆస్ట్రేలియాతో వన్డే వార్‌కు రెడీ అయింది. టెస్టుల్లో ఓటమికి బదులు తీర్చుకోవాలని కంగారూలు రెడీ అవుతుంటే.. వన్డేలు ఓ లెక్కే కాదు కాస్కోండంటూ కోహ్లీ అండ్ కో సవాల్ విసురుతోంది



- ఆత్మవిశ్వాసంతో కోహ్లీసేన
- ఆపసోపాలతోఆస్ట్రేలియా
- ఉదయం 7.50 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సిడ్నీ: పొట్టి సిరీస్‌ను 'డ్రా' చేసుకొని... టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా... ఆసీస్ గడ్డపై మరోరసవత్తర పోరుకు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం సిడ్నీలో జరిగే తొలి వన్డేలో గెలుపే లక్ష్యంగా కోహ్లీ సేన బరిలో దిగనుంది. ఇప్పటికే టెస్టు సిరీస్ కోల్పోయి నిరాశలో ఉన్న కంగారూలు... ఇటు బ్యాటింగ్ అటు బౌలింగ్‌లో పటిష్ఠంగా కనిపిస్తున్న కోహ్లీ సేనకు ఏ మాత్రం పోటీనిస్తారో చూడాలి. ప్రధాన పేసర్ బుమ్రాతో పాటు, లోకేశ్ రాహుల్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు దూరమైనా... తగిన ప్రత్యామ్నాయాలతో ఇండియా బలంగానే ఉంది. టెస్టు జట్టులో లేని ఆటగాళ్లతో ఆసీస్ కూడా కొత్తగా కనిపిస్తోంది. వరల్డ్‌కప్‌నకు ముందు కేవలం 13 వన్డేలు మాత్రమే ఆడనున్న కోహ్లీ సేన ఈ సిరీస్‌ను మెగాటోర్నీకి సన్నాహకంగా భావిస్తోంది. 2016లో ఇక్కడ జరిగిన వన్డే సిరీస్‌ను ధోనీ సారథ్యంలోని టీమిండియా 1-4తో కోల్పోయింది. టాపార్డర్ రాణించినా... మిడిలార్డర్ చేతులెత్తేయడంతో ఓటమి తప్పలేదు. ఓవరాల్‌గా ఆసీస్ గడ్డపై 48 వన్డేలు ఆడిన ఇండియా 35 మ్యాచ్‌ల్లో ఓడింది.

మిడిల్ కీలకం...

టాపార్డర్ రాణిస్తుండటంతో ఇటీవల టీమిండియా ఇంటా బయటా విజయాలు సాధిస్తోంది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధవన్ కీలక ఇన్నింగ్స్‌లతో జట్టు భారీ స్కోరుకు బాటలు వేస్తున్నారు. ఆపై వన్‌డౌన్‌లో కెప్టెన్ విరాట్ అదరగొట్టే ప్రదర్శనతో జట్టుకు మూల స్తంభంలా నిలుస్తున్నాడు. ఇక కావాల్సిందల్లా మిడిలార్డర్ మెరుపులే. గతేడాది ఆసియా కప్, విండీస్ సిరీస్‌లో భారీ స్కోర్లు చేసి నాలుగో స్థానానికి తగిన వాడిగా గుర్తింపు తెచ్చుకున్న తెలుగు తేజం అంబటి తిరుపతి రాయుడు ఆస్ట్రేలియాలో కూడా సత్తా చాటితే జట్టుకు తిరుగుండదు. రాయుడు గత 11 వన్డేల్లో 56 సగటుతో 392 పరుగులు చేశాడు. అందులో ఓ సెంచరీ, మూడు అర్ధసెంచరీలు ఉన్నాయి. ఎటొచ్చి దిగులంతా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గురించే. మహీ గత 20 వన్డేల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. 2018లో 20 వన్డేలు ఆడిన ధోనీ 25 సగటు, 71.42 స్ట్రయిక్‌రేట్‌తో 275 పరుగులే చేశాడు. మహీ బ్యాట్ నుంచి మెరుపు ఇన్నింగ్స్ రాక చాలా కాలమైంది. అతను బ్యాట్‌తో సత్తాచాటితే ఆసీస్‌కు కష్టాలు తప్పవు.

బుమ్రా లేకున్నా...

ప్రధాన పేసర్ బుమ్రా లేకున్నా భువనేశ్వర్ కుమార్ ఆ లోటును భర్తీ చేయగలడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతనితో పాటు మహమ్మద్ షమీ, ఖలీల్ అహ్మద్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు దూరమైన నేపథ్యంలో కేదార్ జాదవ్, రవీంద్ర జడేజాపై అదనపు భారం పడనుంది. అటు బ్యాట్‌తోనూ ఇటు బంతితోనూ ఆకట్టుకోవాల్సి ఉంటుంది. రెండేళ్లలో టీమిండియా ప్రధాన స్పిన్నర్‌గా ఎదిగిన చైనామెన్ కుల్దీప్ కంగారూల గడ్డపై ఏం చేస్తాడో చూడాలి. పిచ్ పచ్చికతో ఉండటంతో కోహ్లీ... ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్ల వ్యూహానికే మొగ్గుచూపే అవకాశం ఉంది.

'కంగారు'గా...

మరోవైపు ఆసీస్ పరిస్థితి విచిత్రంగా ఉంది. టెస్టు సిరీస్‌లో అదరగొడతాడనుకున్న ఉస్మాన్ ఖవాజా విఫలమైనప్పటికీ... అతన్ని వన్డే జట్టుకు ఎంపిక చేసింది. ఎప్పుడో ఎనిమిదేళ్ల క్రితం చివరి వన్డే ఆడిన పేసర్ పీటర్ సిడిల్‌ను తిరిగి టీమ్‌లోకి తీసుకుంది. ప్రధాన పేసర్లు మిచెల్ స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్‌కు విశ్రాంతినిచ్చిన ఆసీస్ కోరి కష్టాలు కొనితెచ్చుకున్నట్లైంది. కెప్టెన్ ఫించ్‌తో కలిసి వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అలెక్స్ కారీ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. ఆ తర్వాత ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టోయినిస్, మ్యాక్స్‌వెల్ బ్యాటింగ్‌కు వస్తారు. పొట్టి ఫార్మాట్‌లో మెరుపులు మెరిపించే స్టోయినిస్, మ్యాక్స్‌వెల్ వన్డేల్లో ఏం చేస్తారో చూడాలి. సిడిల్‌తో కలిసి అరంగేట్ర ఆటగాడు బెరెన్‌డార్ఫ్ పేస్ బాధ్యతలు మోయనున్నాడు. ఇక జట్టులో ఉన్న ఏకైక స్పిన్నర్ లైయన్... కోహ్లీ సేనను ఇబ్బంది పెట్టగలడు. గతేడాది 'బాల్ ట్యాంపరింగ్' ఉదంతంతో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్ జట్టుకు దూరమైన అనంతరం ఆసీస్ ఇంతవరకు ఏ ఫార్మాట్‌లోనూ ఒక్క సిరీస్ కూడా గెలవలేదు. గత 24 మ్యాచ్‌ల్లో కేవలం మూడింట మాత్రమే నెగ్గింది.



పిచ్, వాతావరణం

సిడ్నీలో జరిగిన చివరి టెస్టుకు వరుణుడు అడ్డుపడ్డా... నేటి మ్యాచ్‌కు వర్షం ముప్పులేదు. మంచి ఎండకాసే సూచనలున్నాయి. గత వారం నుంచి భారీ వర్షాల కారణంగా ఎస్‌సీజీ పిచ్ ఫ్లాట్‌గా మారింది. భారీ స్కోర్ నమోదయ్యే చాన్సుంది.

జట్లు అంచనా

ఇండియా: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, రాయుడు, ధోనీ (వికెట్ కీపర్), జాదవ్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, ఖలీల్, షమీ.

ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), అలెక్స్ కారీ (వికెట్ కీపర్), ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, లైయన్ , సిడిల్, రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్.

విరాట్ కోహ్లీ, రవిశాస్త్రికు ఎస్‌సీజీ మెంబర్‌షిప్

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, చీఫ్ కోచ్ రవిశాస్త్రిలకు అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక సిడ్నీ క్రికెట్ గ్రౌండ్(ఎస్‌సీజీ) కోహ్లీ,శాస్త్రిలకు గౌరవ జీవితకాల సభ్యత్వం ఇచ్చింది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇండియా జట్టుకు ఎస్‌సీజీ అభినందనలు తెలిపింది. సభ్యత్వానికి సంబంధించిన అవార్డులను ఎస్‌సీజీ అధికారులు శుక్రవారం ప్రదానం చేశారు. ప్రపంచంలోని గొప్ప క్రికెట్ మైదానాల్లో ఎస్‌సీజీ ఒకటి. ఇందులో ఇప్పటి వరకు దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, బ్రియాన్ లారా(వెస్టిండీస్)లు మాత్రమే ఎస్‌సీజీ గౌరవ సభ్యత్వం పొందారు.

13–2
ఎస్‌సీజీలో ఇరు జట్లు 16 వన్డేలు ఆడితే... 13 మ్యాచ్‌ల్లో ఆసీస్... 2 మ్యాచుల్లో ఇండియా గెలిచాయి. ఇరుజట్ల మధ్య చివరిసారిగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఇండియా నెగ్గింది.

65
5 వేల రన్స్ క్లబ్‌లో చేరడానికి ధవన్‌కు అవసరమైన పరుగులు

01
మరో వికెట్ తీస్తే భువనేశ్వర్ వన్డేలో 100 వికెట్లు తీసిన ఘనత సాధిస్తాడు.

రిటైరయ్యాక నో క్రికెట్

సిడ్నీ: క్రికెట్ నుంచి రిటైరయ్యాక బ్యాట్ ముట్టుకోనని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. సిడ్నీ వన్డే కోసం మీడియాతో మాట్లాడిన కోహ్లీ రిటైర్మెంట్ ప్రస్తావన తెచ్చాడు. క్రికెట్‌కి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఏబీ డివిలియర్స్, మెక్‌కలమ్ ప్రైవేట్ లీగ్స్‌లో కెరీర్‌ని కొనసాగిస్తున్నారని, తాను మాత్రం బ్యాట్‌పట్టుకోనని, మళ్లీ క్రికెట్ ఆడనని విరాట్ క్లారిటీ ఇచ్చాడు. 'రిటైర్మెంట్ తర్వాత ప్రైవేట్ లీగ్స్‌లో ఆడటం ద్వారా భవిష్యత్ మారిపోతుందని నేను అనుకోవట్లేదు. ఇప్పటికే నేను చాలా క్రికెట్ ఆడేశాను. ఇంకా ఆడే అవకాశముంది. అందుకే రిటైర్మెంట్ తర్వాత మళ్లీ ఆడాలనే ఆలోచన లేదు. ఒక్కసారి ఆటకి వీడ్కోలు పలికితే ఇక మళ్లీ బ్యాట్ ముట్టుకోను' అని విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు.



వరల్డ్ టూర్‌లో భాగంగా శుక్రవారం సిడ్నీ చేరిన ప్రపంచకప్‌తో కోహ్లీ, ఫించ్



ధనుష్.. శభాష్

- ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సత్తా చాటిన తెలంగాణ చిన్నోడు
- 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్

పుణె : ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాష్ట్రానికి చెందిన యువ షూటర్ ధనుష్ శ్రీకాంత్ అదరగొట్టాడు.పుణెలో జరుగుతున్న ఈ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం పురుషుల అండర్-21, పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్‌లో 248.9 స్కోరు చేసిన ధనుష్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో జూనియర్ వరల్డ్‌కప్‌లో రెండు సార్లు కాంస్య పతకం గెలిచిన అర్జున్ బబుతా(పంజాబ్)కు షాకిచ్చాడు. రోజంతా నిలకడగా రాణించిన ధనుష్, క్వాలిఫయింగ్ రౌండ్‌లో 629.9 స్కోరు సాధించాడు. వ్యక్తిగతంగా ధనుష్ కి ఇది టాప్ స్కోర్. ఈ ఫైనల్‌లో ధనుష్ తర్వాతి స్థానంలో నిలిచిన యోగేశ్(247.6) సిల్వర్ మెడల్ గెలుపొందగా, అర్జున్(225.6) కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ అకాడమీలో శిక్షణ పొందిన 16 ఏళ్ల ధనుష్, రెండేళ్ల క్రితమే రైఫిల్ షూటింగ్‌లోకి వచ్చాడు. అంతకముందు తైక్వాండోడాన్ 2ను సాధించాడు. రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన ధనుష్‌కు చిన్నప్పటీ నుంచి వినికిడి సమస్య ఉంది. ధనుష్‌కు ఏడాది వయస్సు ఉన్నప్పుడే వినికిడి యంత్రాన్ని అమర్చామని అతని తల్లి ఆశా శ్రీకాంత్ చెప్పారు. అయితే ధనుష్ చిన్నప్పటీ నుంచి ఎంతో యాక్టివ్‌గా ఉండేవాడని, అతనికి స్పెషల్ స్కూల్ అవసరం రాలేదని ఆశ చెప్పారు. కాగా, ధనుష్ సాధించిన విజయం పట్ల తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ సంతోషం వ్యక్తం చేసింది.



టైటిల్ ఫైట్‌కు బెంగళూరు

- సెమీస్‌లో 4-2తో అవధ్‌పై విజయం

బెంగళూరు: స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ జోరు కొనసాగించడంతో బెంగళూరు రాప్టర్స్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో రాప్టర్స్ 4-2తో అవధ్ వారియర్స్‌పై గెలిచి నాలుగో సీజన్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. కీలక 'టై'లో తొలి మ్యాచ్‌ను అవధ్ ట్రంప్‌గా ఎంచుకోగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-క్రిస్టియన్‌సెన్ (వారియర్స్) జోడీ 15-7, 15-10తో మార్కస్ ఎలిస్-లౌరెన్ స్మిత్ (రాప్టర్స్) జంటపై నెగ్గి 2-0తో జట్టుకు ఆధిక్యం అందించారు. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ (రాప్టర్స్) 15-9, 15-4తో లీ డాంగ్ కున్ (వారియర్స్)పై గెలవగా, శ్రీకాంత్ (రాప్టర్స్) 15-7, 15-10తో సన్ వాన్ హో (వారియర్స్)ను చిత్తు చేశాడు. దీంతో స్కోరు 2-2తో సమమైంది. ఆ తర్వాత రాప్టర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల డబుల్స్‌లో అహ్‌సాన్-సెతీవాన్ జంట 15-14, 15-9తో యాంగ్ లీ-క్రిస్టియన్‌సెన్ (అవధ్) పై నెగ్గడంతో 4-2తో రాప్టర్స్ విజయం ఖాయమవడంతో మహిళల సింగిల్స్ మ్యాచ్ జరగలేదు. శనివారం జరిగే రెండో సెమీఫైనల్‌లో గెలిచిన జట్టుతో ఆదివారం జరిగే ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్ టైటిల్ కోసం పోటీపడుతుంది.

పీబీఎల్‌లో నేడు
ముంబై X హైదరాబాద్ రా. 7 నుంచి



శ్రీకాంత్

మెయిన్ డ్రాకు ప్రజ్ఞేష్


మెల్‌బోర్న్: ఇండియన్ టెన్నిస్ ప్లేయర్ ప్రజ్ఞేష్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడబోతున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ కోసం జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో అద్భుతంగా ఆడిన ప్రజ్ఞేష్ మెయిన్ డ్రాకు క్వాలిఫై అయ్యాడు. మూడో క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్‌లో ప్రజ్ఞేష్ 6-7 (5-7), 6-4, 6-4, స్కోరుతో వాటనుకి (జపాన్)ను ఓడించాడు. ఐదేళ్లలో గ్రాండ్‌స్లామ్ టోర్నీకి ఇండియా నుంచి అర్హత సాధించిన మూడో ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. గతంలో సోమ్‌దేవ్ బర్మన్, యుకీ బాంబ్రి మాత్రమే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడారు. 2018లో యుకీ బాంబ్రి నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల్లో ఆడగా, 2013లో సోమ్‌దేవ్ బర్మన్ యూఎస్ ఓపెన్‌లో ఆడాడు.

టీ20లోనూ లంక ఓటమి

ఆక్లాండ్: టెస్టు, వన్డేల్లో ఓటమి పాలైన శ్రీలంక న్యూజిలాండ్‌తో జరిగిన ఏకైక టీ20 లోనూ చిత్తయిపోయింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 35రన్స్ తేడాతో గెలిచింది. ఈ పరాజయంతో కివీస్ పర్యటనలో ఒక్క మ్యాచ్‌లోనూ గెలవకుండానే శ్రీలంక స్వదేశానికి తిరుగు పయనమైంది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 179 రన్స్ చేసింది. జట్టులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రాస్‌వెల్ 26 బాల్స్ 5 సిక్సులు, ఒక ఫోర్‌తో 44 రన్స్‌చేయగా, లోయర్ ఆర్డర్‌లో కుగ్లెజిన్ 23 బాల్స్‌లో 4 సిక్సులు ఒక ఫోర్‌తో 35 రన్స్ చేశాడు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన లంక 16.5 ఓవర్లో 144 రన్స్‌కు ఆలౌట్ అయింది.

ఆండీ ముర్రే గుడ్‌బై !

ఆస్ట్రేలియన్ ఓపెనే ఆఖరు కావచ్చు : బ్రిటన్ స్టార్



మెల్‌బోర్న్ : బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే తన రిటైర్మెంట్‌పై శుక్రవారం కీలక ప్రకటన చేశాడు. ఈ ఏడాదితో కెరీర్‌కు ముగింపు పలుకుతున్నానని చెప్పిన ముర్రే, ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ తన కెరీర్‌లోనే ఆఖరి టోర్నీ కావచ్చని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్ కోసం ప్రస్తుతం మెల్‌బోర్న్‌లో ఉన్న ముర్రే ఈ ఏడాది జరిగే వింబుల్డన్ వరకు ఆటలో కొనసాగాలని భావిస్తున్నానని, అయితే తన ఆశ నెరవేరేలా లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. మాజీ వరల్డ్ నెంబర్ వన్, మూడు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత అయిన ముర్రే నడుము భాగంలో గాయం కారణంగా గతేడాది ఆస్ట్రేలియా ఓపెన్ మధ్యలోనే తప్పుకున్నాడు. సర్జరీ తర్వాత గత జూన్‌లో లండన్ క్వీన్స్ క్లబ్‌లో మళ్లీ కోర్ట్‌లో అడుగుపెట్టాడు. ఆ తర్వాత సీజన్ ముగిసే నాటికి కేవలం నాలుగు టోర్నీల్లో ఆడిన ముర్రే, సెప్టెంబర్ తర్వాత ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి సారించాడు. అయితే గతవారం బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ బరిలో దిగిన ముర్రే రెండో రౌండ్‌లోనే ఇంటి దారి పట్టాడు.



వేటు

- స్వదేశానికి పాండ్యా,రాహుల్
- విచారణకు కమిటీ
- 15 రోజుల్లోగా నివేదిక

ముంబై: టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న వీళ్లిద్దరూ తిరిగి ఇండియాకు రానున్నారు. ఇద్దరిపైనా విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. ఇండియాకు వచ్చాక ఈ ఇద్దరూ విచారణను ఎదుర్కోనున్నారు. మొదట ఈ ఇద్దరిపై రెండు వన్డేల నిషేధం విధించాలని భావించినా.. చివరికి విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. ఇప్పటికే ఈ ఇద్దరినీ ఆస్ట్రేలియాతో జరిగే తొలి వన్డే నుంచి తొలగించిన విషయం తెలిసిందే. పాండ్యా, రాహుల్‌లను విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తున్నామని సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్ వెల్లడించారు.

కాఫీ విత్ కరణ్ షోలో మహిళలపై నోరు పారేసుకున్నందకు ఈ ఇద్దరిపై బోర్డు కఠిన చర్యలు తీసుకుంది. తనకు పలువురు మహిళలతో సంబంధాలు ఉన్నాయని, ఈ విషయాన్ని తన పేరెంట్స్‌తోనూ చెప్పానని ఆ షోలో పాండ్యా చెప్పాడు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇప్పటికే అతడు క్షమాపణ చెప్పినా.. అతని వివరణతో సీఓఏ సంతృప్తి చెందలేదు.

అదే కరెక్ట్

తదుపరి చర్యలు తీసుకునే వరకు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లను సస్పెండ్ చేయడమే మంచిదని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) సభ్యురాలు డయానా ఎడుల్జీ స్పష్టం చేశారు. కాఫీ విత్ కరణ్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఈ ఇద్దరిపై రెండు వన్డేల నిషేధం విధించాలని సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్ ప్రతిపాదించారు. అయితే ఈ అంశాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు డయానా ఎడుల్జీ పంపించారు. లీగల్ సెల్ నుంచి కూడా సస్పెన్షన్‌కు గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆమె తన నిర్ణయాన్ని వెలువరించారు.

టీమిండియాకు సంబంధం లేదు.

మరోవైపు పాండ్యా, రాహుల్ కాఫీ విత్ కరణ్ షోలో చేసిన కామెంట్స్‌పై కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పందించాడు. ఆ ఇద్దరూ చేసిన వ్యాఖ్యలు సరికాదని అభిప్రాయపడ్డాడు. అయితే ఈ వివాదం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ నైతికతను దెబ్బతీయదని స్పష్టం చేశాడు. ఇండియన్ క్రికెట్ టీమ్ తరపున చూస్తే ఎవరైనా ఇలాంటి కామెంట్స్ చేయడం తప్పే. టీమ్‌గా ఇలాంటి వాటికి మా మద్దతు ఎప్పుడూ ఉండదు. ఆ ఇద్దరు ప్లేయర్స్‌కు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశాం అని కోహ్లీ తెలిపాడు. 'వాళ్ల కామెంట్స్ వ్యక్తిగతం. టీమ్‌తో సంబంధం లేదు. తాము చేసిన తప్పేంటో, దాని తీవ్రత ఎంతో వాళ్లకు అర్థమైంది' అని కోహ్లీ అన్నాడు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని, ఇలాంటివి మన నియంత్రణలో ఉండవని అతను చెప్పుకొచ్చాడు.



కార్లకు రారాజుల ఎస్కార్ట్

అడవికి రారాజు సింహం. కానీ, ఇక్కడ మాత్రం ఆ రాజులే వాహనాలకు ఎస్కార్ట్‌గా మారాయి. నాలుగు సింహాలు రోడ్డుమీద దర్జాగా నడుచుకుంటూ వెళుతుంటే.. వాటి వెనకే కార్లు మెల్లగా...మెల్లగా అనుసరించాయి. వాటికి ఎదురొచ్చే కార్లలోని వాళ్లూరుకుంటారా.. ఫొటోలు, వీడియోలు తీశారు. ఆ తర్వాత ట్విట్టరింట్ల పోస్ట్ చేసి వైరల్ చేశారు. జస్ట్ చిన్నపాటి ట్రాఫిక్ జాం అంటూ మాటలు పేల్చారు. కొంతమందైతే ఆ ట్రాఫిక్ జాంలో తాము ఇరుక్కుంటే బాగుండు అంటూ నిట్టూర్చారు. అందమైన జంతువులు అని ఓ ట్విట్టర్ యూజర్ అంటే.. వాటికి నువ్వు ఆహారంగా మారనంత వరకు అందమైనవే అంటూ మరో యూజర్ కవ్వింపు రిప్లై ఇచ్చాడు. దక్షిణాఫ్రికాలోని క్రూగర్ నేషనల్ పార్క్‌లో జరిగిన ఈ అందమైన 'లయన్ వాక్' అందరినీ కట్టిపడేసింది.



దిక్కూమొక్కూ లేకుండా అయిపోయాయ్

దార్లన్నీ మూసుకుపోయాయి.. ఎటెళ్లాలో తెలియదు.. ఎలా వెళ్లాలో తెలియదు.. ఆకలి దంచేస్తోంది.. రోడ్లపై దిక్కుమొక్కూ లేకుండా తిరుగుతున్న సీల్స్ జంతువుల గోడును పట్టించుకునేటోళ్లే లేరు.. పైగా కారు టైర్ల కింద కొన్ని నలిగి చనిపోయాయి.. ఇదీ, కెనడాలోని న్యూఫౌండ్‌ల్యాండ్‌లోగల రాడిక్టన్‌లో సీల్స్ పరిస్థితి. పెద్ద అలల వల్ల అవి తీరానికి కొట్టుకొచ్చాయని భావిస్తున్నారు. అయితే, చలి ఎక్కువగా ఉండడం వల్ల నీళ్లు గడ్డకట్టిపోవడం, మంచు భారీగా కురవడం వల్ల అవి వెనక్కు వెళ్లే దార్లన్నీ మూసుకుపోయాయని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఆహారం దొరక్క అల్లాడిపోతున్నాయని జనం ఆవేదన చెందుతున్నారు.

ఆయుష్షు పెంచే తిండి తింటలేరు

ఫైబర్ ఫుడ్‌ను జనం పట్టించుకోవడం లేదట

మిమ్మల్ని ఎక్కువకాలం బతికించే 'సూపర్‌ఫుడ్'ను మీరు తీసుకుంటున్నారా? ఇది హార్ట్ ఎటాక్, దీర్ఘకాలిక జబ్బుల(షుగర్ తదితరాలు)ను దూరంగా ఉంచుతుంది. మీ బరువు, బీపీ, కొలెస్ట్రాల్ లెవల్స్‌ను అదుపులో ఉంచుతుంది. మన చుట్టు పక్కల సూపర్ మార్కెట్స్‌లో విరివిగా దొరుకుతుంది. అదే ఫైబర్(పీచు పదార్థం). ఎంత మొత్తంలో ఫైబర్ తీసుకుంటే జబ్బులు మనదరి చేరవనే దానిపై పెద్ద రీసెర్చ్ జరుగుతోంది. సాధారణంగా ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుందని అందరూ భావిస్తుంటారు. కానీ అంతకంటే ఎక్కువ ప్రయోజనాలు పీచు పదార్థాల వల్ల ఉన్నాయని న్యూజిలాండ్‌లోని ఒటాగో, డండీ యూనివర్సిటీల సైంటిస్టులు చెబుతున్నారు. ప్రతి వ్యక్తీ రోజూ పాతిక గ్రాముల పీచు పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆరోగ్యం మెరుగవ్వాలంటే కనీసం 30 గ్రాముల ఫైబర్‌ను డైలీ డైట్‌లో ఉండేలా చూసుకోవాలని సైంటిస్టులు అంటున్నారు. ప్రపంచంలో చాలామంది రోజూ 20 గ్రాముల కంటే తక్కువ ఫైబర్ తీసుకుంటున్నారట. సగటున మహిళలు 17 గ్రాములు, పురుషులు 21 గ్రాముల ఫైబర్‌ను మాత్రమే తింటున్నారట. వీళ్లలో ఎక్కువ మంది అరటిపండులో బాగా ఫైబర్ ఉంటుందని భ్రమ పడుతున్నారని సైంటిస్టులు పేర్కొన్నారు. 120 గ్రాములు బరువుండే అరటి పళ్లలో కేవలం మూడు గ్రాముల ఫైబర్ మాత్రమే ఉంటుందని వెల్లడించారు.

వీటిలో ఫైబర్ ఎక్కువ..

పండ్లు, కాయగూరలు, సెరల్స్, రొట్టెలు, పాస్తా, గోధుమలు, జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు, అరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు, పప్పు దినుసులు, బీన్స్, నట్స్, సీడ్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుందని సైంటిస్టులు తెలిపారు. 185 పరిశోధనలు, 58 క్లినికల్ ట్రయల్స్ తర్వాత ఈ విషయం చెబుతున్నామన్నారు. తక్కువ పీచు పదార్థం(15 గ్రాముల కంటే తక్కువ) తీసుకునే 1000 మందిని, ఎక్కువ పీచు పదార్థం(25 నుంచి 29 గ్రాములు) తీసుకునేలా చేసినట్లు వెల్లడించారు. దీని వల్ల వాళ్లలో 13 మంది ప్రాణాలు నిలబడ్డాయని చెప్పారు. ఆరుగురికి గుండె జబ్బులు నయం అయ్యాయని వివరించారు. పలువురిలో బ్లడ్ షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గాయట.

ఫైబర్ శరీరంలో ఏం చేస్తుంది?

ఆహారం చిన్న పేగులో ఉన్నప్పుడు ఎక్కువగా ఉన్న ఫైబర్, శరీరం కొవ్వును తీసుకునే శక్తిని పెంపొందిస్తుంది. మన పెద్ద పేగుల్లో ఉండే బ్యాక్టీరియా ఫైబర్‌ను తిని బతుకుతుంది. పెద్ద పేగులో ఫైబర్ తక్కువైతే, అక్కడవుండే బ్యాక్టీరియా ప్రమాదకర కెమికల్స్‌ను ఉత్పత్తి చేస్తుందని సైంటిస్టులు పేర్కొన్నారు. వీటిలో ఫాటీ యాసిడ్స్ కూడా ఉంటాయట. శరీరం వీటిని పీల్చుకోవడం వల్ల అనారోగ్యం కలుగుతుంది.



హ్యూమన్ రేటింగే కీలకం

బడ్జెట్‌లో సగం దానికే.. గగన్‌యాన్‌పై ఇస్రో

మనిషిని అంతరిక్షానికి సేఫ్‌గా తీసుకెళ్లేందుకు, వ్యవస్థలు విఫలమై విపత్కర పరిస్థితులొచ్చినప్పుడు స్పేస్ మాడ్యూల్‌లోని సిబ్బందిని రక్షించే అవసరమైన అధునాతన టెక్నాలజీ ఉంది అని నిర్ధారిస్తూ సర్టిఫికెట్ ఇవ్వడమే హ్యూమన్ రేటింగ్.

బెంగళూరు: మనోళ్లను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్‌ను 2021 డిసెంబర్‌లో చేపట్టేందుకు ఇస్రో నిర్ణయించింది. అంతకన్నా ముందు 2020 డిసెంబర్, 2021 జూలైలో రెండు మానవ రహిత ప్రయోగాలను చేయాలని నిర్ణయించింది. శుక్రవారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చీఫ్ కే శివన్ ఆ ప్రయోగానికి సంబంధించి మాట్లాడారు. ఎంతమందిని పంపాలన్న దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని మరోసారి స్పష్టం చేశారు. "ముగ్గురు ఆస్ట్రోనాట్లు ఏడు రోజుల పాటు అంతరిక్షంలో గడిపేలా స్పేస్ క్యాప్సూల్‌ను నిర్మించాలనుకుంటున్నాం. అయితే, ఇదే తొలి మనావ సహిత ప్రయోగం కాబట్టి ఎంతమందిని పంపించాలన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఆ వివరాలు తెలుస్తాయి" అని ఆయన చెప్పారు. సీనియర్ సైంటిస్ట్ ఉన్నికృష్ణన్ నాయర్ ఆధ్వర్యంలో కొత్తగా హ్యూమన్ స్పేస్‌ఫ్లైట్ సెంటర్ (హెచ్‌ఎస్‌సీ)ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. హెచ్‌ఎస్‌సీకి డైరెక్టర్‌గా ఉంటారన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆర్ హుట్టన్‌ను ఎంపిక చేశామని చెప్పారు. రాకెట్ సహా ముఖ్యమైన వ్యవస్థలన్నింటికీ కీలకమైన హ్యూమన్ రేటింగ్ చేయాల్సి ఉందని తెలిపారు.

సగం డబ్బు దానికే

ఇంకా చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని, దానిపైనే దృష్టి పెట్టామని శివన్ తెలిపారు. కేబినెట్ ఆమోదించిన రూ.10 వేల కోట్లలో 50 శాతం డబ్బు పలు వ్యవస్థల హ్యూమన్ రేటింగ్‌కే పోతుందని, ఆస్ట్రోనాట్లను స్పేస్ మాడ్యూల్‌లోకి ఎక్కించే కొత్త లాంచ్‌ప్యాడ్‌కు మరికొంత డబ్బు అవసరమవుతుందని శివన్ చెప్పారు. "మూడు సెట్ల రాకెట్లు, క్రూ అండ్ సర్వీస్ మాడ్యూల్‌లను తయారు చేస్తున్నాం. వాటన్నింటినీ హ్యూమన్ రేటింగ్ చేయాల్సి ఉంటుంది. వాటన్నింటికి ఎంత ఖర్చవుతుందో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేను. మూడు జీఎస్ఎల్వీ మార్క్ 3 రాకెట్ల తయారీ, వ్యవస్థల హ్యూమన్ రేటింగ్‌కే బడ్జెట్‌లో 50 శాతం ఖర్చవుతదని మాత్రం చెప్పగలను" అని శివన్ వెల్లడించారు. అందులో ఒక్కో సెట్టును రెండు మానవ రహిత ప్రయోగాలు, చివరగా చేసే మానవ సహిత ప్రయోగానికి వాడతారని చెప్పారు. ఇక, ఆస్ట్రోనాట్ల ఎంపిక, శిక్షణ కోసం కొత్తగా ఫెసిలిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. ప్రయోగానికి సంబంధించి ఇంకా కొన్ని సన్నాహక పనులు చేయాల్సి ఉందని, దానికీ 10 శాతం డబ్బు కావాల్సి ఉంటుందని చెప్పారు.



- 2021 డిసెంబర్‌లో మానవ సహిత గగన్‌యాన్
- 2020 డిసెంబర్, 2021 జూలైలో మానవ రహిత ప్రయోగాలు
- వాటి కోసం మూడు సెట్ల రాకెట్లు, వ్యవస్థల తయారీ: ఇస్రో చైర్మన్

0.99 కాదు... 0.998 కోసం ప్రయత్నం

రాకెట్ హ్యూమన్‌రేటింగ్‌కు సంబంధించి ఇప్పటికే దాదాపు పదిసార్లు సమావేశమయ్యామని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్.సోమ్‌నాథ్ చెప్పారు. జీఎస్ఎల్వీని అభివృద్ధి చేయడం ప్రారంభించిన 2002-2004 నుంచే మానవ సహిత ప్రయోగాలకూ వాడుకునేలా తీర్చిదిద్దామన్నారు. కాబట్టి దీనికి హ్యూమన్ రేటింగ్ ఇవ్వడం చాలా సులభమవుతుందన్నారు. రాకెట్‌కు 0.99 హ్యూమన్ రేటింగ్ ఉంటే మంచిదన్నారు. అంటే 100లో ఒక శాతం విఫలమవడమని అర్థమన్నారు. క్రూమాడ్యూల్ సిస్టం చాలా కీలకం కాబట్టి దానికి మాత్రం 0.998 కన్నా ఎక్కువ రేటింగ్ కోరుకుంటున్నామని, అంటే 100 శాతం సక్సెస్ ఉండేలా చూసుకుంటున్నామని ఆయన చెప్పారు. క్రూ అబార్ట్ సిస్టం చాలా కీలకం కాబట్టి.. దానికి సంబంధించి ఎన్నో టెస్టులు చేస్తున్నామన్నారు. గత ఏడాది జూలై 5న ప్యాడ్ అబార్ట్ టెస్ట్ (పీఏటీ)ని నిర్వహించామన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఆస్ట్రోనాట్లను సేఫ్‌గా భూమిపైకి తీసుకొచ్చేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు.

అమెరికా, చైనా చేతులు కలిపాయ్

బీజింగ్: అమెరికా, చైనా.. రెండు శత్రు దేశాలు. రెండింటికీ క్షణం పడదు. అలాంటిది రెండు దేశాలు చేతులు కలిపాయట తెలుసా? చైనా ఇటీవల ప్రయోగించిన చాంగీ 4 మూన్ ల్యాండింగ్‌కు అమెరికా తన వంతు సాయం చేసిందట. ఆ ప్రయోగం సందర్భంలో చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సీఎన్ఎస్ఏ)తో కలిసి నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పనిచేసిందట. అంతేకాదు, చాంగీ 4 ల్యాండింగ్‌ను నాసా లూనార్ రికనైసెన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్వో) ఉపగ్రహంతో పర్యవేక్షించిందట. చైనాతో అంతరిక్ష సంబంధ కార్యకలాపాలపై నిషేధం విధించిన 2011 నుంచి.. ఇలా చైనాకు నాసా సహకరించడం ఇదే తొలిసారట. స్వయానా చైనా అధికారిక పత్రిక వెల్లడించిందీ విషయం. గత ఏడాది ద్వితీయార్థంలో అమెరికా స్పేస్ సైంటిస్టులతో చైనా స్పేస్ ఏజెన్సీ అధికారులు చర్చలు జరిపారని, చంద్రుడిపై ల్యాండింగ్ టైం, దిగే చోటు గురించి నాసాకు చైనా సైంటిస్టులు ముందే చెప్పారని ఆ పత్రిక వెల్లడించింది.

మనం చూడని చంద్రుడిదిగో..

ఎప్పుడూ చంద్రుడిని మనం ఒకవైపే చూస్తుంటాం. రెండో వైపు ఎవరికీ కనిపించదు. ఆ రెండోవైపునూ చైనా చాంగీ 4 ల్యాండర్ చూపించింది. 360 డిగ్రీల లెన్స్ జేడ్ ర్యాబిట్ 2ను ఫొటోలు తీసింది. తద్వారా చంద్రుడి రెండోవైపు అందరికీ తెలిసేలా చేసింది. దక్షిణ ధృవంలోని వోన్ కర్మన్ గొయ్యి వద్ద ఉన్న చంద్రుడి ఉపరితలాన్ని పనోరమిక్ ఇమేజ్‌లో బంధించింది. దిగాక అక్కడున్న 200 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు నిద్రావస్థలో ఉన్న రోవర్.. గురువారం ఉష్ణోగ్రతలు తగ్గడంతో పనిని ప్రారంభించింది. చైనా స్పేస్ ఏజెన్సీ ఆ ఫొటోలను షేర్ చేసింది.



చాంగీ 4 కెమెరా తీసిన ఫస్ట్ పనోరమిక్ ఫొటో ఇదే. ఆ ఫొటోలోని ఎడమవైపు భాగం ఇది



పనోరమిక్ ఫొటోలో కుడివైపున్న రెండో భాగం ఫొటో

పాస్ఫరస్ అయిపోతోంది

మనం రోజూ వాడే అగ్గిపుల్ల దేని వల్ల మండుతుందో తెలుసా? పాస్ఫరస్. అదేనండి భాస్వరం. దీన్ని అగ్గిపుల్లల్లోనే కాదు వ్యవసాయానికి ఎరువుల్లో వాడుతుంటారు. మనం తీసుకునే ఆహారంలోనూ ఉంటుంది. అంతెందుకండి మన శరీరంలోనే ఉంది. సాధారణ మనిషిలో 0.5 కేజీల భాస్వరం ఉంటుంది. ఎముకలు, దంతాలకు గట్టిదనాన్నిచ్చేది ఇదే. మన మెదడులోనూ ఉంది. అక్కడి దాకా ఎందుకు డీఎన్ఏ, ఆర్ఎన్ఏలను గట్టిగా పట్టి ఉంచేదీ ఇదే. మొత్తంగా పాస్ఫరస్ లేకుంటే జీవం అసాధ్యమనే చెప్పాలి. ఇంత ముఖ్యమైన పాస్ఫరస్ ఇప్పుడు అంతరించిపోయే దశలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా దీని నిల్వలు అడుగంటిపోతున్నాయి. మరో 30 నుంచి 40 ఏళ్లలో భాస్వరం దొరకదని సైంటిస్టులు అంటున్నారు.

మనుషుల వేస్ట్ నుంచి

ఎరువుల్లో వాడే పాస్ఫరస్ నదుల ద్వారా సముద్రాల అడుగుకు చేరుతోంది. అక్కడి నుంచి దాన్ని తీయడం ప్రస్తుతం శక్తికి మించిన పని. మనుషులు ఏటా తమకు కావాల్సిన పాస్ఫరస్ కన్నా 30 లక్షల టన్నులు ఎక్కువ తీసుకుంటున్నారని సైంటిస్టులు అంటున్నారు. మలమూత్రాల ద్వారా అది బయటకుపోతోందని చెబుతున్నారు. వాటి నుంచి తీసే మార్గం కనుగొంటే మాత్రం అద్భుత అవకాశమే అంటున్నారు.

ఇంతకీ దీన్నెలా కనుగొన్నారు?

ఇండియాను కనుగొనేందుకు బయలుదేరిన కొలంబస్ అమెరికాను కనుగొన్నాడు కదా. పాస్ఫరస్ విషయంలోనూ అచ్చం ఇలానే జరిగింది. 17వ శతాబ్దానికి చెందిన జర్మన్ ఆల్కెమిస్ట్ హెన్నిగ్ బ్రాండ్ కూడా సాధారణ లోహాలను బంగారంలా మార్చే ఫిలాసఫర్స్ స్టోన్‌ను కనుగొనేందుకు ప్రయత్నం మొదలెట్టాడు. మనిషి మూత్రంలోనే అది ఉందని భావించాడు. 1669లో పని మొదలెట్టారు. భారీగా మనిషి యూరిన్ సేకరించి ఒక ప్రాంతంలో పులియబెట్టాడు. అలా వచ్చిన పదార్థాన్ని డ్రై డిస్టిలేషన్ ప్రక్రియ ద్వారా వేడి చేశాడు. చివరకు తెల్లని మైనం లాంటి పదార్థం మిగిలింది. అయితే అది గాలి తాకితే మండిపోయేది. దీంతో ఆ పదార్థానికి 'లైట్ బేరర్' అని పేరు పెట్టాడు. కానీ దాంతో సీసాన్ని బంగారంగా మార్చాలనుకున్నా ప్రయత్నం మాత్రం ఫలించలేదు.



- అంతరించిపోతున్న జాబితాలో భాస్వరం
- 30, 40 ఏళ్లకు మించి దొరకదంటున్న సైంటిస్టులు

మంచీ చెడూ రెండూ

సైంటిస్టు బ్రాండ్ కనుగొన్న 50 ఏళ్ల తర్వాత జొహన్ థామస్ హెన్సింగ్ మనిషి మెదడులోనూ పాస్ఫరస్ ఉంటుందని చెప్పాడు. మెదడులోనే ఉంది కాబట్టి ఇదేమంత ప్రమాదకరం కాదని నమ్మారు ప్రజలు. ఔషధాల్లోనూ పాస్ఫరస్‌ను వాడారు. కానీ బెడిసికొట్టింది. ఒక కిలో శరీర బరువుకు ఒక మిల్లీగ్రామ్ పాస్ఫరస్ తీసుకుంటే ఒళ్లంతా విషమెక్కి పోద్ది మరి. ఇక్కడ చెప్పుకోవాల్సిందేమంటే భాస్వరాన్ని రెండు రకాలుగా వాడుతారు. మనం తినే ఆహారంలో అంటే మాంసం, సముద్ర ఆహారం, పప్పుధాన్యాలు, బీన్స్, గింజలు మరియు విత్తనాల్లో పాస్ఫరస్ ఎక్కువగా ఉంటుంది. ఇంకోవైపు ఎలుకలను చంపేందుకు దీన్నే వాడుతాం. ముఖ్యంగా రసాయన ఆయుధాలు సారిన్, వీఎక్స్ పాస్ఫరస్ పదార్థాలే. పొటాషియం సయనైడ్ కన్నా సారిన్ 21 రెట్లు డేంజర్. ఇక నైట్రోజన్‌తో కలసిన పాస్ఫరస్‌ను ఎరువుల్లోనూ వాడతారు.

చైనాలో మెంగ్లా వైరస్?

ఎబోలా కంటే ప్రమాదం

పండ్ల గబ్బిలాలు గుర్తున్నాయా? కేరళలో నిపా వైరస్‌తో కలకలం సృష్టించాయి కదా. ఈసారి మరో కొత్త వైరస్‌ను మానవాళి మీదకు తేబోతున్నాయి. ఎబోలా జబ్బు లక్షణాలుండే 'మెంగ్లా వైరస్'ను చైనాలోని పండ్ల గబ్బిలాల్లో ఉన్నట్లు సైంటిస్టులు అనుమానిస్తున్నారు. ఎబోలాలానే మెంగ్లా కూడా ఫిలో వైరస్ కుటుంబానికి చెందినది. ఇది మనుషులకు, జంతువులకు సోకే ప్రమాదం ఉందని సింగపూర్, చైనా సైంటిస్టుల టీమ్ హెచ్చరించింది. ఈ వైరస్ సోకితే ప్రాణాంతక జ్వరం వస్తుందని తెలిపింది. కొన్ని రోజుల్లోనే రోగి అవయవాలపై దాడి చేసి మరణానికి కారణమవుతుందని పేర్కొంది. ఇప్పటివరకూ ప్రపంచంలో ఫిలో కుటుంబానికి చెందిన ఏడు వైరస్‌లను సైంటిస్టులు గుర్తించారు. ఎబోలా, మెంగ్లా వైరస్‌లు పండ్ల గబ్బిలాల లాలాజలం నుంచి పుడుతున్నాయని భావిస్తున్నారు.



స్పీడ్: 350 కి.మీ.. మోడ్: ఆటో

తనే రైలు.. తనే డ్రైవర్

ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన బుల్లెట్ ట్రైన్, అతి వేగవంతమైన సెల్ఫ్ డ్రైవింగ్ ట్రైన్ కూడా కాబోతోంది. సీటీసీఎస్3+ఏటీవో టెక్నాలజీతో ఫక్సింగ్‌ను డ్రైవర్ లేకుండా పరుగులు పెట్టించేందుకు చైనా సిద్ధమవుతోంది. 2017లో గంటకు 350పైచిలుకు వేగంతో ప్రయాణించిన ఫక్సింగ్ ఫాస్టెస్ట్ ట్రైన్ ఇన్ ది వరల్డ్‌గా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. దీని గరిష్ఠ వేగం 400 కిలోమీటర్లు. ఎక్కువ వేగం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ఒకింత తక్కువ స్పీడుతోనే నడుపుతున్నారు. ఫక్సింగ్ రంగ ప్రవేశం చేసిన తర్వాత చైనా ఊరుకోలేదు. దానికి డ్రైవర్ లెస్ టెక్నాలజీని జోడించేందుకు కృషి చేసింది.

ఏంటీ సీటీసీఎస్3 + ఏటీవో వ్యవస్థ?

బుల్లెట్ రైళ్ల ఆపరేటింగ్, కంట్రోల్ సిస్టమ్స్‌లో ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్(ఏటీవో) వ్యవస్థను అమర్చుతారు. ఇది తన సొంతంగా రైలును ఆపుతుంది. పరుగెత్తిస్తుంది. వేగాన్ని పెంచుకుంటుంది. తగ్గించుకుంటుంది. అదనంగా రైలు ఆగిన ప్రతి చోటా పెట్టెల తలుపులు వాటంతట అవే తెరచుకునేలా చేస్తుంది. రైలును నడపడానికి మనిషి పని లేకపోవడం వల్ల, గరిష్ఠ వేగంతో నడిపే చాన్స్ ఉంటుంది. ఫలితంగా ప్రయాణ వ్యవధి బాగా తగ్గుతుంది. ప్రమాద అవకాశాలు బాగా తగ్గుతాయి. పేరుకు డ్రైవర్ లెస్ టెక్నాలజీ అయినా, బుల్లెట్ రైళ్లలో డ్రైవర్లు ఉంటారు. అయితే గతంలోలా వారిపై పని ఒత్తిడి ఉండదు. వీళ్లు అత్యవసర సమయాల్లో టెక్నాలజీ సాయంతో రైలును నిలుపుదల చేస్తారు.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.